ఈ పేపర్ కోసం www.visionandhra.in చూడండి



# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

శుక్రవారం 05 జూన్ 2026 | సంపుటి: 28 సంచిక: 66 | Friday 05 June 2026 | Vol.No 28 Issue No .66 | హైదరాబాద్ Hyderabad | ⇨ పేజీలు: 12+12 | ⇨ వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA | www.visionandhra.in




## మార్కెట్ వ్యాల్యూ ప్రకారం
# భూముల ధరలు

- నేటి నుంచే అమల్లోకి పెంచిన రేట్లు
- రూ.1200 నుంచి రూ.1400 కోట్ల మేర ఆదాయం
- సబ్ రిజిస్ట్రార్ల అధికారాలకు కత్తెర
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్,జూన్4 : మార్కెట్ వ్యాల్యూ ప్రకారం భూముల ధరలు శుక్రవారం నుంచి పెరుగుతాయని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. భూముల ధరలు ఏరియాను బట్టి 50 నుంచి100 శాతం పెరుగుతాయని తెలిపారు. ప్రైమ్ ఏరియాలో 100 శాతం పెరుగుతాయన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విలేకర్లతో మాట్లాడారు. భూముల వ్యాల్యూ పెరగటంతో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1200 నుంచి రూ.1400 కోట్ల మేర ఆదాయం వస్తుందని చెప్పారు. హయ్యర్ సైడ్ ఏరియాలు శేరిలింగంపల్లి, రాజేందర్ నగర్, ఖాజాగూడ తదితర ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగవన్నారు. ఆయా ప్రాంతాల్లో ఛార్జీలు పెంచే ఆలోచన ప్రభుత్వానికి లేదని తెలిపారు. ఇక నుంచి సబ్ రిజిస్ట్రార్లకు ఫుల్ పవర్స్ కట్ చేశామని.. వారికి మినిమమ్ పవర్స్ మాత్రమే ఉంటాయని మంత్రి పొంగులేటి వివరించారు. భూ సేకరణ సమయంలో ప్రభుత్వానికి కొంత నష్టం జరిగిందన్నారు. కానీ రైతులకు మాత్రం లాభం జరుగుతుందన్నారు. ఇన్నర్ సైడ్ ఎకరం కనీసం రూ.15 లక్షలు ఉందని చెప్పారు. లోయర్ సైడ్ ఏమైనా పొరపాటు జరిగితే మార్పులు చేర్పులు ఉంటాయని చెప్పారు. హయ్యర్ సైడ్ మాత్రం మార్పులు ఉండవన్నారు. సమస్యలు ఉంటే.. హెల్ప్ డెస్క్ ఫోన్ నెంబర్ ఏర్పాటు చేస్తామని పబ్లిక్‌కు ఆయన సూచించారు. త్వరలో తహసీల్దార్ల బదిలీలు ఉంటాయని చెప్పారు. ఫ్యూచర్ సిటీని రద్దు చేసి అవకాశమే లేదని స్పష్టం చేశారు. రెవెన్యూ విషయంలో.. తెలంగాణను మిగతా రాష్ట్రాలు మోడల్‌గా

మిగతా 2లో..

## కొడంగల్ ఎత్తిపోతల ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు

- ప్రాజెక్టు పనుల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ పరిశీలన
- త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



నారాయణపేట,జూన్4 : మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. బీమా కృష్ణా నదులపై నిర్మించనున్న ప్రాజెక్టు పనుల పురోగతిపై గురువారం ముఖ్యమంత్రి బెంగుళూరు నుంచి నేరుగా మక్తల్ చేరుకోగా ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలకు జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన

మిగతా 2లో..



## తెలంగాణ ఉద్యమకారులకు
# న్యాయం చేస్తాం

- ఉద్యమకారుల సంఘాలను కలిసి వివరాలు సేకరిస్తాం
- అఖిలపక్ష భేటీలో కమిటీ చైర్మన్ కేశవరావు

హైదరాబాద్,జూన్4: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ప్రత్యక్షంగా.. పరోక్షంగా పాల్గొన్న ఉద్యమకారులందరికి న్యాయం చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని కె. కేశవరావు స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం కె. కేశవరావు అధ్యక్షతన ఏర్పాటైన కమిటీతో గురువారం హైదరాబాద్ సచివాలయంలో అఖిల పక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం కేకే మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉద్యమకారుల సంఘాలను మళ్లీ కలుస్తామని అన్నారు. అందుకోసం ఉద్యమకారులందరినీ పిలిచి మాట్లాడతామని పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం చేయాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని వివరించారు. ఈ అఖిల పక్షం సమావేశంలో అన్ని పార్టీల నేతలు పాల్గొన్నారని చెప్పారు. విద్యార్థులతో, ఉద్యమకారుల సంఘాలతో అనుబంధం ఉన్న వారిని మళ్లీ కలుస్తామని కె.కేశవరావు తెలిపారు. ఉద్యమకారులందరిని పిలిచి మాట్లాడుతామన్నారు. తెలంగాణ తొలి

మిగతా 2లో..

## పవన్ కళ్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడారా?



- మీటింగ్‌కు అనుమతి ఎందుకు ఇవ్వలేదో చెప్పాలి
- ఇంకా సెంటిమెంట్ రాజకీయాలతో మోసం చేస్తే ఊరుకోరు
- బిఆర్ఎస్, కాంగ్రెస్‌ల తీరుపై మండిపడ్డ బిజెపి అధ్యక్షుడు

హైదరాబాద్,జూన్4 : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా ఎప్పుడు మాట్లాడలేదని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. ఆయన మీటింగ్‌కి అనుమతి ఇస్తే ఏమవుతుందని రాంచందర్ రావు ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్‌లో రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ సెంటిమెంట్‌ని మరోసారి రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణను వ్యతిరేకించిన ఎంఐఎంని ఎందుకు దగ్గరకు తీసుకున్నారని ప్రశ్నించారు. తెలంగాణ సెంటిమెంట్ పేరుతో మళ్లీ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాంచందర్ రావు ఆగ్రహించారు.

మిగతా 2లో..

## ఇండియా కూటమికి బీటలు

- 8వ తేదీ ఇండియా కూటమిని బహిష్కరించిన డీఎంకె
- హాజరు కాబోవడం లేదని ప్రకటన విడుదల



న్యూఢిల్లీ,జూన్4 : అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం తమిళనాడులో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఇండియా కూటమికి బీటలు వారాయి. ఇందులో భాగస్వామి అయిన డీఎంకే కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 8వ తేదీన దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగే ఇండియా కూటమి సమావేశాన్ని బహిష్కరించాలని డీఎంకే నిర్ణయించింది. కాంగ్రెస్ పార్టీ పాల్గొనే ఈ భేటీకి వెళ్లే ప్రసక్తే లేదంటూ చెన్నైలోని డీఎంకే ప్రధాన కార్యాలయం గురువారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత

మిగతా 2లో..

## కార్మికులకు అండగా నిలిచేది బిఆర్ఎస్

- కార్మికుల సమస్యలపై సిఎంకు పట్టింపు లేదు
- జలమండలి గేట్ మీటింగ్‌లో తలసాని శ్రీనివాసయాదవ్




హైదరాబాద్,జూన్4 : ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై పోరాడేది గులాబీ జెండా మాత్రమేనని మాజీమంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం ఖైరతాబాద్ జలమండలి కార్యాలయం వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌కు ఆయన హాజరై ప్రసంగించారు. వాటర్ బోర్డులో 50 సంవత్సరాల లో ఎన్నడూ లేని విధంగా కేసీఆర్ ప్రభుత్వం 650 మంది ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వాటర్ వర్క్స్ బోర్డు లోని ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై అవగాహన ఉన్న రాంబాబు యాదవ్‌ను 6 వ తేదీన జరిగే గుర్తింపు ఎన్నికలలో గెలిపించుకోవాలని తలసాని పిలుపునిచ్చారు. మున్సిపల్ శాఖను తన వద్ద పెట్టుకున్నముఖ్యమంత్రి రెండున్నర సంవత్సరాలలో ఒక్కసారైనా సమీక్ష చేశారా? అని తలసాని ప్రశ్నించారు. మీ సమస్యలపై ముఖ్యమంత్రికే పట్టింపు లేనప్పుడు ఆ పార్టీకి సంబంధించిన వ్యక్తిని గెలిపిస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలన చేతకాక ప్రశ్నించే వారిపై ఎదురుదాడి చేస్తున్నారని, అక్రమ కేసులు పెడుతున్నారని తలసాని ఆగ్రహం వ్యక్తం

మిగతా 2లో..

## ఎల్ నినో ప్రభావంపై రైతులకు అవగాహన

- వర్షాభావంపై సన్నద్ధం చేయండి
- వ్యవసాయాధికారులకు మంత్రి తుమ్మల సూచన




హైదరాబాద్,జూన్4 : వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులను ముందుగానే సన్నద్ధం చేయాలని ఉన్నతాధికారులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లో వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఎల్ నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటల సాగుపై గ్రామసభల్లో రైతులకు అవగాహన కల్పించేలా చర్యలు

మిగతా 2లో..

## రెండేళ్ల కూటమి విజయాలపై ప్రజలకు వివరణ

- మంత్రులంతా ప్రజల్లోకి వెళ్లి చెప్పాలి
- కేబినేట్ భేటీలో సిఎంచంద్రబాబు సూచన



అమరావతి,జూన్4 : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా అందరూ ప్రజల్లోకి వెళ్లాలని మంత్రులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. గురువారం సీఎం అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తమ శాఖలో చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని మంత్రులకు సూచించారు. గత

మిగతా 2లో..

## సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టి

- మానవ అక్రమ రవాణాను నిరోధించేలా చర్యలు
- సుప్రీంకోర్టు పలు కీలక ఆదేశాలు



న్యూఢిల్లీ,జూన్4 : పిల్లల అక్రమ రవాణా నిరోధానికి సంబంధించిన కేసులో విచారణ చేపడుతున్న సుప్రీంకోర్టు.. సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టి సారించింది. ఈ కేసులో అమికస్ క్యూరీగా వ్యవహరిస్తున్న సీనియర్ అడ్వకేట్ అపర్ణా భట్ చేసిన సూచనలను పరిశీలించింది. మానవ అక్రమ రవాణాను

మిగతా 2లో..

## అమీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం

- కేఎస్స్టార్ ఫ్యాషన్స్ దుకాణంలో మంటలు
- ఆస్తి, ప్రాణనష్టంపై అందని వివరాలు
- రంగంలోకి దిగిన ఫైర్ ఇంజన్లు, పోలీసులు
- అమీర్‌పేట-ఎస్సార్ నగర్ మధ్య ట్రాఫిక్ క్రమబద్ధీకరణ




హైదరాబాద్,జూన్4 : హైదరాబాద్ అమీర్‌పేటలో గురువారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. శ్రీనివాసనగర్ వెస్ట్‌లో, మెట్రో పిల్లర్ నంబర్ – 1043 సమీపంలో ఉన్న కేఎస్స్టార్ ఫ్యాషన్స్

మిగతా 2లో..

## అవయవ మార్పిడి చట్టానికి ఆమోదం

- వివిధ రాష్ట్రాల్లో ఉన్నట్లుగానే అమలు
- బీచ్ షాక్స్ పాలసీకు కేబినెట్ ఆమోదం
- భీమిలీ తదితర బీచ్‌లలో పైలట్ ప్రాజెక్టుగా అమలు
- క్వాంటమ్ వ్యాలీ భూములకు స్టాంపు డ్యూటీ మినహాయింపు
- ఏవియేషన్ పాలసీ-2026కు కేబినెట్ ఆమోదం
- కృష్ణా నది తీరంలో 'అమరావతి ఐ' ప్రాజెక్టు
- ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంపు
- ఎపి కేబినేట్ వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి



అమరావతి,జూన్4 : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఏపీ కేబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్న ఈ సమావేశంలో వివిధ అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఆ నిర్ణయాలను మంత్రి పార్థసారథి మీడియాకు వివరించారు. ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ చట్టం అమలుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. 2011 కేంద్ర చట్టాన్ని ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసేందుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. అవయవ మార్పిడి ప్రక్రియలో పారదర్శకత, వైద్య సదుపాయాల మెరుగుదల లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో ఇప్పటికే అమలులో ఉన్న విధానాన్ని అమలు చేయనున్నట్లు మంత్రి చెప్పారు. సుప్రీం కోర్టు సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ

మిగతా 2లో..

## దేశానికి యువతే ప్రాణం

- యువతను తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటా
- ఎక్స్ వేదికగా పవన్ కళ్యాణ్ వెల్లడి



అమరావతి,జూన్4 : తన రాజకీయ ప్రయాణంలో యువత పాత్రను ప్రత్యేకంగా స్మరించుకుంటూ జనసేన అధినేత పవన్ కల్యాణ్.. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు

మిగతా 2లో..

## దేశానికి యువతే ప్రాణం

చేశారు. 2008లో ప్రజారాజ్యం పార్టీ(పీఆర్పీ) యువజన విభాగం 'యువరాజ్యం' కోసం పటిష్ఠమైన యువజన విభాగం నిర్మించాలని ప్రణాళిక చేశానని తెలిపారు. జనసేన పార్టీని స్థాపించి 12 ఏళ్లలో ఎన్నో కష్టాలు, పోరాటాలను అధిగమించిన తర్వాత.. పార్టీ కార్యకర్తలు ఇప్పుడు అనుభవం, పరిణితితో నిండి, సంస్థాగత బాధ్యతలు చేపట్టడానికి, రాజకీయాలు నిర్వహించడానికి, ప్రజా సమస్యలు పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ యువరాజ్యం యువజన విభాగానికి పవన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. 2005 నుంచి ఇప్పటి వరకు తనను విశ్వసించి అండగా నిలిచిన యువతకు పవన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నిజాయితీ, నిబద్ధత, దేశభక్తి కలిగిన యువతను, చైతన్యవంతమైన నాయకులను తీర్చిదిద్దేందుకు తాను కృషి చేస్తానని పవన్ ప్రతిజ్ఞ చేశారు. నూతన భారత్.. జెన్‌జెడ్ తరం నుంచి అద్భుతమైన నాయకుల ఆవిర్భావానికి సాక్ష్యంగా నిలుస్తుందన్నారు. జెన్‌జెడ్ తరం.. బుజ్జగింపు రాజకీయాలు, వంశపారంపర్య రాజకీయాలు, కుల రాజకీయాలు, విభజన రాజకీయాలు, ప్రాంతీయ రాజకీయాలతో విసిగిపోయిందని అభిప్రాయపడ్డారు. ఈ తరం.. జవాబుదారీతనం గల రాజకీయాలను తీసుకురాగల నాయకుల కోసం ఎదురుచూస్తోందని చెప్పారు. అంతేగానీ, ప్రపంచ వేదికలపై భారత్‌ను బలహీనపరిచే నాయకుల కోసం కాదన్నారు. బలమైన, పటిష్ఠమైన భారత్‌ను నిర్మించగల నాయకుల కోసం జెన్‌జెడ్ యువత ఎదురుచూస్తోందని ఎక్స్ ఖాతాలో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.

## ఇండియా కూటమికి బీటలు

కాంగ్రెస్ పార్టీ తమకు తీవ్ర ద్రోహం చేసిందంటూ డీఎంకే సంచలన ఆరోపణలు చేసింది. కాంగ్రెస్ పార్టీ వైఖరితో డీఎంకే శ్రేణులు తీవ్ర మనస్తాపం చెందాయని వివరించింది. అందులో భాగంగా కేడర్ భావాలను గౌరవిస్తూనే ఇండియా కూటమి భేటీకి దూరంగా ఉండాలని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం ఎం.కె. స్టాలిన్ నిర్ణయం తీసుకున్నట్లు ఆ ప్రకటనలో వివరించింది. జూన్ 8వ తేదీన ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ వేదికగా ఇండియా కూటమి అత్యవసర సమావేశం జరగనుంది. ఈ కూటమి సమావేశానికి హాజరు కావాలని ఆ పార్టీ భాగస్వామ్య కూటమిల నుంచి డీఎంకేకు ఆహ్వానం అందింది. అయినప్పటికీ.. హాజరు కాకూడదని డీఎంకే అధిష్ఠానం నిర్ణయించింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రవర్తించిన తీరుపై డీఎంకే శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహం వచ్చింది. తమ పార్టీ కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ చేసిన ద్రోహాన్ని క్షమించేది లేదంటూ డీఎంకే ఒక ప్రకటన విడుదల చేసిన విషయం విదితమే. ఇండియా కూటమి ఏర్పడినప్పటి నుంచి డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా డీఎంకే గుర్తు చేసింది. నీట్, ఒకే దేశం-ఒకే సారి ఎన్నికలు, వక్ఫ్ చట్టాలకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో తమ పోరాటం కొనసాగుతుందని డీఎంకే వెల్లడించింది. కూటమితో భేటీకి దూరంగా ఉన్నప్పటికీ, ప్రజా వ్యతిరేక విధానాలపై ఇతర పార్టీల పోరాటాలకు మద్దతు ఇస్తామని డీఎంకే ప్రకటించింది. దీంతో డీఎంకే - కాంగ్రెస్ బంధంలో వివాదం ముదిరినట్లు అయింది. అంతేకాకుండా జాతీయ స్థాయిలో ప్రతిపక్ష కూటమికి డీఎంకే భారీ షాక్ ఇచ్చినట్లు అయింది.

## ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన

తీసుకోవాలని తెలిపారు. తక్కువ నీటితో పంటల సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని అధికారులకు స్పష్టం చేశారు. పంట వ్యర్థాలను కాల్చడంపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అందుకోసం అన్ని జిల్లాల్లో శాటిలైట్ ఆధారిత పంట వ్యర్థాల కాల్చివేతలపై పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. వీటిని నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని వారిని హెచ్చరించారు. కొహెడ అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ శంకుస్థాపనకు ఏర్పాట్లు వేగవంతం చేసినట్లు చెప్పారు. రూ. 2,284.32 కోట్లతో కొహెడలో అంతర్జాతీయ పండ్ల మార్కెట్ నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు. జూన్ 6వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరుగుతుందన్నారు. ఇక వ్యవసాయశాఖకు చెందిన ఖాళీ భూముల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తామన్నారు. ఈ ఆస్తుల రక్షణ కోసం ఐఏఎస్ అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఖాళీ స్థలాల్లో ఎ÷-లాంటేషన్ లేదా లీజు ద్వారా ఆదాయం సమీకరణ చేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. తెలంగాణ ప్రభుత్వానికి చెందిన ఫెర్టిలైజర్ యాప్‌కు కేంద్ర ప్రభుత్వం మరోసారి ప్రశంసలు కురిపించిందని చెప్పారు. తెలంగాణ ఎరువుల పర్యవేక్షణ విధానం దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. కేంద్ర ఫెర్టిలైజర్ యాప్ అమలుకు తెలంగాణను పైలట్ రాష్ట్రంగా ఎంపిక చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. యాప్ సమర్థ అమలుకు రాష్ట్రానికి ప్రోత్సాహకాలు అందిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. జూన్ 4, 6, 8, 10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. రైతులకు క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది సేవలు అందించాలని వారికి మంత్రి పొంగులేటి సూచించారు.

## రెండేళ్ల కూటమి విజయాలపై ప్రజలకు వివరణ

ప్రభుత్వం నిర్వాకాలపై శ్వేతపత్రాలు విడుదల చేశామని.. అప్పటి నుంచి ఈ రెండేళ్లలో ఏం చేశామో శాఖల వారీగా ఈనెల 28లోపు ప్రజలకు వివరించాలని ఆదేశించారు. రైతులు పంట మార్పిడి విధానాన్ని అనుసరించాలని సీఎం చెప్పారు. దేశీయ, స్థానిక అవసరాల మేరకు పంటలు వేసే విధంగా రైతులను ఎడ్యుకేట్ చేయాలని అన్నారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించేందుకు కేబినెట్ సబ్ కమిటీ ఎందుకు వేయలేదంటూ ఉన్నతాధికారులపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అన్ని రకాలుగా మద్దతు ఇస్తున్నా ఎందుకిలా ఉన్నారని అధికారులపై సీరియస్ అయ్యారు. అగ్రిగోల్డ్ కేసులను వెంటనే పరిష్కరించేందుకు మొత్తం 31 కొత్త పోస్టులు మంజూరు చేసిన సీఎం.. వెంటనే కేబినెట్ సబ్ కమిటీని నియమించాలని ఆదేశాలు జారీ చేశారు. ఏపీలో16 వేల టీచర్ పోస్టులను భర్తీ చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. డీఎస్సీపై వైసీపీ అధినేత జగన్ రాద్ధాంతం చేస్తున్నారని.. ప్రజలను అయోమయానికి గురిచేయాలని చూశారని మండిపడ్డారు. 'మనం గట్టిగా తిప్పికొట్టడంతో ఇప్పుడు తోక ముడిచారు. మనం చెప్పేది వివరంగా ప్రజలకు తెలియజేయాలి. అప్పుడు మాత్రమే ప్రజలకు తెలుస్తుంది' అని వివరించారు. ఇటీవల రాజధానిలో కొంతమంది రైతులను జగన్ కలిశారని సీఎం చెప్పగా.. జగన్ దగ్గరకు వెళ్లిన అశోక్ అనే రైతు నిన్న నేలపాడులో తన భూమిని ల్యాండ్ పూలింగ్‌కు ఇచ్చారని మంత్రి నారాయణ తెలిపారు. రైతులను జగన్ గందరగోళంలోకి నెట్టాలని ప్రయత్నం చేస్తున్నారని.. కానీ రాజధాని రైతులు ఇప్పుడు కూడా జగన్ మనస్తత్వాన్ని అర్థం చేసుకున్నారని సీఎం అన్నారు. జగన్ చెప్పిన మాటలను నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. ప్రజలకు నిజాలు వివరిస్తే వాళ్లు పూర్తిగా అర్థం చేసుకుంటారన్నారు. అమరావతి, తిరుపతి, రాజమండ్రి, విశాఖపట్నంలో యోగా డే నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

## సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టి

నిరోధించేలా సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల కోసం ప్రత్యేక మార్గదర్శకాలు (ఎస్ఓపీ) లేవని ఆమె ఈ సందర్భంగా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సరోగసీ, ఐవీఎఫ్ క్లినిక్స్ నియంత్రణ కోసం తీసుకొచ్చిన ఏఆర్టీ చట్టంలో అనేక నిబంధనలు ఉన్నప్పటికీ, చిన్నారుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక ప్రోటోకాల్ లేదని అపర్ణా భట్ పేర్కొన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలు ప్రధానంగా వైద్య ప్రమాణాలు, మౌలిక వసతులకే పరిమితమయ్యాయని వివరించారు. ఈ నేపథ్యంలో నిబంధనలను మరింత కట్టుదిట్టం చేసేందుకు రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీ సూచనలతో సమగ్ర విధానాన్ని రూపొందించాలని ప్రతిపాదించారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని తెలియజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 19కి వాయిదా వేసింది.

## మార్కెట్ వ్యాల్యూ ప్రకారం భూముల ధరలు

తీసుకుంటున్నాయని గుర్తు చేశారు. ఏడాదిన్నరలో 90 శాతం గ్రామాల సర్వే పూర్తవుతుందని ధీమా వ్యక్తం చేశారు. రెవెన్యూలో అవినీతి లేకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఆ క్రమంలోనే అవినీతి నిరోధక శాఖ ట్రాప్‌లు అధికంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ÷ూను వచ్చాక ఏసీబీ ట్రాప్ ఆయిన ్ ÷ల్స్ అన్ని క్లియర్ చేశానని తెలిపారు. గత ప్రభుత్వంలో మూడేళ్లు రెవెన్యూ ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. కానీ తాను వచ్చిన మూడు నెలల్లోనే 3,500 రెవెన్యూ ఫైల్స్ క్లియర్ చేశానని వివరించారు. అసెంబ్లీలో పెండింగ్‌లో ఉన్న 10 ఏళ్ల ఫైల్స్ ఆరు నెలల్లోనే క్లియర్ చేసినట్లు చెప్పారు. తనకు ఏ శాఖ కేటాయించినా.. కళ్లు మూసుకొని పని చేస్తానని పేర్కొన్నారు. ÷-రజలకు, ప్రభుత్వానికి మంచి జరిగే ఏ పని చేయడానికైనా తాను భయపడనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుండబద్దలు కొట్టారు. ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇండ్లకు రూ. 7 వేల కోట్లు చెల్లించామని చెప్పారు. రాష్ట్రంలో పాడి ప్రోక్యూర్‌మెంట్ 90 శాతం పూర్తయిందన్నారు. అసైన్డ్ భూములకు పాలసీ తీసుక వస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు జరిగినవని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం వాటిని నిషేధిత జాబితా లో చేర్చిందని మంత్రి పొంగులేటి వివరించారు.

# తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తాం

దశతోపాటు మలి దశ ఉద్యమకారులందరికీ న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తుందని పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం చేసేందుకు రాజకీయాలకు అతీతంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలంగాణ రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందుకోసం ఉద్యమకారులందరితోనూ మాట్లాడతామన్నారు. నష్టపోయిన అందరికీ న్యాయం చేస్తామని చెప్పారు. ఈ ప్రజా పాలన ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించడానికి ఏర్పాటు చేసిన కమిటీ.. అఖిలపక్ష పార్టీల నుంచి ఇద్దరి చొప్పున పిలిచామని పేర్కొన్నారు. పార్టీలు మాత్రమే కాకుండా ఉద్యోగ, విద్యార్థి, జర్నలిస్ట్, న్యాయవాదులు అందరినీ పిలిచి మాట్లాడతామని వివరించారు. కవులు, కళాకారులు తెలంగాణ సాధన కోసం పని చేసిన అందరిని గుర్తిస్తామన్నారు. ఈ ప్రక్రియ అమరవీరుల ద్వీపంలో ప్రారంభమవుతుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు గౌరవం ఇవ్వాలని, వారిని గుర్తించాలని, అలాగే అందరి నుంచి సూచనలు స్వీకరించాలని నిర్ణయించామన్నారు. రాజకీయాలకు అతీతంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విజ్ఞప్తులు స్వీకరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. ఉద్యమ సమయంలో తన జీవితంలో యవ్వనం పోయిందని.. మమ్మల్ని ఆదుకోవాలని ఉద్యమకారులు కోరుతున్నారని ఎమ్మెల్సీ కోదండరాం తెలిపారు. అందుకోసం ఉద్యమకారుల జేఏసీలు ఉన్నాయని.. వారిందరినీ కలుస్తామన్నారు. అలాగే అన్ని యూనివర్సిటీల జేఏసీలు ఉన్నాయని.. వారితో కూడా సమావేశమవుతామని ఎమ్మెల్సీ కోదండరాం స్పష్టం చేశారు. ప్రజా సంఘాలు, కుల సంఘాలు, విద్యార్థి జేఏసీ, యూనివర్సిటీ జేఏసీలను సంప్రదిస్తామని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ వెల్లడించారు. అందరి సలహాలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన అని చెప్పారు. స్టేక్ హోల్డర్స్‌ను పిలిచి మాట్లాడతామన్నారు. అందరి అభిప్రాయాలు తీసుకొని ఉద్యమకారులను గుర్తిస్తామని పేర్కొన్నారు.

# అవయవ మార్పిడి చట్టానికి ఆమోదం

చట్టాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. బీచ్ షాక్స్ పాలసీకు కేబినెట్ ఆమోదం తెలిపింది. భీమిలి, విశాఖపట్నం, శ్రీకాకుళం, చీరాల బీచ్‌లలో పైలట్ ప్రాజెక్టుగా ఈ పాలసీ అమలు చేయనున్నారు. గోవా, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల అనుభవాలను అధ్యయనం చేసి రాష్ట్రంలో అమలు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే బీచ్ షాక్స్‌లు తెరిచి ఉంచడానికి అనుమతి ఇవ్వనున్నారు. పరిమిత రకాల మద్యం విక్రయాలకు మాత్రమే అనుమతి ఉండనుంది. పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతే తదుపరి విస్తరించే అవకాశం ఉంది. రాజధాని అమరావతి అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, ఏవియేషన్, ఉపాధి, మత్స్యరంగం, పోలవరం, పారిశ్రామిక పార్కులు, పోర్టులు, పర్యాటకం వంటి వివిధ రంగాల్లోని ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతి క్వాంటమ్ వ్యాలీకి కేటాయించిన భూమి రిజిస్ట్రేషన్‌పై స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపును ఆమోదించింది. రాష్ట్రంలో రిజర్వాయర్ల కేజ్ కల్చర్ పాలసీ-2025 ముసాయిదాకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. మద్దువలస, యేలేరు రిజర్వాయర్లలో ఫిషిన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు కేజ్ కల్చర్ యూనిట్ల ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ ఏవియేషన్ పాలసీ-2026కు కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే అగ్రిగోల్డ్ తదితర డిపాజిటర్ల కేసుల పరిష్కారం కోసం 21 పోస్టుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. చిత్తూరు జిల్లాలో వ్యవసాయ శాఖ భూమిపై సోలార్ విద్యుత్ ఎ÷-లాంట్ ఏర్పాటుకు 30 ఏళ్ల లీజు ఇవ్వడానికి అనుమతి ఇస్తూ కేబినెట్ నిర్ణయిం తీసుకుంది. ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ. 300 కోట్ల రుణం పొందేందుకు ప్రభుత్వ హామీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. కృష్ణా నది తీరంలో 'అమరావతి ఐ' ప్రాజెక్టు టెండర్లకు కేబినెట్ అనుమతి ఇచ్చింది. రాజధాని అమరావతిలో పలు నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పనకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. పోలవరం సహా వివిధ ప్రాజెక్టుల పనులకు పరిపాలనా అనుమతులు ఇచ్చింది. ప్రభుత్వ రంగ సంస్థలు, సొసైటీలు, కార్పొరేషన్లు, గురుకులాల్లో పని చేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలనే ప్రతిపాదనపై కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సీపీఎస్ అమల్లోకి రాకముందు ఇచ్చిన నోటిఫికేషన్లలో ఎంపికై.. వివిధ కారణాలతో సీపీఎస్ అమలు తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారికి పాత పింఛను వ్యవస్థ అమలు చేయాలనే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. నెగోషియేటెడ్ సెటిల్‌మెంట్ పాలసీలో సవరణలకు కేబినెట్ ఆమోదించింది. వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవికా మిషన్ ను జులై 1 నుంచి గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేసే ప్రతిపాదనలకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది.

# పవన్ కళ్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడారా?

తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడిన వారితో చేతులు కలిపింది ఎవరో..? బీఆర్ఎస్ నేతలు చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని శక్తులతో అధికార రాజకీయాలు చేసింది ఎవరు..? అని నిలదీశారు. తెలంగాణను తిట్టిన వారిని, ఉద్యమకారులను అవమానించిన వారిని బీఆర్ఎస్‌లో చేర్చి పదవులు ఇచ్చింది ఎవరు..? అని ప్రశ్నించారు. తెలంగాణ పేరుతో రాజకీయాలు చేసే ముందు మీ రాజకీయ చరిత్రను ఒకసారి ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం మీద ప్రేమ ఉంటే డ్రామాలు కాదని... నిజాలు మాట్లాడాలని సవాల్ విసిరారు. ప్రజలు ఇప్పుడు భావోద్వేగాలకు కాదని, మీ గతానికి కూడా లెక్క అడిగే స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్.. జనసేన సభ కోసం అనుమతి అడిగారని... ఇచ్చి ఉంటే కథ అక్కడే ముగిసేదని.. సభకు అనుమతి ఎందుకు ఇవ్వలేదో కాంగ్రెస్ సర్కార్ చెప్పాలని రాంచందర్ రావు ప్రశ్నించారు. ఈ సమావేశం పెట్టుకోవడం ప్రతి ఒక్కరి ప్రజాస్వామ్య హక్కు అని చెప్పారు. దాన్ని అడ్డుకోవడమే ఎందుకు జరిగిందో సమాధానం చెప్పాలని నిలదీశారు. పవన్ కళ్యాణ్ అంశాన్ని బీజేపీ మీద రుద్దే ప్రయత్నం చేయడం రాజకీయ దివాళాకోరుతనమని ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ కలిస్తేనే కొందరి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు. తెలంగాణను వ్యతిరేకించిన వారికి కేసీఆర్ హయాంలో మంత్రి పదవులు ఇచ్చారని రాంచందర్ రావు ఆగ్రహించారు. ఏపీలో బీఆర్ఎస్ ఆఫీస్ పెట్టలేదా..? అని ప్రశ్నించారు. తెలంగాణ నిధులను పంజాబ్‌లో కేసీఆర్ పంచలేదా..? అని నిలదీశారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించలేని పరిస్థితిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉందని విమర్శించారు. బీజేపీ సపోర్ట్ చేయడంతోనే తెలంగాణ వచ్చిందని పేర్కొన్నారు. ఆనాడు పార్లమెంటులో తమ పార్టీ మద్దతు ప్రకటించిందని అన్నారు. సుష్మా స్వరాజ్ బేషరతుగా మద్దతు ఇస్తేనే తెలంగాణ వచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ సర్కార్ ఇస్తానని చెప్పిన జాబ్ క్యాలెండర్ ఏమైంది..? అని రాంచందర్ రావు ప్రశ్నించారు. 12 ఏళ్ల నుంచి నీళ్ల మీద ఒక పాలసీ కూడా ఎందుకు తేలేదని నిలదీశారు. తెలంగాణకు రావాల్సిన నీళ్ల వాటా కంటే తక్కువ వాటాను కేసీఆర్ ఒప్పుకున్నారని ప్రస్తావించారు. రాష్ట్రానికి రావాల్సిన కృష్ణా జలాలను డీకే శివకుమార్‌కి.. రేవంత్‌రెడ్డి బహుమతిగా ఇచ్చారని విమర్శించారు. మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలంగాణను అప్పుల్లోకి నెట్టారని ధ్వజమెత్తారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ సూపర్ హీరో అని రాంచందర్ రావు అభివర్ణించారు. ముమ్ముందు బిజెపి తెలంగాణలో కీలకంగా మారుతుందన్నారు.

# వనపర్తిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**- వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి**

వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 4 (విజన్ ఆంధ్ర) : రాష్ట్రంలోనే వనపర్తిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే మేఘా రెడ్డి అన్నారు. ప్రజాపాలన 99 ప్రగతి ప్రణాళిక వార్డు సభ కార్యక్రమాన్ని గురువారం కర్రెమ్మ గుడి వద్ద అధికారులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఎమ్మెల్యే నామినేషన్ దాఖలు చేయకముందే తాను ప్రజలకు సెల్ఫ్ డిక్లరేషన్ ప్రకటించానని గుర్తు చేశారు. రాజకీయాల్లోకి ఆస్తులు కూడగట్టుకోవడానికి రాలేదని, ప్రజలకు సేవకుడిగా పనిచేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నానని తెలిపారు. అధికారం ఉందనే అహంకారంతో పేదల భూములు, ప్రభుత్వ భూములు, దేవాదాయ శాఖ భూములు, ట్రస్ట్ భూములు, గుట్టలను ఆక్రమించుకోవడం అప్రజాస్వామిక చర్య అని ఎమ్మెల్యే తీవ్రంగా విమర్శించారు. ప్రజల ఆస్తులను కాపాడటం ప్రజాప్రతినిధుల బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయడమే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లక్ష్యమని ఎమ్మెల్యే మేఘా రెడ్డి పేర్కొన్నారు. ప్రజల సహకారంతో వనపర్తిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రానికి ఆదర్శంగా నిలబెడతామని ఆయన వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధికై అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తుందని తెలిపారు. డిసెంబర్ 7 2023న ప్రభుత్వం ఏర్పాటు అయినా వెంటనే మొదటగా రాష్ట్రంలోని మహిళలందరికీ ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం చేసేందుకు మొదటి సంతకం చేసిందన్నారు. ఆర్టీసీలో మహిళలు ఉచిత ప్రయాణానికి ఒక్క వనపర్తి



జిల్లాలోనే ఇప్పటివరకు 30.29 కోట్ల రూపాయలు ఆర్టీసీ యాజమాన్యానికి ప్రభుత్వం ధర చెల్లించడం జరిగింది అన్నారు. ఆరోగ్య భీమాను 5 లక్షల నుండి 10 లక్షలకు పెంచడం జరిగిందని అదేవిధంగా జిల్లాలో 30 వేల తెల్ల రేషన్ కార్డులు కొత్తగా ఇచ్చినట్లు తెలిపారు. ప్రతి తెల్ల రేషన్ కార్డు పై ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వము విద్యా వైద్యానికి తొలి ప్రాధాన్యం ఇచ్చిందని ప్రతి పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా ఏకరూప దుస్తులు, అల్పాహారం, సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం, ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందిస్తుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు 6000 మంది కొత్త టీచర్లకు నియామకం చేసినట్లు తెలిపారు. జిల్లాలో 200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేసినట్లు చెప్పారు. జిల్లాలో రూ. 207 కోట్ల వ్యయంతో 500 పడకల ఆసుపత్రి మంజూరీ చేసినట్లు చెప్పారు. ఐ.టి. టవర్, పాలిటెక్నిక్ కళాశాల భవనానికి పూర్వ వైభవం తీసుకురావడానికి 10 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. పట్టణంలో 70 కోట్ల రూపాయల వ్యయంతో సి.సి రోడ్లు వేయడం జరిగిందని, మరో 30 కోట్ల నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపించినట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు తొలి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, అందుకే ఏ సంక్షేమ పథకం అయినా మహిళలే ప్రాతినిధ్యం వహించే విధంగా రూపకల్పన చేయడం జరుగుతుందన్నారు. త్వరలో వనపర్తి మహిళలకు డీజిల్ బంక్ మంజూరు కాబోతుందని, 546 ఇందిరమ్మ ఇళ్లు ఇప్పటికే మంజూరు అయ్యాయని, ప్లాట్లు లేని నిరుపేదలకు 1000 ప్లాట్లు మంజూరు చేసి అందులో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళు కట్టుకునే విధంగా ప్రభుత్వానికి తాను ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో ఒక్క పూరి గుడిసె లేకుండా అన్ని పక్కా భవనాలు నిర్మించేందుకు ప్రణాళికలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పుర కౌన్సిలర్లు శరవంద, వెంకటేశ్వర్లు, పాకనాటి కృష్ణ, మురళి సాగర్, నిర్మలమ్మ, అయేషా సిద్ధిఖ, సౌమ్య, ధనలక్ష్మి, మున్సిపల్ కమిషనర్, మెప్మా, సానిటేషన్ ఇన్స్పెక్టర్, పలువురు పాల్గొన్నారు.

## కార్మికులకు అండగా నిలిచేది బిఆర్ఎస్

చేశారు. ఈ ప్రభుత్వం అవగాహన, ప్రణాళిక లేకుండా మూడు కార్పొరేషన్లుగా విభజించి ఉద్యోగులు, ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని తలసాని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏ రోజు కూడా ప్రజలకు ఇబ్బంది లేకుండా త్రాగునీటిని సరఫరా చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం త్రాగునీటిని కూడా సక్రమంగా ఇవ్వలేకపోతుందని మండిపడ్డారు. మీకు అండగా ఉండేది బీఆర్ఎస్ పార్టీ అని, మీ హక్కుల కోసం అసెంబ్లీ లోపల, బయట ప్రభుత్వాన్ని నిలదీస్తామని ప్రకటించారు. మీ కోసం గొంతుక వినిపించే గులాబీ జెండాకు మద్దతు తెలపాలని తలసాని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో బోర్డులోని అనేక సమస్యలను నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. అటు సూర్యుడు ఇటు పొడిచినా మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తలసాని హామీ ఇచ్చారు.

## అమిర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం

దుకాణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదం కారణంగా మంటలు భారీగా ఎగసిపడ్డాయి. దీంతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి. అగ్నిప్రమాదం సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. మంటలు వేగంగా వ్యాపించకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. దట్టమైన పొగ కారణంగా పరిసర ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది. భవనంలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు కూడా కొనసాగాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. అగ్నిప్రమాదంలో ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం ఎంత మేరకు జరిగిందనే విషయంపై అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అగ్నిప్రమాదం కారణంగా అమిర్‌పేట నుంచి ఎస్సార్ నగర్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో పరిసర ప్రాంతాల్లో భారీ ట్రాఫిక్ జామ్ నెలకొంది. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ఇతర మార్గాల వైపు మళ్లిస్తూ పరిస్థితిని నియంత్రించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలు, వాహనదారులు అమిర్‌పేట- ఎస్సార్‌నగర్ మార్గాన్ని తాత్కాలికంగా నివారించి ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని అధికారులు సూచించారు. అలాగే విధుల్లో ఉన్న ట్రాఫిక్, అగ్నిమాపక సిబ్బంది, ఇతర అత్యవసర సేవల సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం వివరాలు అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది.

## కొడంగల్ ఎత్తిపోతల ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు

ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఫోటో గ్యాలరీని ముఖ్యమంత్రి వీక్షించారు. మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భీమా కృష్ణా నదులపై ప్రతిపాద బ్యారేజీ పనులు పురోగతికి సంబంధించిన ఫోటో ఎగ్జిబిషన్ ప్లాన్ మ్యాప్స్ ద్వారా ముఖ్యమంత్రికి వివరించిన ఇరిగేషన్ అధికారులు. ÷ూష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి మక్తల్ మండలం కాట్రేవు పల్లి గ్రామ సమీపంలో కొనసాగుతున్న మక్తల్ నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల ప్యాకేజ్ -1 పనులను గురువారం పరిశీలించారు. ప్యాకేజ్ -1 లో భాగంగా జరుగుతున్న పంప్ హౌస్ పనులు ఎంత శాతం పూర్తయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాంక్రీటు పనులను ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కర్ణాటక రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి బోసు రాజు, జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, డాక్టర్ వాకిటి శ్రీహరి, కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక, ఇరిగేషన్ కార్యదర్శి శ్రీదర్, చీఫ్ ఇంజనీరు. ఏ సత్య నారాయణ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ హెచ్.టి శ్రీధర్, ఉన్నారు.

### ఖమ్మం సెంట్రల్ క్రైమ్ పోలీసులను అభినందించిన వరంగల్, ఖమ్మం పోలీసు కమిషనర్లు

ఖమ్మం జిల్లా బ్యూరో, జూన్ 4 (విజన్ ఆంధ్ర) : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కేయూసీ పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నెం. 669/2025, 670/2025 మరియు 14/2026 (సెక్షన్ 331(3), 305(ఏ) బీఎన్ఎస్ కేసులో పశ్చిమ బెంగాల్‌కు చెందిన ముగ్గురు ఇతర రాష్ట్ర నేరస్థులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఖమ్మం సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ఏసీపీ సర్వర్, సిబ్బందిని, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు. వివరాలలోకి వెళ్ళితే.. ఇటీవల వరంగల్ జిల్లా, కేయూసీఒ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి పాల్పడిన నిందితులు చోరీ సొత్తుతో ఖమ్మం మీదుగా వెళ్లే రైల్లో పారిపోతున్నట్లు సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించిన వరంగల్ జిల్లా పోలీసులు వెంటనే ఖమ్మం జిల్లా పోలీసులకు సమాచారం అందించారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాలతో రంగంలోకి దిగిన ఖమ్మం జిల్లా సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ఏసీపీ, సిబ్బంది ప్రయాణికుల్లాగా ఖమ్మంలో రైలు ఎక్కి ప్రతి రైలు భోగిని క్షుణ్ణంగా పరిశీలిస్తూ... రైలు మధిరకు వచ్చే సరికి పశ్చిమ బెంగాల్ కు చెందిన ఎాఎ. ఫిరోజ్, ఎాఎ. ఎమిన్, ఎాఎ.సుఖ్ చంద్ అనే ముగ్గురు నిందుతులను గుర్తించి చాకచక్యంగా పట్టుకొని, నిందుతుల నుండి మూడు కేసులకు సంబంధించిన 15 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకొని వరంగల్ జిల్లా పోలీసులకు అప్పగించారు. ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లా సెంట్రల్ క్రైమ్ పోలీసులు తక్షణమే స్పందించి అందించిన అమూల్యమైన సహకారానికి వరంగల్ జిల్లా పోలీస్ కమిషనర్ సన్ ప్రిత్ సింగ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ అందించిన ప్రశంస పత్రాన్ని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేతుల మీదుగా సిబ్బందికి గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, సిసిఎస్ ఏసీపీ సర్వర్ పాల్గొన్నారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# తెలంగాణలో సెంటిమెంట్ రాజకీయం !

తెలంగాణను ముంచిన వారంతా ఇప్పుడు వీరతాళ్లు వేసుకుని..నా తెలంగాణ అంటూ ఊరేగుతున్నారు. విగ్రహాల పేరుతో కొందరు నిగ్రహం కోల్పోయి మాట్లాడుతున్నారు. తెలంగాణ అస్తిత్వం ప్రమాదంలో పడ్డదని వాపోతున్నారు. ఇప్పుడు తెలంగాణ సెంటిమెంట్ కోసం మళ్లీ రాజకీయ రగడ మొదలయ్యింది. ఎవరికి వారు తామే తెలంగాణ భావి విధాతలమని మాట్లాడుతున్నారు. పవన్ కళ్యాణ్‌ను బూచిగా చూపి ఎవరికి తోచినట్లు వారు మాట్లాడుతున్నారు. నిజానికి తెలంగాణ ఏర్పడ్డ తరవాత జరిగిన ద్రోహం, అంతకుముందు ఎప్పుడూ జరగలేదు. ఉమ్మడి ఎపిలో జరగనంత దోపిడీ గత 12 ఏళ్లుగా సాగుతోంది. ఎక్కడిక్కడ భూములు దోచుకున్నారు. అప్పుల చేసి దోచుకున్నారు. తెలంగాణను అప్పుసుల కుప్పచేసి అనుభవిస్తున్నారు. ఎవరికి వారు తామే తెలంగాణను ఉద్దరించామని చెప్పుకుంటున్నారు. నిరుద్యోగ సమస్య తీరలేదు. నీటి సమస్యలు తీరలేదు. నిధులు పారించలేదు. అంతెందుకు రైతులు పండించిన ధాన్యం మద్దతు ధరలకు కొని సేకరణ సక్రమంగా చేయడంలో కూడా విఫలం అయ్యారు. మక్క, జొన్న, మిర్చి, పత్తి రైతులు ఏటా పడుతున్న కష్టాలను పట్టించుకోని అసమర్థులుగా మిగిలి పోయారు. ఇకపోతే తెలంగాణలో కొత్తగా ఆస్తులు సృష్టించలేదు. అయినా పాలకులుగా పనిచేసిన వారు తామే తెలంగాణను ఉద్దరించామని ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. ప్రజలకు పెన్షన్లు, ఇళ్లు, ఆరోగ్యశ్రీలు ఎరగా వేసి దర్జాగా దోచేస్తున్నారు. నిజానికి ఉమ్మడి ఎపి నుంచి తెలంగాణ విడివడ్డాక తెలంగాణ అభివృద్ధి చెందిందా..లేక అప్పుల పాలయ్యిందా అంటే..అప్పుల పాలయ్యిందని లెక్కలు చెబుతున్నాయి. సమయానికి జీతాలు ఇవ్వలేని వారు పాలకులు అయ్యారు. హైదరాబాద్ మీ అయ్య జాగీరా అని జనసేనాని పవన్ కళ్యాణ్ అనగానే కొందరు ఒంటి కాలిపై లేచి..అవును మా అయ్య జాగీరే అంటున్నారు. ఎందుకంటే మూడో వ్యక్తి వస్తే..దోచుకోవడానికి అవకాశం ఉండదు కనుక...ఎగిరెగిరి పడుతున్నారు. తెలంగాణ సమాజాన్ని బెదిరిస్తున్నావంటూ పవన్‌ను చీల్చి చెండాడేంత పని చేశారు. పవన్ మీడియా సమావేశంలో మాట్లాడిన మాటలు నిజంగానే తెలంగాణలోని కొందరికి బాధ కలిగించాయి. అందులో అనుమానం లేదు. రాజకీయంగా తెలంగాణలో ఉన్న కొందరు జనసేనలోనూ ఉన్నారు. వారికి పదవులు రావాలంటే జనసేన పక్షాన పోటీ చేయాల్సిందే. రాజకీయ పార్టీ అన్న తరవాత పోటీకి సై అంటుంది. జనసేన కూడా అదే చేసింది. అయితే మిగతా ప్రాంతాలకు, తెలంగాణకు ఓ రేఖ అడ్డంగా ఉంది. అదే సెంటిమెంట్. తెలంగాణ ప్రజలను ముంచిందే సెంటిమెంట్. ఆ సెంటిమెంట్‌తోనే ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డది. అది అడ్డం పెట్టుకునే కెసిఆర్ కుటుంబం పదేళ్లు దర్జాగా తెలంగాణలో పాగా వేసి, ఇష్టారాజ్యంగా దోచుకున్నది. పదవులు, డబ్బులు, భూములు దోచేసారు. లక్షల కోట్లు తెలంగాణ నెత్తిన అప్పులు పెట్టారు. తరవాత గత రెండేళ్లుగా కాంగ్రెస్ కూడా అదే దారిలో నడుస్తోంది. అభివృద్ధి పేరిట ఊదరగొట్టిన కాంగ్రెస్ నేతలు పప్పు బెల్లాల్లా తెలంగాణను పంచుకుంటున్నారు. భూములు యథేచ్ఛగా అమ్మేస్తున్నారు. ఈ క్రమంలో పవన్ రాకతో మరోమారు సెటిమెంట్ రగిల్చి బాగుపడాలన్న ధోరణిలో పొన్నం ప్రభాకర్, కెటిఆర్, కవితలు తామే అసలుసిసలు తెలంగాణ వారుసులమని చెప్పుకునే ప్రయత్నంలో పడ్డారు. తెలంగాణ సమాజం అస్తిత్వ సంక్షోభంల పడుతున్నదనీ గొంతు చించుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మరోసారి ఆంధ్రా ఆధిపత్యం కిందకు వెళుతోందని ప్రకటించుకున్నారు. పవన్ కళ్యాణ్ ఎంట్రీ వెనక బిజెపి, మోడీ ఉన్నారని ఆరోపిస్తున్నారు. తెలంగాణ కూడా భారతదేశంలోనే ఉందని, అందుకు బిజెపి ఎక్కడైనా పావులు కదుపుతుందని తెలుసుకోవాలి. బిజెపికి తెలంగాణ కూడా ఒక రాష్ట్రమని తెలుసు. ఇక్కడ పాగా వేయాలని ఎప్పటనుంచో కలలు కంటోంది. కనుక దాని ప్రయత్నాల్లో అది ఉంది. ఇది రాజకీయం. కెసిఆర్ కూడా భారత రాష్ట్ర సమితి అంటూ దేశాన్ని ఏలుతానని అన్ని రాష్ట్రాలు తిరిగారు. దానిని ఎవరైనా తప్పుపట్టారా అన్నది కెటిఆర్ చెప్పాలి. రాజకీయ పార్టీ పెట్టి ఇక్కడ వైఎస్ షర్మిల కూడా పాదయాత్ర చేశారు. తాను తెలంగాణ బిడ్డనని ప్రకటించుకున్నారు. అప్పుడు లేని రోషం ఇప్పుడే ఎందుకు వచ్చిందన్నది ప్రశ్న. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం స్వరాష్ట్రంలో ఆంధ్రా వలసవాదం పెరిగింది. దానికి కెసిఆర్ ఆద్యులు. ఆయనే మాకు ఆంధ్రాతో పేచీ లేదంటూ..జగన్‌ను పిలిచి భోజనం పెట్టి అలయ్ భలయ్ చేసుకున్నారు. కృష్ణా నీటిని ఎపికి దోచి పెట్టారని వస్తున్న ఆరోపణలకు కెసిఆర్ బృందం నుంచి సమాధానం లేదు. తెలంగాణలో అధికారాన్ని చేజిక్కించుకుని, హైదరాబాద్ సంపదను కొల్లగొట్టడానికి వస్తున్నారని జనసేనాని పవన్ కళ్యాణ్‌ను విమర్శించే ముందు..ఇక్కడ ఎంత కొల్లగొట్టారో చెప్పాలి. ధరణి పేరుతో మోసాలు. కాళేశ్వరం పేరుతో దగా. టెలిఫోన్ ట్యాపింగ్. అస్మదీయులకు రాజ్యసభ పదవులు.. ఇలా చెప్పుకుంటూ పోతే కథలు కోకొల్లలు. ఇప్పుడు రెండేళ్ల పాలనలో మంత్రులందరిపైనా అవినీతి గుప్పు మంటోంది. అయినా ఎవ్వరు కూడా మాట్లాడడం లేదు. తెలంగాణ మేధావులు నోరు మెదపడం లేదు. కాంగ్రెస్ వచ్చాకనే స్వేచ్ఛ వచ్చిందని కోదండరామ్ సార్ అంటున్నారు. అంటే కెసిఆర్ ఉన్నంతకాలం నిరంకుశ పాలనలో మగ్గామనే అర్థం కదా. తెలంగాణ అస్తిత్వం మీద దాడిలో, మోదీ, చంద్రబాబుల ఉమ్మడి ప్రణాళిక దాగి ఉందని ఘోషిస్తున్న వారు, ఏ రకమైన దాడి జరిగిందో చెప్పాలి.

ఈ గడ్డపై నివస్తిస్తూ ఇక్కడే మమేకమైన వారంతా తెలంగాణ బిడ్డలే. వాళ్ల పిల్లల భవిష్యత్తు, వారి ఉద్యోగాలు, వ్యాపారాలు అన్నీ ఈ తెలంగాణ రాష్ట్రంతోనే ముడిపడి ఉన్నాయి. రాజకీయ పార్టీలు అన్ని చోట్లా తమ అస్తిత్వం కోసం ప్రయత్నం చేస్తుంటాయి. కెసిఆర్ కుటుంబానికి చెందిన పార్టీలే తెలంగాణకు ప్రతినిధులు కాదు. తెలంగాణ కోసం కష్టపడే వారు ఎవరైనా రాజకీయలు చేసుకునే హక్కు ఉంటుంది. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో, ఆ తర్వాత జరిగే సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి పోటీ చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీనిని తప్పుపట్టడానికి లేదు. ఉమ్మడి రాష్ట్రంలో అధికారం చలాయించిన సమైక్య పాలకులు, తెలంగాణ ఏర్పాటుతో అధికారం చేపట్టిన వారు కూడా తెలంగాణను నిలువునా దోచుకున్నారు. కాబట్టి ఎవ్వరు కూడా తెలంగాణ అస్తిత్వం కోసం పోరాడలేదు. తమ స్వార్థ రాజకీయం కోసమే పోరాడారు. ఇంకా పోరాడుతున్నారు. ఇప్పుడు రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కూడా ఇదే సెంటిమెంటుతో తమ ఉనికి కోసం కొందరు ఇప్పుడు నానా యాగీ చేస్తున్నారని గుర్తిస్తే మంచిది.

# నిరుద్యోగ యువతకు శుభవార్త..

**- జూన్ 9న పెద్దపల్లిలో జాబ్ మేళా**

**- జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్**



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూన్–04(విజన్ ఆంధ్ర) : జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జూన్ 9న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్ సంస్థలో 30 ఖాళీ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. లోన్ ఆఫీసర్, కస్టమర్ రిలేషన్ అసోసియేట్ పోస్టులకు నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. పెద్దపల్లి, కరీంనగర్, మంచిర్యాల్, హుజరాబాద్, జనగాం, నల్గొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, నర్సంపేట్, పరకాల, మహబూబాబాద్, నిజామాబాద్, ఆదిలాబాద్, బోధన్, ఇచ్చోడ, ఆర్మూర్, నిర్మల్ తదితర ప్రాంతాల్లో ఖాళీలు ఉన్నాయని వెల్లడించారు. ఇంటర్మీడియట్ లేదా అంతకంటే పై చదువులు పూర్తి చేసిన ఫ్రెషర్స్‌తో పాటు అనుభవం కలిగిన అభ్యర్థులు కూడా అర్హులని తెలిపారు. అభ్యర్థుల వయస్సు 19 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉండాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు జూన్ 9న ఉదయం 11 గంటలకు పెద్దపల్లిలోని సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం మొదటి అంతస్తు, గది నంబర్ 233లో నిర్వహించే జాబ్ మేళాకు హాజరుకావాలని కోరారు. అభ్యర్థులు తమ రెజ్యూమ్, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలతో రావాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 8985336947, 8121262441 నంబర్లను సంప్రదించాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి సూచించారు.

# బడిబాట కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలి

**- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలి**

**- పాఠశాలలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి**

**- అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డా. అశ్విని తానాజీ వాకడే, ఐఏఎస్**





కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) జూన్ 04..జిల్లాలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహించి, ప్రతి పాఠశాల వయస్సు గల బాలబాలిక ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డా. అశ్విని తానాజీ వాకడే, ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాధికారి ప్రశాంత్ రెడ్డి సమక్షంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. బడిబయట ఉన్న పిల్లలు, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలు, వినూత్న కార్యక్రమాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామాలు, కాలనీలు, తండాలు, గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించి భవిత కేంద్రాల్లో నమోదు చేయాలని ఆదేశించారు. ఐదేళ్లు నిండిన ప్రతి బాలబాలికను ప్రథమ తరగతిలో చేర్పించడంతో పాటు, ట్రాన్సిషన్ తరగతులైన 5వ నుంచి 6వ తరగతి, 7వ నుంచి 8వ తరగతి, 10వ తరగతి అనంతర ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి పరిశుభ్రత, తాగునీటి సౌకర్యాలు, పచ్చదనం, ఆకర్షణీయమైన వాతావరణంతో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారులకు సూచించారు. విద్యార్థులకు మొదటి రోజే పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందేలా చూడాలని, పాఠశాల ఆవరణలను రంగురంగులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. బడిబాట కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించేందుకు ప్రత్యేక "బడిబాట గీతం" రూపొందించాలని కూడా ఆదేశించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి గీత మాట్లాడుతూ బడిబాట కార్యక్రమ విజయవంతానికి గ్రామీణాభివృద్ధి శాఖ సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. గ్రామ స్థాయిలో బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేయించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని, విద్యాశాఖతో సమన్వయంగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి జెడ్పి సీఈవో పవన్ కుమార్, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ప్రసాద్, విద్యాశాఖ కోఆర్డినేటర్లు శ్రీనివాసు అశోక్ రెడ్డి శ్రీనివాస్ జిల్లా స్థాయి అధికారులు, సీడీపీఓలు, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణలో బీర్ల విక్రయాల జోరు..!

***రెండు నెలల్లో 14 కోట్ల బీర్లు అమ్మకం, ప్రభుత్వ ఖజానాకు భారీ ఆదాయం,***

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జూన్ 4, (విజన్ ఆంధ్ర ప్రతినిధి): తెలంగాణలో మండిపోతున్న ఎండలు బీర్ల అమ్మ కాలకు ఊతమిచ్చాయి. ఏప్రిల్, మే నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా బీర్ల విక్రయాలు భారీగా పెరిగి రికార్డు స్థాయికి చేరుకున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈసారి సుమారు 4 కోట్ల బీర్లు అదనంగా అమ్ముడవగా, మొత్తం విక్రయాలు 14 కోట్లకు చేరినట్లు సమాచారం. ముఖ్యంగా హైదరాబా ద్, సికింద్రాబాద్, మేడ్చల్మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో బీర్ల వినియోగం అత్యధికంగా నమోదైంది. సాధారణ రోజుల్లో 1.5 లక్షల కేసుల వరకు ఉండే అమ్మకాలు, ఎండల తీవ్రత కారణంగా రోజుకు 2.2 లక్షల కేసులకు పెరిగినట్లు తెలుస్తోంది. బీర్ల విక్రయాలు పెరగడంతో ప్రభుత్వానికి ఎక్సైజ్ ఆదాయం కూడా భారీగా సమకూరు తోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో మద్యం ద్వారా వచ్చే వార్షిక ఆదాయం సుమారు రూ.10 వేల కోట్లుగా ఉండగా, ప్రస్తుతం అది నాలుగు రెట్లు పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. వేసవి సెలవులు, పెళ్లిళ్ల సీజన్, అధిక ఉష్ణోగ్రతలు బీర్ల అమ్మకాల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా వ్యాపారులు పేర్కొంటున్నారు.

## పర్యావరణ అవగాహన వాల్ పోస్టర్ ఆవిష్కరణ



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జూన్ 4, (విజన్ ఆంధ్ర ప్రతినిధి): 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ అవగాహన వాల్ పోస్టర్లను మెడ్చల్మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ,స్థానిక సంస్థలు,ఫైజాన్ అహ్మద్, ఆవిష్కరించారు. ఈ పర్యావరణ అవగాహన పోస్టర్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలు, అలాగే ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు2026 ప్రకారం నాలుగు రకాల వ్యర్థాల వేరు చేయడం (సెగ్రిగేషన్) కోసం రంగుల వారీగా నిర్దేశించిన డస్ట్‌బిన్ల వినియోగం గురించి ప్రజలకు అవగాహన కల్పించే సందేశాలు పొందుపరచబడ్డాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ సందేశాలను విస్తృతంగా ప్రజలకు చేరవేసే ఉద్దేశంతో, ఈ పోస్టర్లను కలెక్టరేట్‌తో పాటు జిల్లా పరిధిలోని అన్ని స్థానిక సంస్థల కార్యాలయాల నోటీస్ బోర్డులపై ప్రదర్శించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతాభావం పెంపొందించి, స్వచ్ఛమైన, హరితమైన స్థిరమైన పర్యావరణ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, మెడ్చల్‌కు చెందిన పర్యావరణ ఇంజనీర్ బి. రాజేందర్, అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ సైంటిస్ట్ జి. లింగయ్య పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం - 2026

**"పర్యావరణాన్ని పరిరక్షిద్దాం భూమిని బ్రతికిద్దాం"**

**భూమి మన పిల్లల నుండి తీసుకున్న అప్పు**

ములుగు జూన్ 04 , విజన్ ఆంధ్ర ప్రతినిధి : ఒక్క భూమే ఉంది. ఒక్క అవకాశమే ఉంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మానవాళికి ప్రకృతి మాత ఇస్తున్న హెచ్చరిక ఇదే. "భూమి మన పూర్వీకుల నుండి వచ్చిన ఆస్తి కాదు; మన పిల్లల నుండి తీసుకున్న అప్పు" అని ప్రజ్ఞ అకాడమీ అధినేత, విద్యావేత్త చంద్రమౌళి ఓదెల స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఆయన విద్యార్థులు, యువతకు ఇచ్చిన పిలుపు నేటి సమాజానికి దిశానిర్దేశం చేస్తోంది.

**1. భూమి మనకు ఉన్న ఏకైక నివాసం**

ఈ విశ్వంలో కోట్లాది గ్రహాలు ఉన్నప్పటికీ జీవం ఉన్న ఏకైక గ్రహం భూమి. గాలి, నీరు, నేల, చెట్లు, జంతువులు, పక్షులు అన్నీ కలిసి నిర్మించిన సున్నితమైన జీవ్యవస్థ ఇది. "ఈ బ్యాలెన్స్ ఒక్కసారి దెబ్బతింటే మనిషి మనుగడే ప్రశ్నార్థకం" అని చంద్రమౌళి హెచ్చరించారు.

**2. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ప్రకృతి ప్రమాద ఘంటికలు**

భూగోళ ఉష్ణోగ్రతలు ఏటేటా పెరుగుతున్నాయి. ఇది ప్రకృతి మోగిస్తున్న ప్రమాద ఘంటిక. కరువులు, వరదలు, తుఫాన్లు పెరగడానికి ఇదే కారణం. "భూమికి వచ్చిన జ్వరాన్ని మనమే తగ్గించాలి" అన్నారు.

**3. అడవుల వినాశనం భూమి ఊపిరితిత్తుల నాశనం**

ప్రతి నిమిషం ఫుట్‌బాల్ మైదానం సైజులో అడవులు నాశనమవుతున్నాయి. చెట్లు నరకడం అంటే భూమి ఊపిరితిత్తులను పీకేయడమే. ఆక్సిజన్ తగ్గి, కార్బన్ పెరిగి మనం ఊపిరాడకుండా చేసుకుంటున్నాం.

**4. ప్లాస్టిక్ మహాభూతం కనిపించని శత్రువు**

"ప్లాస్టిక్ మహాభూతం" అంటూ చంద్రమౌళి దాని ప్రమాదాన్ని వివరించారు. వాడి పడేసే ఒక్క ప్లాస్టిక్ కవర్ 1000 సంవత్సరాలు నేలలో ఉండిపోతుంది. సముద్రాల్లో తేలుతూ చేపల ప్రాణాలు తీస్తోంది. నేడు మన రక్తంలో కూడా మైక్రో ప్లాస్టిక్ చేరింది.

**5. వాతావరణ మార్పులు భవిష్యత్తుపై ముప్పు**

ఋతువులు తప్పడం, అకాల వర్షాలు, పంటలు నాశనం కావడం – ఇవన్నీ వాతావరణ మార్పుల ఫలితమే. రాబోయే తరాలకు మనం ఏం మిగులుస్తున్నామో ఆలోచించుకోవాల్సిన సమయం ఇది.

**6. నీటి సంక్షోభం రాబోయే యుద్ధాలకు కారణమా?**

2030 నాటికి ప్రపంచంలో 40% ప్రజలకు తాగునీరు దొరకదని నివేదికలు చెబుతున్నాయి. నీటి కోసం యుద్ధాలు వచ్చే ప్రమాదం ఉంది. "ప్రతి చుక్క నీరు బంగారం" అని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.

**7. భారతీయ సంస్కృతిలో పర్యావరణ పరిరక్షణ**

మన పూర్వీకులు చెట్టును దేవుడిగా, నదిని తల్లిగా, భూమిని గోమాతగా పూజించారు. "వృక్షో రక్షతి రక్షితః" – చెట్టును రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుంది. ఆ సంస్కృతిని మళ్లీ గుర్తు చేసుకోవాలి.

**8. విద్యార్థుల పాత్ర భవిష్యత్ భూమి రక్షకులు**

విద్యార్థులను ఉద్దేశించి ఆయన ఇచ్చిన పిలుపు అందరినీ కదిలించింది: "మీరే రేపటి భూమి రక్షకులు. ఈరోజు నుండే మూడు పనులు చేయండి. ప్లాస్టిక్‌కు 'నో' చెప్పండి. ఏడాదికి కనీసం 5 మొక్కలు నాటండి. నీటి చుక్క వృథా చేయవద్దు."

**9. పరిష్కార మార్గాలు – మన బాధ్యత**

పెద్ద సమస్యకు పెద్ద పరిష్కారం అక్కర్లేదు. మన ఇంటి నుండే మొదలుపెడదాం:

1. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా బ్యాన్
2. ప్రతి పండుగకు మొక్క నాటడం
3. వర్షపు నీటి సంరక్షణ
4. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం
5. పర్యావరణ స్నేహపు జీవనశైలి

ముగింపు:

"పర్యావరణాన్ని పరిరక్షిద్దాం భూమిని బ్రతికిద్దాం". ఈ నినాదం నోటితో చెప్పడం కాదు, చేతలతో నిరూపించాలి. మనం ఇచ్చే అప్పును వడ్డీతో సహా తిరిగి ఇవ్వాల్సిన బాధ్యత మనపై ఉంది.



**వ్యాసకర్త: చంద్రమౌళి ఓదెల**
**ప్రజ్ఞ అకాడమీ**
**- 9989224548**

# జిల్లాలోనే ' కర్ణంగూడను ' ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి


**- రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలి**

**- గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను పున:ప్రారంభించాలి**

**- గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసే బాధ్యత నాదే..**

**- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి**



ప్రజాపాలనప్రగతి ప్రణాళిక గ్రామసభలో కలెక్టర్ పిలుపు ఇబ్రహీంపట్నం, జూన్ 4 ( విజన్ ఆంధ్ర ) : జిల్లాలోనే కర్ణంగూడ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం ఇబ్రహీంపట్నం మండలం కర్ణంగూడ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని గ్రామస్థులతో నేరుగా మమేకమయ్యారు. గ్రామాభివృద్ధి, వ్యవసాయం, పారిశుద్ధ్యం, విద్య, మౌలిక సదుపాయాలు, ఓటరు జాబితా పునర్వ్యమర్శ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. వర్షాలు ఆలస్యంగా ప్రారంభమయ్యే పరిస్థితులు ఉన్నందున రైతులు వ్యవసాయ శాఖ సూచనల మేరకు పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. అధిక నీటి అవసరమున్న వరి సాగుపై జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు. వర్షాకాలంలో నీటి కాలుష్యం, దోమల వ్యాప్తి, అంటువ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. చెత్తాచెదారం పేరుకుపోకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి కుటుంబం ఆరోగ్య రక్షణకు సహకరించాలని కోరారు. వర్షాలు ప్రారంభమైన వెంటనే గ్రామంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని తెలిపారు. ప్రతి ఇంటిలో తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించిన కలెక్టర్, తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేయవచ్చని, పొడి చెత్తను రీసైక్లింగ్ ద్వారా తిరిగి వినియోగించవచ్చని తెలిపారు. గ్రామస్థుల అభ్యర్థన మేరకు చెత్త సేకరణ డబ్బాలను అందజేస్తామని, వాటిని సక్రమంగా వినియోగించి జిల్లాకు ఆదర్శంగా నిలవాలని కోరారు. నెల రోజుల తర్వాత గ్రామంలోని ఘన వ్యర్థాల నిర్వహణ పరిస్థితిని పరిశీలిస్తామని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంపోస్ట్ యూనిట్‌ను పూర్తి స్థాయిలో వినియోగించి సేంద్రియ వ్యర్థాలను ఎరువుగా మార్చాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులకు ఎరువుల పంపిణీ ప్రక్రియను మరింత పారదర్శకంగా, సులభతరంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం మునుగోడు నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టును అమలు చేస్తోందని అధికారులు వివరించారు. యూరియా, డీఏపీ తదితర ఎరువులను ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా మాత్రమే అందజేయనున్నట్లు తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్‌కు యాప్‌ను అనుసంధానం చేసినందున రైతులు తప్పనిసరిగా నమోదు పూర్తి చేసుకోవాలని సూచించారు. భూమి విస్తీర్ణం, సాగు చేస్తున్న పంటల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, తప్పుడు వివరాలు నమోదు చేస్తే ఎరువుల కేటాయింపులో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టనున్న ప్రత్యేక ఓటరు జాబితా పునర్వ్యమర్శ కార్యక్రమంలో ప్రతి అర్హుడి పేరు నమోదు అయ్యేలా ప్రజలు సహకరించాలని కలెక్టర్ కోరారు. అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూసూచించారు. కర్ణంగూడ ప్రభుత్వ పాఠశాల పునఃప్రారంభానికి గ్రామస్థులు ముందుకు రావాలన్నారు. గ్రామంలో మూతపడిన ప్రాథమిక పాఠశాలను తిరిగి ప్రారంభించేందుకు గ్రామస్థులు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. చిన్నారులను దూర ప్రాంతాలకు పంపకుండా గ్రామంలోనే విద్య అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అనంతరం డీసీపీ నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా ప్రజలు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. తాగి వాహనం నడపడం, ట్రిపుల్ రైడింగ్ వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా కుటుంబ పోషకులు ప్రాణాలు కోల్పోతున్నారని, కుటుంబ సభ్యులు భద్రతా నిబంధనలు పాటించేలా చూసుకోవాలని కోరారు. యువతలో మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల వినియోగం గమనిస్తే వెంటనే డయల్–100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వంగేటి తిరుమల రెడ్డి, ఉపసర్పంచ్ రవీందర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేష్, ఎంపీడీఓ ప్రమీల, వార్డు సభ్యులు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, రైతులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



# ఎఫ్ ఎస్ ఎస్ యాప్ ద్వారానే ఎరువులు కొనుగోలు చేయాలి



వ్యవసాయ అధికారి చంద్రకళ, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జూన్ 4, (విజన్ ఆంధ్ర ప్రతినిధి): శామీర్పేట్ మండలం అలియాబాద్ రైతువేదిక లో మండల ఎరువుల డీలర్ల కి కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త ఎరువుల అమ్మకాల యాప్ ఎఫ్ ఎస్, అప్ మీద శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో డీలర్స్ కి రైతులు కి వ్యవసాయ విస్తరణ అధికారులు కి ఈ కొత్త యాప్ మీద శిక్షణ ఇవ్వటం జరిగిందని తెలిపారు. తెలంగాణ లో ఎఫ్ ఎస్ ఎస్ అప్ ని మేడ్చల్ మల్కాజ్గిరి , రంగారెడ్డి జిల్లా లో అమలు అవుతుంది అనీ, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ మాట్లాడుతూ, రైతులు అందరూ ఈ కొత్త యాప్ ద్వారా నే అన్ని రకాల ఎరువులు కొనుగోలు చేయాలి అని వివరించారు. ఇందులో శామీర్పేట్ వ్యవసాయ అధికారి రమేశ్, దుండిగల్ వ్యవసాయ అధికారి యాదగిరి, బాలానగర్ వ్యవసాయ అధికారి సాయి రమేష్, ఉప్పల్ వ్యవసాయ ఆధికారి కృపాకర్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు సుధీర్ కుమార్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

# కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ వైస్ చైర్మన్ పరుచూరి మురళికి ఘన సన్మానం





మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జూన్ 4, (విజన్ ఆంధ్ర ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కమ్మ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్ కి అభినందనల వెల్లువ కొనసాగుతోంది. స్పీక్ సొసైటీ ఫర్ పొలిటికల్ ఎంపవర్మెంట్ విత్ యాక్షనబుల్ నాలెడ్జ్, సంస్థ ఆధ్వర్యంలో అన్నే సత్యనారాయణ, డాక్టర్ గోపాలం విద్యాసాగర్, అట్టేపల్లి రామప్రభు నేతృత్వంలో, ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్లో కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ని, వైస్ చైర్మన్ పరుచూరి మురళి ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కమ్మ సంఘాల ప్రతినిధులు పాల్గొని అభినందనలు తెలియజేశారు కార్పొరేషన్ ద్వారా కులంలోని పేదవారికి ప్రభుత్వ పథకాలు అందేలా తగు చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మురళీకృష్ణ ,సాయిబాబా చౌదరి ,తూము వినయ్, దోనేపూడి చక్రపాణి, వాసిరెడ్డి నరేష్, మన్నె నాగమల్లేశ్వరి, చిట్టి వీరయ్య, రమేష్, విజయ సారధి, తార్నాక కమ్మ సంఘం సభ్యులు డాక్టర్ హరి చౌదరి, కొణిదల లక్ష్మీనారాయణ, ఉపేంద్ర, మల్లిబాబు, వీరబాబు, వాసు తదితరులు పాల్గొన్నారు.

# పద్మశ్రీ డాక్టర్ పి.విజయ్ ఆనంద్ రెడ్డికి ఘన సన్మానం



హైదరాబాద్, జూన్ 04 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో ప్రముఖ ఆంకాలజిస్ట్, పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ డాక్టర్ పి.విజయ్ ఆనంద్ రెడ్డిని గురువారం అపోలో ఆసుపత్రిలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశ్రీ అవార్డు అనంతరం తనపై మరింత బాధ్యత పెరిగిందని, క్యాన్సర్ రోగ రహిత సమాజం కోసం అధునాతన చికిత్సల ద్వారా సేవలు కొనసాగిస్తానని తెలిపారు. క్యాన్సర్ లక్షణాలు, నివారణ చర్యలు, చికిత్సా విధానాలపై అవగాహన కల్పించారు. తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా క్యాన్సర్ రోగులకు సేవలందిస్తున్న డాక్టర్ విజయ్ ఆనంద్ రెడ్డి వైద్య రంగంలో విశిష్ట కృషి చేస్తున్నారని కొనియాడారు. అనంతరం ఆయనకు శాలువా, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కే.జోజిరెడ్డి, ప్రొ.అక్తర్ అలీ, బల్వంత్ రెడ్డి, బి.సంపత్ కుమార్, మధుబాబు, కె.రవీందర్, విద్యాసాగర్, ఎన్.రమణ, జి.వేణుగోపాల్, బిచ్చుకారి సూర్య, నర్సింగ్ రావు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# మక్తల్-పేట -కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు

**- పంప్ హౌస్ పనులువేగవంతంగా చేపట్టాలనిఆదేశం.**

**- ఇరిగేషన్ ప్రాజెక్టుల ఫోటో గ్యాలరీని పరిశీలించిన సీఎం.**

**- ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి.**



మక్తల్, మాగనూరు, జూన్ 4 (విజన్ ఆంధ్ర) : మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. భీమా కృష్ణా నదులపై నిర్మించనున్న ప్రాజెక్ట్ పనుల పురోగతిపై గురువారం ముఖ్యమంత్రి బెంగుళూరు నుంచి కర్ణాటక మంత్రి బోసు రాజు నేరుగా మక్తల్ చేరుకోగా ఉత్తమ్ కుమార్ రెడ్డి దామోదర రాజనర్సింహ జూపల్లి కృష్ణారావు వాకిటి శ్రీహరి లకు జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఫోటో గ్యాలరీని ముఖ్యమంత్రి వీక్షించారు. మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భీమా కృష్ణా నదులపై ప్రతిపాద బ్యారేజీ పనులు పురోగతికి సంబంధించిన ఫోటో ఎగ్జిబిషన్ ప్లాన్ మ్యాప్స్ ద్వారా ముఖ్యమంత్రికి ఇరిగేషన్ అధికారులు వివరించారు. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం కాట్రేవు పల్లి గ్రామ సమీపంలో కొనసాగుతున్న మక్తల్ నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల ప్యాకేజ్ -1 పనులను సీఎం పరిశీలించారు. ప్యాకేజ్ -1 లో భాగంగా జరుగుతున్న పంప్ హౌస్ పనులు ఎంత శాతం పూర్తయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాంక్రీటు పనులను ప్రారంభించి పంప్ హౌస్ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కర్ణాటక రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి బోసు రాజు, జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, డాక్టర్ వాకిటి శ్రీహరి, కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక, ఇరిగేషన్ కార్యదర్శి శశ్రీధర్, చీఫ్ ఇంజనీరు. ఏ సత్య నారాయణ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ హెచ్.టి శ్రీధర్, ఉన్నారు.

# 14న ఇల్లందులో రెండు రాష్ట్రాల స్థాయి నృత్య పోటీలు



ఖమ్మం జిల్లా బ్యూరో, జూన్ 4 (విజన్ ఆంధ్ర) : కీర్తిశేషులు బాల, సాయి జ్ఞాపకార్థం వెంకట్ డ్యాన్స్ అకాడమీ, వీబీసీసీ యూత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 14న ఇల్లందులోని సీఈఆర్ క్లబ్‌లో రెండు రాష్ట్రాల స్థాయి (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) నృత్య పోటీలు నిర్వహించనున్నారు. ఖమ్మంలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో గురువారం ఈ పోటీల గోడపత్రిక ను క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళలు యువతలో క్రమశిక్షణను, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రతిభావంతులకు ఈ పోటీలు ఒక మంచి వేదికని కొనియాడారు. ఈ నెల 14న ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ పోటీలలో వెస్ట్రన్, ఫోక్, క్లాసికల్ విభాగాల్లో జూనియర్, సీనియర్ గ్రూప్స్‌తో పాటు సోలో, డ్యూయెట్ ప్రదర్శనలకు అవకాశం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీదారులు నృత్యం చేయాల్సిన పాటలను పెన్ డ్రైవ్ లేదా మొబైల్‌లో తీసుకురావాలని, క్లాసికల్ నృత్యానికి 5 నిమిషాలు, ఫోక్, వెస్ట్రన్‌కు 4 నిమిషాల సమయం కేటాయించనున్నట్లు తెలిపారు. విజేతల ఎంపికలో న్యాయ నిర్ణేతలదే తుది నిర్ణయమని స్పష్టం చేశారు. పోటీల్లో పాల్గొనే వారందరికీ ప్రశంసా పత్రంతో పాటు ఉచిత భోజన వసతి కల్పిస్తామని, విజేతలకు ఆకర్షణీయమైన నగదు బహుమతులు ఉంటాయని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల నృత్య కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ పోటీలను జయప్రదం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. పోటీల రిజిస్ట్రేషన్ , ఇతర వివరాలకు కడారి వెంకటేష్ (8374579497, 7989163958), సాయి మాస్టర్ (9030099139) నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

# ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో వట్టెం రిజర్వాయర్ వద్ద ఏర్పాట్ల పరిశీలన

**- జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్,**

**- ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ పాటిల్,**

**- వనపర్తి జిల్లా ఎస్పీ సునీత,**



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర) జూన్ 03 : రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన వట్టెం వెంకటేశ్వర రిజర్వాయర్ పంప్‌హౌస్‌ను సందర్శించనున్న నేపథ్యంలో బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, వనపర్తి జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి లు సంయుక్తంగా ఏర్పాట్లనుపరిశీలించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని కుమ్మెర గ్రామ సమీపంలో ఉన్న వట్టెం వెంకటేశ్వర రిజర్వాయర్, పంప్‌హౌస్ ప్రాంతాలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 5నసందర్శించనున్నారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజక వర్గం పరిధిలోని ఎల్లూరు రిజర్వాయర్, హెడ్ రెగ్యులేటర్, నార్లాపూర్ రిజర్వాయర్ ,డెలివరీ సిస్టర్న్స్,ఎం జి కె ఎల్ ఐ లిఫ్ట్ -1 పంప్ హౌస్ పరిశీలించిన అనంతరం హెలికాప్టర్ ద్వారా నార్లాపూర్ రిజర్వాయర్ , హెడ్ రెగ్యులేటరీ, ప్యాకేజ్ 3 కెనాల్ పనులు, ఏదుల రిజర్వాయర్ పంప్ హౌస్ పనులను పరిశీలించిన అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి కుమ్మెర చేరుకుంటారు. వట్టెం రిజర్వాయర్ కి సంబంధించి ప్యాకేజీ 8 ,9, 10,11 పనులను తనిఖీ చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిపర్యటనకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై కుమ్మెర గెస్ట్ హౌస్ వద్దసమీక్షనిర్వహించారు. ముఖ్యమంత్రి రాక కోసం ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను పరిశీలించి, అక్కడి భద్రతా ప్రమాణాలు, వాహనాల పార్కింగ్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధుల కోసం ఏర్పాటు చేస్తున్నసౌకర్యాలపై అధికారులకుజిల్లాకలెక్టర్ ,ఎస్ పి తో పాటు సి ఎం భద్రతా అధికారులు పలు సూచనలు చేశారు. అనంతరం వట్టెం రిజర్వాయర్ పంప్‌హౌస్ వద్ద నిర్వహించిన సమీక్ష సమావేశంలో సి ఎం పర్యటనకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. ముఖ్యమంత్రి ప్రయాణ మార్గాలు, భద్రత, బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర సేవల నిర్వహణ తదితర అంశాలపై ప్రత్యేకకార్యాచరణ రూపొందించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతోపనిచేయాలని కలెక్టర్ ఆదేశించారుజిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకుని పోలీసు శాఖ తరపున పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సున్నిత ప్రాంతాలను గుర్తించి అదనపు పోలీసు బలగాలను మోహరించనున్నట్లు పేర్కొన్నారు.

వాహనాల తనిఖీలు, ప్రవేశ నియంత్రణ, ట్రాఫిక్ మళ్లింపులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. వనపర్తి జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి కూడా భద్రతా ఏర్పాట్లపై అధికారులతో చర్చించి, సంబంధిత శాఖల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధికి కార్యాచరణ రూపొందించాలి

**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**- ప్రత్యేక గ్రామ సభలు గ్రామ ప్రగతికి దోహదం**

**- మర్రిమడ్ల గ్రామంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొనడం**





కోనరావుపేట రాజన్న సిరిసిల్ల బ్యూరో, జూన్ 4 (విజన్ ఆంధ్ర): గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని, ప్రత్యేక గ్రామ సభలు గ్రామ సమస్యలపై చర్చించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు ఉపయోగపడతాయని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కోనరావుపేట మండలం మర్రిమడ్ల గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై గ్రామస్తులతో పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు. గ్రామసభలో వర్షాకాల సన్నద్ధత, పంటల వైవిధ్యం, వ్యవసాయ మరియు ఉద్యానవన శాఖల కార్యాచరణ, ఘన వ్యర్థాల నిర్వహణ, బడిబాట, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, జల సంరక్షణ, పారిశుధ్యం, మొక్కల పెంపకం, విపత్తుల నిర్వహణ, రోడ్డు భద్రత వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో పనిచేస్తున్న శాఖల అధికారులు అమలు చేస్తున్న కార్యక్రమాలపై ప్రజలకు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. వర్షాకాలానికి ముందు డ్రైనేజీలను శుభ్రం చేయడం, చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా జాగ్రత్తలు తీసుకోవడం అవసరమన్నారు.

**ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన అవసరం**

ఘన వ్యర్థాల నిర్వహణ-2026లో భాగంగా చెత్తను తడి, పొడి, సానిటరీ, ప్రత్యేక వ్యర్థాలుగా నాలుగు రకాలుగా వేరు చేసి గ్రామపంచాయతీ వాహనాలకు అందించాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**పంటల వైవిధ్యంపై రైతులకు సూచనలు**

ఎల్నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పంటల సాగు చేపట్టాలని కోరారు. ఆయిల్‌పామ్, కూరగాయలు, పత్తి వంటి లాభదాయక పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. సన్న వడ్ల సాగు చేస్తే ప్రభుత్వం బోనస్ అందిస్తోందని, పంట మార్పిడి ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చని వివరించారు.

**రోడ్డు భద్రతపై అప్రమత్తత అవసరం**

"అరైవ్-అలైవ్" కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కలెక్టర్ సూచించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించడం, మైనర్లకు వాహనాలు ఇవ్వకపోవడం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం వంటి అంశాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.

**ఓటరు జాబితా సవరణకు సహకరించాలి**

ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఇంటింటికీ వచ్చే బీఎల్‌ఓలకు అవసరమైన వివరాలు అందించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు.

**నర్సరీ, కంపోస్ట్ షెడ్ పరిశీలన**

గ్రామసభ అనంతరం కలెక్టర్ గ్రామంలోని నర్సరీ, కంపోస్ట్ షెడ్‌ను పరిశీలించారు. లక్ష్యాలకు అనుగుణంగా మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, కంపోస్ట్ షెడ్‌ను పూర్తిస్థాయిలో వినియోగించి చెత్తను శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఆర్డీఓ కె.ఎస్.బి కుమారి, జిల్లా మరియు మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచ్ స్వాతి, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం...

## - తిప్పనపల్లి గ్రామసభలో కలెక్టర్ అంకిత్ స్పష్టం

**- ప్రజా పాలన ప్రగతి ప్రణాళికతో గ్రామాల సమగ్రాభివృద్ధి : జిల్లా కలెక్టర్ అంకిత్**

**- రైతులకు శాస్త్రీయ సాగు సూచనలు... గ్రామ సమస్యలపై అధికారులకు తక్షణ ఆదేశాలు**



చంద్రుగొండ, జూన్ 05(విజన్ ఆంధ్ర) : ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాల సమగ్రాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ అంకిత్ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం చంద్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, మార్చి 6వ తేదీ నుంచి అన్ని శాఖల సమన్వయంతో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విజయవంతంగా అమలు అవుతోందని తెలిపారు. గ్రామసభలు ప్రజలకు ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు చేరవేసే సమర్థవంతమైన వేదికలుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పారిశుద్ధ్యం, వర్షాకాలంలో అంటువ్యాధుల నివారణ వంటి అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువవుతున్నాయని వివరించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు పంట మార్పిడి విధానాలను అనుసరించాలని, వ్యవసాయ శాఖ సూచనల మేరకు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని సూచించారు. ఎరువులు, పురుగుమందుల వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అధిక దిగుబడుల కోసం ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని రైతులకు సూచించారు. గ్రామాల్లో సాలిడ్ అండ్ లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రతి కుటుంబం తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే అలవాటు అలవరుచుకోవాలని కోరారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)ను సమర్థవంతంగా అమలు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించడం, అనర్హుల పేర్లను జాబితా నుంచి తొలగించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. అలాగే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక మౌలిక వసతులు, డిజిటల్ విద్య, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు తదితర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, రైతులు, గ్రామస్థులు పంట పొలాలకు వెళ్లే రహదారుల అభివృద్ధి, గ్రామంలో అదనపు విద్యుత్ లైన్ల ఏర్పాటు, అంతర్గత రహదారుల నిర్మాణం, తాగునీటి కోసం ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలపై స్పందించిన కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను వెంటనే చర్యలు చేపట్టి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామారావు, డీఆర్‌డీఓ విద్యా చందన, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎస్పి బాలు జన్మదివేడుకలు



నారాయణపేట, జూన్ 4 (విజన్ ఆంధ్ర) : సంగీత స్వర నిఘంటువు బాలు...సంగీత ప్రపంచానికే స్వర నిఘంటు బాలుఅని నేటి కళాకారులకు స్ఫూర్తి దాయకమని 50వేలకుపైగా దేశభక్తి అన్నమయ్య కీర్తనలతోపాటు భక్తి, సినీ పాటలను ఆలపించి పాడుత తీయాగ కార్యక్రమం ద్వారా ఎందరో కళాకారుల్లో దాగి ఉన్న కళను వెలిక్కి తీసి ప్రోత్సహించిన మహోన్నత గాయకుడు ఎస్పి బాలు ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మహిపాల్ రెడ్డి అన్నారు గురువారం బాలకేంద్రంలో ఎస్పి బాలు 80 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈసందర్భంగా అయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్ళర్పించి చిన్నారులకు పండ్లు పంపిణి చేశారు ఈ కార్యక్రమంలో గాయకులు బాలాజీ గౌడ్ సంగనర్సింహులు రామకృష్ణ కళ్యాణి వసంత్ జ్ఞానమృత తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలోట్రైనింగ్ ఆన్ ఎస్ఐఆర్ వీడియో కాన్ఫరెన్స్

**- పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా**





ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,జూన్ 04,( విజన్ ఆంధ్ర) గురువారం ఢిల్లీ నుండి కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో 'ట్రైనింగ్ ఆన్ ఎస్ఐఆర్ ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అడిషనల్ కలెక్టర్ ఆర్.ఎస్.చిత్రు, డిఆర్ఓ స్రవంతి, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియా, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయిలో చేపట్టవలసిన వివిధ కీలక దశలపై అధికారులకు సమగ్రమైన అవగాహన కల్పించారు. ముఖ్యంగా ప్రారంభ దశలో తీసుకోవాల్సిన ప్రాథమిక చర్యలు, ప్రణాళికలకు సంబంధించిన ప్రీ ఎస్ఐఆర్, నివేదికల రూపకల్పనకు ముందు సిద్ధం చేసుకోవాల్సిన సాంకేతిక వివరాలపై ప్రీ డ్రాఫ్ట్, డ్రాఫ్ట్ అనంతరం అనుసరించాల్సిన తదుపరి కార్యాచరణలు, నివేదికల సమర్పణపై పోస్ట్ డ్రాఫ్ట్ దశల గురించి క్షుణ్ణంగా వివరించారు. ముఖ్యమైన దశల్లోని యాక్టివిటీస్‌ను ఎలాంటి లోపాలు లేకుండా, అత్యంత పారదర్శకంగా పూర్తి చేయాలనే అంశాలపై శిక్షకులు అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## "పాల్వంచలో నిషేధిత గంజాయి పట్టివేత



పాల్వంచ ప్రతినిధి జూన్ 4(విజన్ ఆంధ్ర) : పాల్వంచ మండలంలోని కేశవపురం గ్రామపంచాయతీ పరిధిలో గురువారం ఎండు గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను ఖమ్మం అబ్కారీ శాఖ ఎన్ఫోర్స్మెంట్ టీమ్ ఎస్సై శ్రీహరి రావు సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. పాల్వంచ మండలంలోని కేశవపురం గ్రామపంచాయతీ పరిధిలో గురువారం ఎండు గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను ఖమ్మం అబ్కారీ శాఖ ఎన్ఫోర్స్మెంట్ టీమ్ ఎస్సై శ్రీహరి రావు సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 4.480 కి.గ్రాల నిషేదిత గంజాయి సీజ్ చేసి.. 2 మోటార్ సైకిళ్ళు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో కర్నూల్‌కు చెందిన ఎస్కే మహమ్మద్ ఆవేజ్ భాష, పశుపాల జగన్నాథ్, ఛత్తీస్‌గఢ్ మల్కన్గిరి, నాలగుంట గ్రామానికి చెందిన ప్రసన్న జీత్ మండల్, ప్రీతం రాయ్ లు ఉన్నారు. ఈ దాడిలో హెడ్ కానిస్టేబుల్ ఎం.డి.ఖలీల్ అహ్మద్, జమాల్ షరీఫ్, కానిస్టేబుళ్లు, ప్రసన్న ఉపేందర్, నాగరాజ్, వి.శివ శంకర్ పాల్గొన్నారు."

## రాజుపేట నూతన వస్త్రాలంకరణ వేడుకలో పాల్గొన్న బాడిశ నాగ రమేష్



ములుగు జూన్ 04, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు జిల్లా మంగపేట మండలం రాజుపేట గ్రామంలో బుధవారం నూతన వస్త్రాలంకరణ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ నాయకులు లిబాడిశ నాగ రమేష్ లి హాజరై చిన్నారిని దీవించారు. వేడుకలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు ఎడ్లపల్లి నరసింహారావు ఉన్నారు. ఈ సందర్భంగా బాడిశ నాగ రమేష్ మాట్లాడుతూ, "రాజుపేట గ్రామ ప్రజలు తమ సంస్కృతి సంప్రదాయాలను ఇంత గొప్పగా కొనసాగించడం అభినందనీయం. బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ గ్రామీణ సంప్రదాయాలకు, మనోభావాలకు అండగా నిలుస్తుందన్నారు, "ప్రజల నమ్మకాలకు, ఆచారాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. నూతన వస్త్రాలంకరణ వంటి వేడుకలు సమాజంలో ఐకమత్యాన్ని పెంచుతాయి" అని అన్నారు. మహిళలు, పెద్ద సంఖ్యలో తరలివచ్చి వేడుకను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు, పాల్గొన్నారు.

## రామప్పలో బడే నాగజ్యోతి పర్యటన

**- స్థానిక సమస్యల పరిష్కారంపై దృష్టి, టీఆర్ఎస్ సభ్యత్వ నమోదుకు పిలుపు**

**- పార్టీ బలోపేతానికి కార్యాచరణ రూపొందించిన మాజీ జడ్పీ చైర్మన్**

ములుగు జూన్ 04, విజన్ ఆంధ్ర ప్రతినిధి : వెంకటాపూర్ మండలం రామప్పలో బుధవారం మాజీ జడ్పీ చైర్మన్, టిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి పర్యటించారు. రామప్ప పరిసర ప్రాంతాల్లో స్థానిక సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కార మార్గాలపై స్థానిక నాయకులు, కార్యకర్తలతో ఆమె సమావేశమై చర్చించారు. గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, వైద్య సౌకర్యాల వంటి సమస్యలపై అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టిఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఊపు.. ఈ సందర్భంగా బడే నాగజ్యోతి మాట్లాడుతూ, "కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం సాధించిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం. ఈ విజయాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనపై ఉంది" అని అన్నారు. టిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గ్రామస్థాయి వరకు బలోపేతం చేయాలని, ప్రతి గ్రామంలో కనీసం 500 మంది కొత్త సభ్యులను నమోదు చేయాలని లక్ష్యం పెట్టుకున్నట్లు తెలిపారు. "పార్టీ అంటే కార్యకర్తలు. కార్యకర్తల కష్టమే పార్టీ బలం" అని ఆమె కార్యకర్తలను ఉత్సాహపరిచారు. పార్టీ బలోపేతానికి 3 సూత్రాలు పార్టీని బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై నాయకులతో విస్తృతంగా చర్చించారు. ప్రతి బూత్ కమిటీని క్రియాశీలంగా ఉంచడం యువత, మహిళలను పార్టీలోకి ఆకర్షించడం ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో నిరంతరం సంబంధాలు కొనసాగించడం"మనం చేసిన మంచిని ప్రజలకు చెప్పాలి. బీఆర్ఎస్ జెండాను మరింత ఎత్తుకు ఎగరేయాలి" అని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు, స్థానిక నాయకులు, సర్పంచులు, వార్డు సభ్యులు, యువజన, మహిళా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వరద నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

**- తోట లక్ష్మీకాంత్ రెడ్డి**



అల్వాల్, జూన్ 4,(విజన్ ఆంధ్ర): రాబోయే వర్షాకాలంలో వరద నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామని కాంగ్రెస్ పార్టీ మల్కాజ్గిరి నియోజకవర్గ ఇంచార్జ్ తోట లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన, కాంగ్రెస్ నాయకులు, కాలనీ వాసులతో కలిసి 194 డివిజన్ భూదేవి నగర్, రాజీవ్ కాలనీలలో పాదయాత్ర నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా కాలనీలలో నెలకొంటున్న వరద నీటి సమస్యల పరిష్కారాన్ని దృష్టిలో ఉంచుకొని తగిన చర్యలు చేపడతామని కాలనీవాసులకు భరోసాని చ్చారు. ప్రతి యేటా వర్షా కాలంలో నీట మునిగే వీధులు, ఇళ్లల్లోకి చేరే వరద నీరు, నీటి నిల్వకు కారణ మైన అడ్డంకుల తొలగింపు వంటి పనులను వేగవంతం చేసి, సమస్యల పరిష్కార దిశగా ముందుకు పోతున్నామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు కేబుల్ శేఖర్, డివిజన్ అధ్యక్షులు మల్లెల శివ, సీనియర్ నాయకులు నిమ్మ అశోక్ రెడ్డి, నాగేశ్వర్ రావు, వెంకట్రావు, బి.ఎన్. రమేష్, కృష్ణ గౌడ్, భాస్కర, శివశంకర్, సాయికుమార్, నరేష్, శకుంతల నాయుడు, భబిత, లావణ్య,లక్ష్మి, శారద తదితరులు పాల్గొన్నారు

# మంగంపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా - ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి




పెద్దమందడి జూన్ 04 (విజన్ ఆంధ్ర ):మండలంలోని మంగంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ప్రత్యేక గ్రామ సభను నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో పాటు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మండల స్థాయి అధికారులు రోడ్డు భద్రత, బాల్యవివాహాల నిర్మూలన, వర్షాకాలం నేపథ్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటు, పరిసరాల పరిశుభ్రత, వన మహోత్సవం, జల సంరక్షణ, పాఠశాలల్లో సౌకర్యాలు సహా తదితరాంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించి ప్రజల మెప్పు పొందుతుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పైనే సీఎం తొలి సంతకం చేశారని గుర్తు చేశారు. కేవలం వనపర్తి నియోజకవర్గం లోని మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం 30 కోట్ల రూపాయలు ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. ప్రజల ఆరోగ్య భద్రత కోసం ఐదు లక్షల రూపాయలు ఉన్న ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రజా ప్రభుత్వం 10 లక్షల రూపాయలకు పెంచిందన్నారు. పేద ప్రజలు విద్యుత్ భారం ఇబ్బందులు పడకుండా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తుందన్నారు. అదేవిధంగా రైతులకు రైతు భరోసాతో పాటు రెండు లక్షల రుణమాఫీని చేసి అండగా నిలుస్తుంది అని తెలిపారు. ప్రజా ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేసి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తుందని తెలిపారు. కాబట్టి ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలన్నారు. తన సొంత గ్రామమైన మంగంపల్లిని ఇందిరమ్మ ఇండ్ల పథకానికి పైలట్ గ్రామంగా ఎంపిక చేసి ఇండ్ల నిర్మాణం చేయడం జరుగుతుందని తెలిపారు. మంగంపల్లి గ్రామంలో ఒక్క పూరిగుడిసె కూడా లేకుండా అన్ని పక్క ఇండ్లే ఉండే విధంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే నూతన గ్రామపంచాయతీ, అంగన్వాడీ భవనాలతో పాటు సిసి రోడ్లు డ్రైనేజీలను కూడా పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాన్ని ఇంకా అభివృద్ధి చేయడం కోసం తన వంతుగా రూ. 10 లక్షలు కేటాయిస్తానని, జిల్లా కలెక్టర్ ద్వారా మరో రూ.10 లక్షలు తెప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంగంపల్లి గ్రామంలోని ప్రతి ఇంటికి సి ఎస్ ఆర్ నిధులతో సోలార్ ఏర్పాటు చేయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలో ఇప్పటికే సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించడం జరిగిందని తెలిపారు. గ్రామంలోని ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. గ్రామంలో ఏ కార్యం జరిగిన ఐదు మొక్కలు నాటే పద్ధతిని ప్రారంభించాలని తద్వారా మన గ్రామాన్ని మోడల్ గా తీర్చిదిద్దేందుకు అడుగులు పడాలని సూచించారు. రైతులు కూడా కేవలం వరి మాత్రమే కాకుండా పంట మార్పిడి పద్ధతిని అవలంబించాలని సూచించారు. పామాయిల్ వంటి తోటలను పెట్టేందుకు మొగ్గు చూపాలన్నారు. మహిళలు కూడా ఏదైనా వ్యాపారం చేసేందుకు ముందుకు వస్తే రుణ సదుపాయాన్ని కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా నేడు నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో మంగంపల్లి గ్రామ సర్పంచ్ తో పాటు వార్డు సభ్యులందరూ ఉపాధి హామీ కింద ఇంకుడు గుంతలు తీసుకుంటామని తెలియజేయడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. మంచి నిర్ణయం తీసుకున్న గ్రామ పాలకవర్గాన్ని అభినందిస్తున్నానని తెలిపారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా గ్రామంలో భూగర్భ జలాలు పెరిగి మంచినీటి సదుపాయాలు కలుగుతాయి అన్నారు. అదేవిధంగా గ్రామంలో గత ఐదేళ్ల వ్యవధిలో 18 ఏళ్ల నుండి 50 ఏళ్లలోపు వ్యక్తులు ఎవరైనా మరణిస్తే జాతీయ కుటుంబ ప్రయోజన పథకం ద్వారా దరఖాస్తు చేసుకొని రూ. 20 వేల లబ్ధి పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం అర్హులైన ఓటర్లందరినీ జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం నిర్వహిస్తుందని ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొని అధికారులకు సహకరించాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు ఉన్నాయని కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి చదివించాలని సూచించారు. అమ్మాయిలకు బాల్యవివాహాలు చేయకుండా ఉన్నత చదువులు చదివించాలని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు మంచి ఫలితాలు వచ్చాయని కాబట్టి ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, ఎంపీడీవో పరిణత, ఎస్సై జలంధర్ రెడ్డి, వార్డు సభ్యులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, మండల అధ్యక్షులు, ప్రజలు, ఇతర అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


# పేట జిల్లా కేంద్రంలోనే పూర్తి స్థాయి వైద్య సేవలు అందించాలి

**పేట జిల్లా తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్**



నారాయణపేట, జూన్4 (విజన్ ఆంధ్ర) : నారాయణపేట జిల్లా కేంద్రం లోనే పూర్తి స్థాయి వైద్య సేవలను పునరుద్ధరించి, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని బలోపేతం చేయాలని నారాయణపేట జిల్లా టి ఆర్ ఎస్ అధ్యక్షుడు గవినోళ్ళ శ్రీనివాస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు.సి ఎం. నారాయ ణపేట జిల్లాకు గురువారం విచ్చేస్తున్న సందర్భంగా జిల్లా ప్రజల తరఫున ఈ బహిరంగ లేఖ రాస్తున్నాననీ పేర్కొన్నారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభు త్వ ఆసుపత్రి ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. మరోవైపు, జిల్లా కేంద్ర ప్రజ లకు అందుబాటులో ఉండా ల్సిన వైద్య సేవలను పట్టణా నికి సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాల (మెడికల్ కాలేజీ) పరిధిలోకి తరలించడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ముఖ్యంగా మహి ళలు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు, ప్రమాదాల్లో గాయప డిన బాధితులు, అత్యవసర వైద్య సేవలు అవసరమైన పేద ప్రజలు జిల్లా కేంద్రం నుండి దూరంగా ఉన్న ఆసు పత్రికి చేరుకోవడానికి తీవ్ర కష్టాలు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఈ దూరం ప్రాణాంతకంగా మారే ప్రమాదం నెలకొంది అన్నారు. గురువారం మక్తల్ పర్యటన చేపట్టిన ముఖ్యమంత్రి నారాయణపేట జిల్లా కేంద్రం నుండి అప్పంపల్లి గ్రామానికి తరలించిన ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తానని చెప్పలేకపోవడం ఎంతో సిగ్గుచేటని పేర్కొన్నారు.జిల్లా ఏర్పడి న తర్వాత ప్రజలకు మెరుగై న వైద్య సేవలు అందుతా యని ఆశించినప్పటికీ, ప్రస్తుతం జిల్లా కేంద్రంలో పూర్తి స్థాయి ప్రభుత్వ ఆసుపత్రి లేకపోవడం ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. జిల్లా ఆసుపత్రిని బలోపేతం చేయడం, అవసరమైన వైద్యులు, సిబ్బందిని నియ మించడం, అత్యవసర సేవ లు, ప్రసూతి సేవలు, ట్రామా కేర్ వంటి సేవలను జిల్లా కేంద్రంలోనే అందుబాటులో ఉంచడం అత్యంత అవసరం. ఈ సమస్యపై మేము పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు. నారా యణపేట జిల్లా కేంద్రంలోనే వైద్య సేవలు పునరుద్ధ రించాలని డిమాండ్ చేస్తూ సుమారు 2000 మంది ప్రజలతో భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కబ్వినతిపత్రం సమర్పించా ము. అదేవిధంగా ప్రజల వైద్య హక్కులు హరించ బడుతున్నాయనే అంశంపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్కు ఫిర్యా దు చేయగా, కమిషన్ కేసు నమోదు చేసి సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసిన విషయం ప్రభు త్వ దృష్టికి తీసుకువస్తు న్నాము. అందువల్ల, మీరు నారాయణపేట జిల్లా పర్య టన సందర్భంగా నారాయణపేట జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిని వెంటనే పునరుద్ధరించాలి. జిల్లా కేంద్రంలోనే పూర్తి స్థాయి వైద్య సేవలను పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులో ఉంచాలి. గర్భిణీలు, వృద్ధులు మరియు ప్రమాద బాధితుల కోసం ప్రత్యేక అత్యవసర వైద్య విభాగాలను ఏర్పాటు చేయాలి. జిల్లా ఆసుపత్రిలో అవసరమైన వైద్యులు, నర్సులు, సిబ్బందిని నియ మించాలి. ప్రజల అభిప్రా యాలను తెలుసుకొని శాశ్వత పరిష్కారం చూపాలి.ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం, మానవ హక్కులకు సంబం ధించిన ఈ సమస్యను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

## మతిస్థిమితం లేని యువతి అదృశ్యం



మల్కాజిగిరి, జూన్ 4,(విజన్ ఆంధ్ర):మతిస్థిమితం లేని యువతీ అదృశ్యమైన సంఘటన నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివ రాలిలా ఉన్నాయి. నేరేడ్ మెట్ వినాయక్ నగర్ కు చెందిన శ్రీనం కుమార్తె బి. ప్రియాంక (20) మతిస్థిమితం లేదు. గతంలో ఇంట్లో నుండి వెళ్లిపోయి చాలా సార్లు తిరిగి ఇంటికి వచ్చింది. అలాగే ఆరు నెలల క్రితం తన తల్లి ఇంట్లో లేని సమయంలో ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం తన తల్లి బి.రాణి బంధు మిత్రులు, తెలిసిన వారి వద్ద పలు ప్రాంతాలలో వెతకినా ఆచూకీ లభించలేదు. అదృశ్యమైన యువతి ఎత్తు 5.0, రంగు చామనఛాయ, భాష తెలుగు మాట్లాడు తుంది. ఇంట్లో నుండి వెళ్లేటప్పుడు గోధుమరంగు చుడిదార్ ధరించింది. గతంలో ఇంట్లో నుండి వెళ్లి చాలా సార్లు తిరిగి ఇంటికి వచ్చింది. ఈ సారి తిరిగి ఇంటికి రాలేదు. యువతి తల్లి రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నేరేడ్మెట్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ఐక్యంగా పనిచేయాలి

**- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**



అల్వాల్, జూన్ 4,(విజన్ ఆంధ్ర): రాబోయే రోజుల్లో బి ఆర్ ఎస్ పార్టీని మరింత బలపర్చేందుకు కార్య కర్తలంద రూ ఐక్యంగా పనిచేయాలని మల్కాజిగిరి శాసనసభ సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి సూచించారు. బుధవారం మల్కాజిగిరి నియోజకవర్గంలోని బి ఆర్ ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరైన మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లా డుతూ...పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసు కెళ్లాలని సూచించారు. ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. అలాగే 'సర్' కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సమిష్టిగా ముందుకు వెళ్ళాలని ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి, నాయకులకు పిలుపుని చ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఎంబీసి కార్పొరేషన్ డెవలప్మెంట్ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్ హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..


# పంట మార్పిడితోనే అధిక దిగుబడులు రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి

**- కలెక్టర్ సత్య శారద**




వరంగల్ జిల్లా ప్రతినిధి జూన్04(విజన్ ఆంధ్ర); పంట మార్పిడి విధానాలను అనుసరించడం ద్వారా రైతులు అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం పొందవచ్చని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సంగెం మండలం చింతలపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు.సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా గురువారం 11 మండలాలలో గ్రామ సభలు నిర్వహించడం జరిగిందని, గ్రామ సభల్లో మన గ్రామం మన బాధ్యత చెత్తను వేరు చెయ్యండి ప్రకృతిని కాపాడండి అనే కాన్సెప్ట్ తో మనం ముందుకు వెళ్ళాలని ప్రతి గ్రామం అభివృద్ధి చెందినట్లు అయితే మండలాలు జిల్లా వ్యాప్తంగా అభివృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. గత ఏడాది జిల్లాలో వరి, మొక్కజొన్న ధాన్యం అధిక దిగుబడి సాధించడం సంతోషకరమన్నారు. ఈసారి రుతుపవనాల రాక ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు పంట మార్పిడికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. తక్కువ నీటితో సాగు చేయగల మొక్కజొన్న, పత్తి వంటి పంటలను సాగు చేయాలని కోరారు. అధిక రసాయన ఎరువుల వినియోగం ఆరోగ్యానికి, పర్యావరణానికి హానికరమని పేర్కొన్నారు. గ్రామాల్లో వ్యవసాయ అధికారుల సూచనలతో పాటు సంప్రదాయ సాగు పద్ధతులను కూడా అనుసరించాలని రైతులకు సూచించారు.ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, ప్రతి గ్రామంలో స్టీల్ బ్యాంకులు ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం ద్వారా గ్రామాలను పరిశు భ్రంగా ఉంచుకోవచ్చన్నారు. వర్షాకాలంలో దోమలు, ఈగలు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆడపిల్లల విద్య, ఆరోగ్యంపై దృష్టి మహిళల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత సమాజ అభివృద్ధికి కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. పర్యావరణహిత శానిటరీ ప్యాడ్ల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ఆడపిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పదో తరగతి ఫలితాల్లో 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థుల సంఖ్య పెరగడం ఆనందదాయకమని ఆమె తెలిపారు. ఈ గ్రామ సభలో గ్రామ సర్పచ్ బొమ్మ పావని జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, ఎంపీడీవో రవీందర్ బీఎండబ్ల్యూ రమేష్, సంబంధిత శాఖల అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్ జిల్లా ప్రతినిధి జూన్04(విజన్ ఆంధ్ర); జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం సంగెం మండలం చింతలపల్లి గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పంట కాలువల పనులను పరిశీలించారు.పనులు జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించి ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు.పనుల నాణ్యతను కాపాడుతూ నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వేసవి, వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కార్మికుల భద్రతకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పని ప్రదేశాల్లో తాగునీరు, ప్రథమ చికిత్స సదుపాయాలు అందుబాటులో ఉంచాలని సూచించారు.కార్మికుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ ఉపాధి హామీ పనులు సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.గ్రామ అభివృద్ధి ధ్యేయంగా పరిసరాలు పరిశుభ్రత పర్యావరణ పరిరక్షణ ప్లాస్టిక్ నియంత్రణ అంశాలపై జిల్లా కలెక్టర్ వారికి పలు సూచనలు చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాస ప్రాముఖ్యతను వారికి వివరించారు. ఈ సందర్భంలో గ్రామ సర్పంచ్ బొమ్మ పావని, జడ్పీ సీఈఓ రామిరెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మాన్‌సూన్ రెగెట్టాలో తెలంగాణ సెయిలర్ల హవా



హైదరాబాద్, జూన్ 04 (విజన్ ఆంధ్ర) : హుస్సేన్‌సాగర్‌లో జరుగుతున్న 17వ వైఏఐ మాన్‌సూన్ రెగెట్టా నేషనల్ ర్యాంకింగ్ సెయిలింగ్ చాంపియన్‌షిప్‌లో మూడో రోజు తెలంగాణ సెయిలర్లు సత్తా చాటారు. అండర్-16 ఆప్టిమిస్ట్ క్లాస్‌లో నిల్కొండ మణి 7 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా రవికుమార్ బన్నెవోలు(13), వుట్ల నరసింహ(15) తర్వాతి స్థానాల్లో నిలిచారు. ఇటీవల సింగపూర్ నేషనల్స్‌లో పాల్గొన్న నరసింహ జాతీయ చాంపియన్‌షిప్‌లో తన తొలి రేసు విజయాన్ని నమోదు చేశాడు. అండర్-16 బాలికల విభాగంలో రమీజా భాను(18) ముందంజలో ఉండగా, శృంగారి రాయ్(21), సాక్షి కుమారి(40) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. నోవీసెస్ విభాగంలో వీర్ విఘ్నేష్ అగ్రస్థానంలో మహమ్మద్ రెహ్మాన్ రెండో స్థానంలో నిలిచారు. బాలికల నోవీసెస్‌లో రోషిణి టాప్‌లో ఉంది. జూనియర్ లేజర్ బాయ్స్ విభాగంలో ప్రీత్ సివాల్(5), హృదయ్ జోషి(10), కౌనిక్ వర్ధన్(18) తొలి మూడు స్థానాల్లో ఉండగా, లేజర్ గర్ల్స్‌లో కాత్యాయని కౌశిక్, రమ్యశ్రీ మధ్య గోల్డ్, సిల్వర్ కోసం పోటీ కొనసాగుతోంది. 29 ఇఆర్ స్కిఫ్స్ బాయ్స్ విభాగంలో వినోద్ దండు-అరవింద్ మలోత్ జోడీ(7) అగ్రస్థానంలో ఉండగా, శరణ్య జాదవ్ శివం వాల్మీకి(9), రిజ్వాన్ మహమ్మద్-సాత్విక్ ధోకి(13) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఇంటర్నేషనల్ 420 మిక్స్‌డ్ క్లాస్‌లో చంద్రలేఖ-ధనుష్ జోడీ(7) అగ్రస్థానంలో కొనసాగుతుండగా, బద్రీనాథ్-రిశ్విక(8), శిరీష-రాంచరణ్(14) జోడీలు తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికతోనే వార్డుల సమగ్ర అభివృద్ధి

**- జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,జూన్ 04, (విజన్ ఆంధ్ర ) తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" ద్వారానే పట్టణాల్లోని ప్రతీ వార్డు సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా గురువారం పట్టణంలోని 45వ వార్డు భుక్తాపూర్ కాలనీలో నిర్వహించిన వార్డు సభకు మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వార్డుల్లో నెలకొన్న డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు, అంతర్గత రహదారులు, పారిశుధ్య సమస్యలను త్వరితగతిన గుర్తించి, వాటి పరిష్కారానికి తగిన ప్రణాళికలతో నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. వార్డు ప్రజల అవసరాలకు అనుగుణంగా అధికారులు ప్రగతి ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. మునిసిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల్లో స్థానిక ప్రజలు భాగస్వాములు కావాలని, అప్పుడే వార్డులను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడం సాధ్యమవుతుందన్నారు. అనంతరం వేసవి శిక్షణ శిబిరం స్విమ్మింగ్ పోటీలలో రెండవ బహుమతి పొందిన మునిసిపల్ చైర్ పర్సన్ దంపతుల కుమార్తె బండారి అమితకు కలెక్టర్ ప్రశంస పత్రాన్ని అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్, డీఈఓ మాధవి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, వార్డ్ ప్రత్యేక అధికారి నిహారిక, వివిధ శాఖల జిల్లా అధికారులు, వార్డు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు సీఎం రేవంత్ రెడ్డి పర్యటన,1406 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు

- **హెలిప్యాడ్, సభా ప్రాంగణం, రిజర్వాయర్లలో భద్రత పరిశీలించిన ఎస్పీ జానకి**
- **ముగ్గురు ఎస్పీలు, 16 మంది డీఎస్పీలు, 43 మంది సీఐలతో భారీ బందోబస్తు**
- **ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా చర్యలు ఎస్పీ**
- **అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి ఆదేశాలు**



జడ్చర్ల, జూన్ 4,(విజన్ ఆంధ్ర): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా పర్యటన సందర్భంగా 1,406 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ డి.జానకి తెలిపారు. కరువేనా రిజర్వాయర్, వుదండపూర్ రిజర్వాయర్, జడ్చర్ల పట్టణంలోని పబ్లిక్ మీటింగ్ ప్రాంగణం, హెలిప్యాడ్ ప్రాంతాలలో భద్రతా ఏర్పాట్లను ఎస్పీ జానకి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. జడ్చర్లలోని ఎయస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన బ్రీఫింగ్ కార్యక్రమంలో ఎస్పీ జానకి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని సూచించారు. భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. భద్రతా చర్యల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. ఈ బందోబస్తు విధుల్లో ముగ్గురు ఎస్పీలు, ముగ్గురు అదనపు ఎస్పీలు, 16 మంది డీఎస్పీలు, 43 మంది సీఐ/ఆర్ఐలు, 94 మంది ఎస్సైలు, 315 మంది ఏఎస్సై/హెడ్‌కానిస్టేబుళ్లు, 614 మంది కానిస్టేబుళ్లు, 124 మంది మహిళా కానిస్టేబుళ్లు, 195 మంది హోంగార్డులు మొత్తం 1,406 మంది పాల్గొంటున్నారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బాలకోటి, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మాజీ సీఎం కేసీఆర్ ఓటమి కామారెడ్డికి తీరని మచ్చ

**-మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్**



కామారెడ్డి బ్యూరో జున్ 4 (విజన్ఆంధ్ర) : కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇక్కడ పోటీ చేసిన మాజీ సీఎం కేసీఆర్ ఓటమి కామారెడ్డికి తీరని మచ్చ అని, సరిదిద్దుకోలేని ఆ మచ్చను తొలగించుకునేలా ఇప్పటినుంచే ప్రతి ఒక్కరు కృషి చేయాలని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. గురువారం కామారెడ్డి పట్టణంలోని వెలమ ఫంక్షన్ హాలులో నిర్వహించిన కామారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు, సర్ పై విస్తృతస్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 30 నెలలుగా కాంగ్రెస్ పార్టీ ప్రజలను వంచిస్తుందన్నారున్ బీఆర్ఎస్ హయాంలో అన్ని రంగాల అభివృద్ధి జరిగిందన్నారు. కాంగ్రెస్ చరిత్ర మొత్తం మోసం, దగా అని, మోసపూరిత హామీలతో పబ్బం గడుపుకునే పార్టీ అని పేర్కొన్నారు. దేవుళ్ళ మీద ఒట్లు వేసి అమలు చేయలేని దౌర్భాగ్యపు సీఎం రేవంత్ రెడ్డి అని, ఇలాంటి సీఎం తెలంగాణలో ఉండటం దురదృష్టమన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని తరలించలేని స్థితిలో ప్రభుత్వం ఉందని, తెలంగాణలో రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని తెలిపారు. నియోజకవర్గంలో గతంలో జరిగిన తప్పులను సరిదిద్దుకుని ముందుకు సాగుదామన్నారు. 'మనపై పడిన మచ్చ తుడిపేయలేనిది. ఈ మచ్చ తనతో పాటు అందరిపై ఉంది. కామారెడ్డి అభివృద్ధి కోసం ఇక్కడ పోటీ చేసిన కేసీఆర్ ను ప్రజలు ఓడించడం కామారెడ్డికి తీరని మచ్చ అని, ఆ మచ్చ మామూలుగా పోయేది కాదన్నారు. మళ్ళీ కామారెడ్డిలో గులాబీ జెండా ఎగురవేసి కేసీఆర్ ను మళ్ళీ సీఎంను చేసేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేసిట్ హయాంలో విడుదలైన నిధులతో రూ.8 కోట్లతో డిగ్రీ కళాశాల మైదానంలో నాడు శంకుస్థాపన చేశామని, ప్రస్తుతం ఇంచార్జి మంత్రి సీతక్క ఇందిరాగాంధీ స్టేడియంలో శంకుస్థాపన చేశారన్నారు. నాలుగేళ్ళ క్రితం మంజూరైన స్టేడియం పనులు చేపట్టకపోవడం సిగ్గనిపించడం లేదా అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో రూ.23 కోట్లు మంజూరైతే ఆ నిధులతో పనులు చేస్తూ తామే తెచ్చామని కాంగ్రెస్ నాయకులు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. గత అగస్టులో కామారెడ్డిలో వరదలు వస్తే పరిశీలనకు వచ్చిన సీఎం 15 రోజుల్లో నివేదిక తెప్పించుకుని నిధులు మంజూరు చేస్తామని చూపి ఏడాది కావస్తోందని విమర్శించారు. రైతుల సమస్యలపై ఇప్పటికి స్థానిక ఎమ్మెల్యే కల్లాల వద్దకు వెళ్లలేదన్నారు. దమ్ముంటే కాంగ్రెస్, బీజేపీ నాయకులు చేసిందేమిటో చెప్పాలని సవాల్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ విజిగౌడ్, మాజీ ఎమ్మెల్యేలు జాజాల సురేందర్, హన్మంత్ షిండే, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో విఫలమైంది - ప్రశాంత్ రెడ్డి



కామారెడ్డి బ్యూరో జున్ 4( విజన్ ఆంధ్ర ) : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనలో పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి విమర్శించారు.సీఎం కనిపిస్తే టీవీలు కట్టేస్తున్నారు. రేవంత్ రెడ్డి ముఖం చూడటానికి ప్రజలు ఇష్టపడటం లేదు అన్నారు. ప్రజల దృష్టిలో అబద్ధాల కోరుగా, దుర్మార్గుడిగా, చేతకాని సీఎంగా, మోసకారిగా సీఎం రేవంత్ రెడ్డిమిగిలిపోయాడని విమర్శించారు.పదేళ్ళ రాష్ట్రంలో జనరంజక పాలన సాగించిన కేసీఆర్ రైతులను కడుపులో పెట్టుకుని చూసుకున్నారని గుర్తు చేశారు. ధాన్యం కొనుగోలు కేసీఆర్ ఉన్నప్పుడు ఎలా ఉండేది ఇప్పుడెలా ఉన్నాయని ప్రశాంత్ రెడ్డి ప్రశ్నించారు.కేసీఆర్ హయాంలో యూరియా సరఫరా ఎలా ఉండేది.. ఇప్పుడెలా ఉందో ప్రజలు ఆలోచించాలని సూచించారు. రైతులంటే రేవంత్ రెడ్డికి అంత చులకనా గతంలో 24 గంటలు వచ్చిన కరెంట్ 11 గంటలే వస్తుంది తెలంగాణలో మళ్ళీ మోటార్లు కాలిపోవడం మొదలైంది రాష్ట్రంపై సీఎం, మంత్రులు గద్దల్లా పడుతున్నారువేలకోట్ల భూములు దోచుకుని తింటున్నారు 14 ఎకరాల స్థలం ఫార్మా సిటీ కోసం భూములు సేకరించి పెడితే ఫోర్త్ సిటీ పేరుతో రేవంత్ రెడ్డి దోపిడీకి ప్రయత్నిస్తున్నారు.సివిల్ సప్లైలో కుంభకోణానికి పాల్పడ్డారుఎక్సైజ్ శాఖలో రూ.6 వేల కోట్ల కుంభకోణం జరిగిందన్నారు. వేణుగోపాల స్వామి ఆలయానికి సంబందించిన 116 ఎకరాల భూమిపై కన్నేశారని ఆరోపించారు.ప్రస్తుతం రైతు డిస్కం పేరుతో దోపిడీకి కుట్ర లేపారు.ఆదాయం వచ్చే డిస్కంలను ప్రైవేటుకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నారు.గతంలో రైతుల కోసం కేసీఆర్ ప్రభుత్వం రూ.15 వేల కోట్లు ఖర్చు చేసేంది ఆయన అన్నారు.ఫ్యాక్టరీలు, కమర్షియల్స్ మీద వచ్చే ఆదాయాన్ని రైతుల కోసం ఖర్చు చేసేవారు.ప్రస్తుతం ఆదాయం వచ్చేవి ప్రైవేటుకు, పైసా కూడా ఆదాయం రానివి ప్రభుత్వానికి అప్పగిస్తున్నారు.ఇవ్వన్నిటిని గట్టిగా అడిగితే కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారు.కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు నయా పైసా ఇవ్వడం లేదు,పైపెచ్చు పెట్రోల్ డీజిల్ ధరలు పెంచుతున్నారు,హైదరాబాద్ చుట్టూ ఏర్పాటు చేయనున్న ఆర్.ఆర్.ఆర్ ను కేంద్ర ప్రభుత్వం రిజెక్ట్ చేసిందని తెలిపారు. రాష్ట్రంలో 8 మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులున్నారని,ఆర్.ఆర్.ఆర్ ను ఎందుకు రిజెక్ట్ చేశారో కిషన్ రెడ్డి అడగాలని సూచించారు.రైతు డిస్కంలను మోడీ పెడితే రేవంత్ రెడ్డి ఒప్పుకున్నారు.తక్షణమే సీఎం రేవంత్ రెడ్డి రైతు డిస్కంల ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అనే పదం డిక్షనరీలో లేదని టీడీపీ నేతలు అంటే రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు ఖండించడం లేదు,తెలంగాణ ఏర్పాటును భారత్ పాకిస్తాన్ తో పోలిస్తే అడ్డుకునే వాళ్ళు లేకుండా పోయారని ఎద్దేవా చేశారు.

# క్రమశిక్షణ, సరైన మార్గదర్శకత్వం విజయానికి మూలం

**-మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ**

**-నిజామాబాదులో 'రెసోనెన్స్ ఫౌండేషన్ సెంటర్' ప్రారంభం**







నిజామాబాదు, జూన్04:( విజన్ ఆంధ్ర) : క్రమశిక్షణ, సరైన మార్గదర్శకత్వం విజయానికి మూలమని మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు. దేశంలో ఐఐటీ-జేఈఈ, నీట్ శిక్షణలో అగ్రగామిగా ఉన్న రెసోనెన్స్ విద్యాసంస్థలు నిజామాబాదులో ఉన్న హోటల్ వంశీ ఇంటర్నేషనల్ వేదికగా 'రెసోనెన్స్ ఫౌండేషన్ సెంటర్'ను ప్రారంభించింది. మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ ముఖ్య అతిధిగా హాజరై ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే బలమైన విద్యా పునాది నిర్మించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నిజామాబాదులో ఫౌండేషన్ కోచింగ్ ను అందుబాటులోకి తీసుకు వస్తున్న రెసోనెన్స్ విద్యా సంస్థలను అభినందించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.ఈ సందర్భంగా రెసోనెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు నర్రా మాట్లాడుతూ అనుభవజ్ఞులైన అధ్యాపకులు, క్రమబద్ధమైన బోధనా పద్ధతులు, నిరంతర విద్యా పర్యవేక్షణతో ఫలితాల ఆధారిత విద్యను అందించడానికి రెసోనెన్స్ కట్టుబడి ఉందన్నారు. ఈ ఫౌండేషన్ సెంటర్ విద్యార్థులకు ప్రాథమికాంశాలను బలోపేతం చేసుకోవడానికి, ఐఐటీ-జేఈఈ, నీట్, ఒలింపియాడ్స్ వంటి పోటీ పరీక్షలకు ఆత్మవిశ్వాసంతో సిద్ధమవడానికి సహాయపడుతుందని తెలిపారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రారంభ దశలోనే ప్రిపరేషన్ మొదలుపెట్టడం, సంపూర్ణ అవగాహనతో కూడిన అభ్యాసం, కెరీర్ ఆధారిత విద్యా ప్రణాళిక ప్రాముఖ్యతను వివరించారు.

**రెసోనెన్స్ విద్యాసంస్థలు, తెలంగాణ,ఆంధ్రప్రదేశ్**

రెసోనెన్స్ అనేది ఐఐటీ మద్రాస్ పూర్వ విద్యార్థి ఆర్కే వర్మ 2001లో రాజస్థాన్లోని కోటాలో స్థాపించారు. ఇది దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఒక ప్రతిష్టాత్మక విద్యాసంస్థ, గత రెండు దశాబ్దాలుగా రెసోనెన్స్ 87 నగరాల్లోని 150 పైగా కేంద్రాల ద్వారా 10 లక్షల (1 మిలియన్) పైగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చింది. ఇందులో 3.3 లక్షల పైగా విద్యార్థులు ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ప్రముఖ సాంకేతిక విశ్వవిద్యాలయాలు, టాప్ మెడికల్ కాలేజీలలో ప్రవేశాలు పొందారు.దేశవ్యాప్తంగా ఉన్న ఈ బలమైన వారసత్వంతో, పూర్ణచంద్రరావు నర్రా దూరదృష్టితో కూడిన నాయకత్వంలో రెసోనెన్స్ 2018లో హైదరాబాద్లో ఒకే ఒక్క క్యాంపస్తో ప్రస్థానాన్ని ప్రారంభించింది. ఎంపీసీ, బైపీసీ గ్రూపులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ.. ఐఐటీ-జేఈఈ, నీట్, ఇతర పోటీ పరీక్షలకు సమగ్రమైన శిక్షణ, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, క్రమశిక్షణతో కూడిన ప్రిపరేషన్, ఫలితాల ఆధారిత విధానంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో నిరంతర విజయాలకు, విద్యా నైపుణ్యానికి రెసోనెన్స్ విద్యాసంస్థలు ఒక చిహ్నంగా మారాయి. కేవలం ఏడు సంవత్సరాలలోనే, రెసోనెన్స్ విద్యాసంస్థలకు చెందిన 6,100 పైగా విద్యార్థులు ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఎయిమ్స్, ఇతర అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాలలో సీట్లు సాధించారు. ఈ అద్భుతమైన విజయాల స్ఫూర్తితో, రెసోనెన్స్ ఇప్పుడు ఫౌండేషన్ సెంటర్లు, పాఠశాలలు, ఈ-లెర్నింగ్, గ్లోబల్ స్టడీస్ రంగాలలోకి విస్తరించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా 50 పైగా క్యాంపస్లతో విజయవంతంగా దూసుకుపోతోందన్నారు. ఈ కార్యక్రమంలో 'రెసోనెన్స్ ఫౌండేషన్ సెంటర్' అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# గుడుంబా నిర్మూలనపై జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్

- **జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**
- **అక్రమ మద్యం తయారీ, విక్రయాలపై ఉక్కుపాదం**
- **11 పోలీస్ స్టేషన్ల పరిధిలో 35 బృందాలచే తనిఖీలు**
- **గుడుంబా 32.5 లీటర్లు, బెల్లం వాష్ 35 శ్రీ, కల్లు 705 లీటర్లు స్వాధీనం.**
- **జిల్లా వ్యాప్తంగా 26 మందిపై కేసులు నమోదు**
- **గుడుంబా, బెల్లం వాష్, కల్తీ కల్లు స్వాధీనం**



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,జూన్ 04, (విజన్ ఆంధ్ర) అక్రమ మద్యం తయారీ, విక్రయాలు మరియు రవాణాను పూర్తిగా అరికట్టేందుకు ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక గుడుంబా నిర్మూలన డ్రైవ్ నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లాలోని 11 పోలీస్ స్టేషన్ పరిధిలో 35 బృందాలచే నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో గుడుంబా, బెల్లం వాష్, కల్తీ కల్లు మరియు ఇతర ముడి పదార్థాలను స్వాధీనం చేసుకుని 26 మంది పై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మండలాల వారీగా వివరాలు :

ఉట్నూర్ : 3 కేసులు నమోదు. 6 లీటర్ల గుడుంబా, 15 లీటర్ల బెల్లం వాష్ స్వాధీనం.



నార్నూర్ : 7 మందిపై కేసులు నమోదు. 13 లీటర్ల గుడుంబా, 2 క్యాన్ల బెల్లం వాష్ స్వాధీనం.

ఆదిలాబాద్ రూరల్ : 6 మందిపై కేసులు నమోదు. 4 లీటర్ల గుడుంబా, 10 ప్యాకెట్ల గుడుంబా స్వాధీనం.

తలమడుగు : 2 కేసులు నమోదు. కల్తీ కల్లు నమూనాలు స్వాధీనం.

బేలా : 2 మందిపై కేసులు నమోదు. 2 లీటర్ల గుడుంబా స్వాధీనం.

గుడిహత్నూర్ : 1 కేసు నమోదు. 5 లీటర్ల కల్తీ కల్లు స్వాధీనం.

ఇచ్చోడ : 1 కేసు నమోదు, నలుగురు బైండోవర్. 2.5 లీటర్ల గుడుంబా, 500 లీటర్ల కల్లు మరియు కల్లు తయారీ సామగ్రి స్వాధీనం.

నేరడిగొండ : 5 మందిపై కేసులు నమోదు. 5 లీటర్ల గుడుంబా, 20 లీటర్ల బెల్లం వాష్, 200 లీటర్ల కల్లు స్వాధీనం.

జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో 26 మందిపై కేసులు నమోదు చేసి, 32.5 లీటర్ల గుడుంబా, 35 లీటర్ల బెల్లం వాష్ (అదనంగా 2 క్యాన్లు), 705 లీటర్ల కల్లు, స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు గిరిజన ప్రాంతాల్లో గుడుంబా తయారీ, విక్రయం ప్రజల ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగిస్తున్నాయని, ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ప్రజలు గుడుంబా తయారీ, విక్రయాలు, అక్రమ మద్యం రవాణాకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. జిల్లాలో మత్తు పదార్థాలు, గంజాయి, గుడుంబా నిర్మూలన కోసం ప్రత్యేక డ్రైవ్‌లు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

# 66 లక్షల విలువ చేసే 330 మొబైల్ ఫోన్లు బాధితులకు తిరిగి అందజేత

- **మొబైల్ ఫోన్ పోయిందా.. సీఈఐఆర్ లో ఫిర్యాదు చేయాలి.**
- **జిల్లాలో ఒక సంవత్సరంలో 1500 మొబైల్ ఫోన్లు బాధితులకు తిరిగి అందజేత.**
- **సెల్ఫోన్ దొంగలపై కేసులు నమోదు చేయాలని ఆదేశించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్.**





ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,జూన్ 04 (విజన్ ఆంధ్ర) : మొబైల్ ఫోన్ లేనిదే ఎలాంటి పని జరగని ఈ అధినాతన సమాజంలో మనకు అత్యంత విలువైనది, తక్కువ సమయంలో ఎక్కువ పని చేసే సాంకేతిక పరికరం మొబైల్ ఫోన్. మొబైల్ ఫోన్లో అన్ని వివరాలు, అన్ని జ్ఞాపకాలు, అన్ని లావాదేవీలకు సంబంధించిన అప్లికేషన్లు ఉంటాయి, సాధారణంగా ప్రజలు మొబైల్ ఫోన్లు పోగొట్టుకోవడం, దొంగలించబడటం జరుగుతుంది. పోగొట్టుకున్న, దొంగలించబడిన వాటిని పొందాలంటే, బాధితులు వెంటనే https://www.ceir.gov.in అనే వెబ్సైట్ లో లేదా దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలియజేశారు. ఆదిలాబాద్ జిల్లా నందు ఇలా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి సంపాదించడం కోసం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేకంగా రికవరీ బృందాన్ని ఏర్పాటు చేశారని, ఇలా జిల్లా ఎస్పీ ఆదేశాలతో వీరు వివిధ రాష్ట్రాల నుండి జిల్లాల నుండి బాధితులు పోగొట్టుకున్నటువంటి, దొంగలించబడినటువంటి 330 మొబైల్ ఫోన్ లను తిరిగి రాబట్టడం జరిగింది. జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజు నుండి ఇప్పటివరకు ఒక సంవత్సర కాలంలో 1500 మొబైల్ ఫోన్లను తిరిగి రాబట్టడం జరిగింది. ఇలా ఇంత మొత్తంలో రాబట్టడం జిల్లా చరిత్రలోనే ప్రథమం, మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితులు దాదాపు మధ్యతరగతి కుటుంబీకులు, బీదవారు వారు ఎంతగానో కష్టపడి కొనుక్కున్న మొబైల్ ఫోన్ను తిరిగి వారికి అందజేయాలని సదుద్దేశంతో ఈ బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ముఖ్యంగా మొబైల్ ఫోన్ దొంగతనాలు జరిగే ప్రాంతాలు రైతు బజార్, రిమ్స్, రైల్వే స్టేషన్, బస్టాండ్, ఇళ్లలో దొంగతనాలు, బంధువులకు ఫోన్ చేస్తానంటూ ఫోన్ తస్కరించడం లాంటివి జరుగుతున్నాయని వాటి వల్ల అప్రమత్తంగా ఉండాలని జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. మొబైల్ ఫోన్లను తిరిగి ఇచ్చే క్రమంలో గురువారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశం మందిరంలో ఆదిలాబాద్ జిల్లాలో మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న, చోరీకి గురైనటువంటి బాధితులకు 330 మొబైల్ ఫోన్లు (దాదాపు 66 లక్షల విలువ చేసే ) వివిధ ప్రాంతాల నుండి తెప్పించి బాధితులకు తిరిగి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి అందుకున్న బాధితులు సంతోషం వ్యక్తం చేస్తూ, జిల్లా ఎస్పీకి ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ప్రతి నెల రోజుల లో పోగొట్టుకున్నటువంటి మొబైల్ ఫోన్లను తిరిగి రాబట్టి బాధితులకు అందజేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. బాధితులు మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వెంటనే దగ్గర్లో ఉన్న సంబంధిత పోలీస్ స్టేషన్ను సంప్రదించాలని తెలిపారు. ముఖ్యంగా రాబట్టిన మొబైల్ ఫోన్లు ఉత్తర భారతదేశంలో ఉండటం వాటిని ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో తిరిగి రాబట్టడం జరిగిందని తెలిపారు. మొబైల్ దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేక బృందం ఏర్పాటు చేయడం జరిగిందని. దొంగలించిన పడిన మొబైల్ ఫోన్ల కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదిలాబాద్ డి.ఎస్.పి ఎల్ జీవన్ రెడ్డి, ప్రత్యేక బృందం సభ్యులు ఆర్ఎస్ఐ పి గోపి కృష్ణ, ఎం ఎ రియాస్, మజీద్, త్రిశూల్, అన్వేష్, నవనీత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగింపు వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ









శేరిలింగంపల్లి. జూన్ 4 :(విజన్ ఆంధ్ర) : చందానగర్ డివిజన్ పరిధిలోని పి జె ఆర్ స్టేడియంలో ఈ రోజు సీఎం సి వారి ఆధ్వర్యంలో నిర్వహించే సమ్మర్ కోచింగ్ క్యాంప్ 2026 ముగింపు వేడుకలలో అడిషనల్ కమిషనర్ స్పోర్ట్స్ సుభద్ర జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి మియాపూర్ సర్కిల్ డీసీ శశిరేఖ సీనియర్ నాయకులు శ్రీ రఘునాథ్ రెడ్డి తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రధానం చేసిన గౌరవ పిఏసిచైర్మన్ ఆరెకపూడి గాంధీ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ రోజు సీఎం సి సమ్మర్ క్యాంపు నెల రోజుల పాటు ఘనంగా నిర్వహించుకోవడం జరిగినది. ముగింపు వేడుకలు నిర్వహించుకోవడం జరిగినది. విజేతలకు బహుమతులు ప్రధానం చేయడం జరిగినది. ప్రతి ఒక్కరు ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవడం జరిగినది ఏప్రిల్ 25 నుండి మే 31 వరకు ఈ క్యాంపు జరుగునవి అని , మనిషి జీవితంలో చదువు, సంపాదనతో పాటు శారీరక ధారుడ్యం, మానసిక ఉల్లాసం ఎంతో ప్రాముఖ్యం అని. సీఎం సి సమ్మర్ క్యాంపు లో పుల్లెల గోపిచంద్, పివి సింధు క్రీడాకారులు కోచింగ్ తీసుకుని అంతర్జాతీయ వేదిక ల పై ఎన్నో అత్యుత్తమ పథకాలు సాధించి ,మన ప్రాంతం, మన దేశం పేరు ను విశ్వవ్యాప్తంగా చేశారని, మీరు కూడా వారిని ఆదర్శంగా తీసుకుని ఉజ్వల భవిష్యత్తు ను నిర్మించుకొని మీ తల్లిదండ్రులకు దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని , అదేవిధంగా తల్లిదండ్రులు తమ పిల్లలను తమకు నచ్చిన రంగాలలో మరియు పిల్లలలో దాగి ఉన్న నైపుణ్యతను గుర్తించి ఆ దిశగా అడుగులు వెయిస్తే పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది అని వారు ఎంచుకున్న రంగాలలో అద్భుత ఫలితాలు సృష్టిస్తారు అని, క్రీడలు శారీరక దారుఢ్యం తో పాటు మానసిక ఉల్లాసం ను ,ప్రశాంతతను కలిగిస్తాయి అని , ఈ సమ్మర్ కోచింగ్ ను ప్రతి ఒక్కరు సద్వినియోగపర్చుకొని జాతీయ ,అంతర్జాతీయ వేదికలలో పథకాలు సాధించి మన శేరిలింగంపల్లి ప్రాంతం మరియు తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింప చేయాలని, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని, అదేవిధంగా పిల్లలకు అన్ని రకాల మౌలిక వసతులు కలిపించి మెరుగైన శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఉత్తమ ఫలితాలు సాధించేలా పిల్లలను తీర్చిదిద్దాలని.ఎండ తీవ్రత ను దృష్టిలో పెట్టుకొని పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని కనీస జాగ్రత్తలు తీసుకోవడం రిగినది. ఈ చక్కటి అవకాశంను ప్రతి ఒక్కరు సద్వినియోగపర్చుకోవలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు , అక్బర్ ఖాన్, ఓ వెంకటేష్, నరేందర్ బల్లా, రాహుల్ మరియు నాయకులు ,కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు..



సూర్యాపేట జూన్ 04:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేట పట్టణంలోని 31వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ కొండపల్లి దిలీప్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని వాసన్ లేజర్ ఆస్పత్రి వైద్యం బృందం అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రం బ్రాహ్మణ కళ్యాణ మండపంలో వారు ఉచిత క్యాంపు ను నిర్వహించారు. ఈ సందర్భంగా వాసన్ లేజర్ కంటి ఆసుపత్రి వైద్య బృందం మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించింది. ఆసుపత్రి ప్రతినిధులు మాట్లాడుతూ, శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక గుర్తింపు కార్డులు అందజేస్తున్నామని, వాటిని భద్రపరుచుకుంటే రెండు నుంచి నాలుగు సంవత్సరాల వరకు ఎప్పుడైనా ఆసుపత్రికి వచ్చి ఉచిత కంటి పరీక్షలు చేయించుకోవచ్చని తెలిపారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని, శుక్లం (క్యాటరాక్ట్) వంటి కంటి వ్యాధులకు సాధారణంగా రూ. 25 వేల నుంచి రూ. 30 వేల వరకు ఖర్చయ్యే లెన్స్ ఆపరేషన్లను కేవలం రూ. 5 వేలకే అందిస్తున్నామని వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్య బృందం కోరింది. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలకు నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనార్ధన చారి,నిస్సి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ధన,ప్రాణ రక్షణలో పోలీసుశాఖ నిరంతరం పని చేస్తుంది..



సూర్యాపేట జూన్ 04:(విజన్ ఆంధ్ర) : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా ఈరోజు సూర్యాపేట మున్సిపాలిటీ పరిధి 1వ వార్డు కుడకుడ గ్రామం నందు నిర్వహించిన గ్రామసభ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నర్సింహా హాజరై మాట్లాడారు. ప్రజలు, సమాజం అభివృద్ధికి ప్రభుత్వాలు విశేష కృషి చేస్తున్నాయి, అనేక సంక్షేమ పథకాలతో అభివృద్ధికి పాటుపడుతుంది అన్నారు, గ్రామం సమాజం అభివృద్ధి చెందాలంటే ప్రజల భాగస్వామ్యం ముఖ్యమని అన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకు త్వరితగతిన వాటికి పరిష్కారం చూపడం కోసం ఈ గ్రామ, వార్డు సభలు ముఖ్య ఉద్దేశ్యం, అధికారులు ప్రజల వద్దకు వచ్చి ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో అధికారులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నారు అని తెలిపినారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలకు భద్రత కల్పించడంలో పోలీస్ శాఖ అనుక్షణం కృషి చేస్తుందని శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యంతో ముందుకు వెళుతున్నామని ఆధునిక పోలీసులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పౌరులు సత్ప్రవర్తనతో చట్ట పరిధిలో నడుచుకోవాలని సూచించారు. స్థానిక సమస్యలపై, అసాంఘిక కార్యకలాపాలపై, ఆకతాయిల పై సమాచారం ఇవ్వడం లో ప్రతి పౌరుడు యూనిఫామ్ లేని ఒక పోలీస్ అన్నారు. తగాదాలు గొడవలు పెట్టుకుంటే కేసుల పాలవుతారని ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరించారు.. సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేసుకోవాలని సూచించారు. మహిళల భద్రత లో పోలీస్ శాఖ అధిక ప్రాధాన్యత పనిచేస్తుందని అన్నారు, ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల గురవ్వకుండా సురక్షితంగా గమ్యం చేరాలని అన్నారు. మన సమాజంలో యువతను గంజాయి లాంటి మాదకద్రవ్యం పట్టిపీడిస్తుందని దీనిని క్షేత్రస్థాయిలో నిర్మూలించాల్సిన బాధ్యత అందరికీ ఉన్నదని, గంజాయి కి సంబంధించిన సమాచారాన్ని పోలీసువారికి ఇవ్వాలని సూచించారు. ఫోన్లకు సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు బ్లూ లింకులు అనుసరించి బహుమతులు ఉన్నాయంటే అత్యాశ పోయి వ్యక్తిగత వివరాలు అపరిచితులకు ఇచ్చి ఆర్థికంగా నష్టపోవద్దని సైబర్ మోసాలకు గురికావద్దు అని తెలిపారు. దాడులు, దొంగతనాలు, మహిళా వేదింపులు, రోడ్డు ప్రమాదాలు లాంటి సమస్యలపై, పోలీసు స్టేషన్ కు రాలేని పరిస్థితుల్లో ప్రజలు డయల్ 100, 112 కు సమాచారం ఇచ్చిన వెంటనే ఫిర్యాదుదారుల వద్దకే వచ్చి ఇంటి నుండే కేసులు నమోదు చేసి కేసు పత్రాలను ఫిర్యాదుదారులకు బాధితులకు అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మెన్, మునిస్పల్ కమిషనర్, స్థానిక కౌన్సిలర్, హెల్త్ సెంటర్ వైద్యులు, గ్రామ ప్రజా ప్రతినిధులు, గ్రామ అధికారులు, స్థానిక ఎస్ఐ, గ్రామ పౌరులు ఉన్నారు.

# అధికారుల నిర్లక్ష్యంతో చెత్త కుప్పలా మారిన మూడో వార్డు



నారాయణపేట, జూన్ 4 (విజన్ ఆంధ్ర) : ప్రభుత్వంఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో అధికారుల నిర్లక్ష్యంతో వాటిలో సమస్యలు ఎక్కడికక్కడే తిష్ట వేశాయని వార్డు కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ ఆరోపించారు. గురువారం నారాయణపేట పట్టణంలోని మూడో వార్డులో ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడవ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించిన వినతి పత్రాలు అందజేసిన సమస్యలు మాత్రం పరిష్కరించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. వార్డులో విద్యుత్ శాఖ అధికారులు స్తంభాలను వేశారు కానీ వాటికి వైర్లు బిగించడం మరిచిపోయారని అన్నారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వంలో స్మశాన వాటికకు విద్యుత్తును ఏర్పాటు చేశారు. గత వారం రోజుల క్రితం గాలి వాన విపరీతంగా రావడంతో స్మశాన వాటికలో విద్యుత్ వైర్లు తెగిపోవడంతో అధికారులకు సమాచారాన్ని అందించిన కూడా వ్యక్తి వైర్లను ఇప్పటివరకు సరి చేయలేదని ఆరోపించారు. మూడో వార్డులో చెత్త వేసుకునేందుకు మున్సిపాలిటీ వాహనాలు రాకపోవడంతో వార్డులో ఎక్కడ చెత్త అక్కడే దర్శనమిస్తుందని ఆరోపించారు. మిషన్ భగీరథ పైప్లైన్లు వాటిలో వేయాలని ఎన్నోసార్లు అధికారులకు విన్నవించిన వినతి పత్రాలు ఇచ్చిన ఇంతవరకు పైపులను బిగించకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన కార్యక్రమంలోనైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి వార్డులో నెలకొన్న సమస్యలపై దృష్టి పెట్టి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆమె విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు మూడో వార్డుకు చెత్త వాహనాలను వచ్చే విధంగా చూడాలని ఆమె కోరారు. వాహనాలు రాకపోవడంతో పాటు ప్రజలు చెత్తను ఇంట్లో నిల్వ ఉంచడంతో రోగాల బారిన పడుతున్నారని దీంతోపాటు వార్డులో తమ ఇంటి చుట్టుపక్కల చెత్తను వేస్తూ దుర్వాసనతో ప్రజల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు వెంటనే స్పందించి మూడో వార్డుకు చెత్త వాహనాలను వచ్చే విధంగా చూడాల్సిందిగా కోరారు. ఈ ప్రజా పాలన కార్యక్రమంలో వాటిలోని సమస్యలను ఆమె స్వయంగా అధికారుల తో ఆమె వార్డు లో పర్యటించి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని వార్డుకౌన్సిలర్ కాకర్లనారాయణమ్మకు అధికారులు తెలిపారు.

# ప్రజల సంక్షేమాభివృద్దే ప్రభుత్వ లక్ష్యం

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 04,(విజన్ ఆంధ్ర ) : ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో ప్రభుత్వం చేపట్టిన గ్రామ/డివిజన్/వార్డు సభలలో భాగంగా గురువారం జిల్లాలోని హాజీపూర్ మండలం రాపల్లి గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన గ్రామసభకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సాయి వెంకట్ రెడ్డి, మండల విద్యాధికారి తిరుపతి, సర్పంచ్ రామ్ రెడ్డి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వం ఈ నెల 4, 6, 8, 10 తేదీల్లో ప్రత్యేక సభలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించడం జరిగిందని తెలిపారు. ఈసారి వర్షం తక్కువగా ఉన్నందున తదనుగుణంగా సాగు చేయగల పంటలను రైతులు ఎంపిక చేసుకోవాలని, ఆ దిశగా వ్యవసాయ, విస్తరణ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. యూరియా పంపిణీకి సంబంధించి యాప్ లో నమోదు చేయబడిన రైతులు, పంట, సాగు వివరాలకు అనుగుణంగా విడతల వారీగా యూరియా అందించడం జరుగుతుందని తెలిపారు. ఒకే రకమైన పంట సాగు చేయడం వలన భూసారం తగ్గుతుందని, ఈ పరిస్థితిని అధిగమించేందుకు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని, నానో యూరియా, డి ఎ పి, ప్రభుత్వం చేవీకరించబడిన విత్తనాలను మాత్రమే రైతులు వినియోగించాలని తెలిపారు. భూమి రకాన్ని బట్టి దాదాపు పత్తి పంట ఎకరానికి 14 నుండి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, రైతులకు మద్దతు ధర అందించడం జరుగుతుందని తెలిపారు. చిన్న, సన్న కారు రైతులు ప్రత్యామ్నాయంగా కూరగాయల పంటల సాగుపై దృష్టి సారించాలని, పంట సాగుకు ప్రభుత్వం రాయితీ అందిస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకుని లబ్ధి పొందాలని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టడం ద్వారా ఈ సంవత్సరం ఇప్పటివరకు ఎలాంటి డెంగ్యూ కేసులు నమోదు కాలేదని, ఇలాగే కొనసాగించి నట్లయితే వ్యాధుల నియంత్రణ సులభతరం అవుతుందని తెలిపారు. ప్రతిరోజు తడి, పొడి చెత్తను సేకరించాలని, ఉపయోగపడే వ్యర్థాల ద్వారా కంపోస్టు చేసి రైతులకు అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం, జనగణన కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. సమగ్ర సవరణ కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని, ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. జన గణన ప్రక్రియలో వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. విద్యా వ్యవస్థ బలోపేతం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. జూనియర్ కళాశాలలలో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని, ఈ విద్యా సంవత్సరం వార్షిక ఫలితాలలో దాదాపు 98 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం జరిగిందని తెలిపారు. ఈ వేసవిలో ప్రజలకు ఎలాంటి త్రాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు కార్యాచరణతో చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. వైద్యం, విద్య, మహిళా రక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు అంశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల తహసీల్దార్ల దృష్టికి తీసుకురావచ్చని, టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంపై అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలను నెరవేర్చుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం



నారాయణపేట, జూన్ 4 (విజన్ ఆంధ్ర) : నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలోని 14 వ వార్డులో రేష్మాబేగం మహమ్మద్ జాఫర్ తాజ్ యొక్క నిర్మాణం పూర్తిచేసుకున్న ఇందిరమ్మ ఇంటిని గురువారం పేట మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి,వార్డు కౌన్సిలర్ యల్.అరుణ మనోహర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ శంకర్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, కౌన్సిలర్ అరుణ మనోహర్ గౌడ్, లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి.రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేద కుటుంబాల సొంతింటి కల సాకారమవుతోందని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణిక రెడ్డి, కుంభం.శివకుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో 14వ వార్డుకు మొత్తం 20 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, అందులో ఇప్పటికే 16 ఇండ్ల నిర్మాణం పూర్తై లబ్ధిదారులకు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. మిగిలిన ఇండ్లు కూడా వేగంగా నిర్మాణం జరుగుతున్నాయని చెప్పారు. ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణిక రెడ్డి నారాయణపేట పట్టణ అభివృద్ధి,మౌలిక సదుపాయాల కల్పన, పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మనోహర్ గౌడ్,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి.సలీం,కాంగ్రెస్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు మహిమూద్ ఖురేషి, సీనియర్ నాయకులు భీంచందర్ గౌడ్,మాజీ కౌన్సిలర్ రమేష్,పళ్ళ అనిల్, యూసుఫ్ తాజ్,వెంకటేష్ గౌడ్, ఎరుకలి వెంకటయ్య, జబ్బార్,స్థానిక కాంగ్రెస్ నాయకులు, వార్డు ప్రజాప్రతి నిధులు, లబ్ధిదారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు తమ పంటలు వేసుకోవాలి

**- పంట మార్పిడి పద్ధతులు అవలంబించాలి**

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



నిర్మల్ జిల్లా,జూన్ 04,(విజన్ ఆంధ్ర); వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు తమ పంటల సాగులో మార్పులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. గురువారం కుంటాల మండలం అంబగంటి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్, శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది ఆశించినంత స్థాయిలో వర్షపాతం ఉండకపోవచ్చని వాతావరణ శాఖ నివేదికలు సూచిస్తున్నందున రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని అన్నారు. పంట మార్పిడి పద్ధతులను అవలంబించి, తక్కువ నీటి అవసరమయ్యే కొత్త రకాల పంటలను సాగు చేయాలని సూచించారు. ఈ విషయంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవసరమైన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం అందిస్తారని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించి అధిక లాభాలు పొందాలని, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని వినియోగించుకొని డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, లైసెన్స్ పొందిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు. విత్తనాల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అవసరానికి మించి ఎరువులు వాడరాదని సూచించిన కలెక్టర్, జిల్లాలో రికార్డు స్థాయిలో మొక్కజొన్న కొనుగోలు జరిగిందని, రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోలులో నిర్మల్ జిల్లా మూడో స్థానంలో నిలిచిందని తెలిపారు. రాబోయే వర్షాకాలంలో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను కూడా పాటించాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా చెత్త బండ్లలో వేయడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని చెప్పారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని, ప్లాస్టిక్ వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు అనేక రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. వర్షపు నీటిని వృథా కాకుండా ఒడిసిపట్టుకోవాలని, సోక్‌పిట్లు నిర్మించడం ద్వారా భవిష్యత్తు తరాలకు నీటి కొరత రాకుండా చూడాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ, ఈ సంవత్సరం తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు కందులు, మినుములు, పెసర్లు, నువ్వులు, పొద్దుతిరుగుడు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులు మంచి లాభాలు పొందుతున్నారని, ఇతర రైతులు కూడా ఆ దిశగా ముందుకు రావాలని అన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఇద్దరు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఆగ్రామ మహిళా సంఘ భవనం, జీవనోపాధి ఆర్థిక సాధికారిత కేంద్రాల ప్రారంభం అంతకుముందు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ మహిళా సంఘ భవనం, జీవనోపాధి ఆర్థిక సాధికారిత కేంద్రాలను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. గ్రామసభకు హాజరైన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డీపీఓ శ్రీనివాస్, డీఆర్డీఓ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, తహసీల్దార్ కమల్ సింగ్, ఎంపీడీఓ వనజ, సర్పంచ్ జ్యోతిబాయి, ఇతర అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# లేటెస్ట్ మోడల్స్ ను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి..



సూర్యాపేట జూన్ 04:(విజన్ ఆంధ్ర) : లేటెస్ట్ మోడల్స్‌కు కొత్త వేదికగా సాంసంగ్ ఎక్స్‌క్లూజివ్ షోరూమ్ నిలుస్తుందని సాంసంగ్ బ్రాంచ్ మేనేజర్లు ఆనంద్ సల్ల, శ్రీనివాస్ తెలిపారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కుడకుడ రోడ్డులో నూతన సాంసంగ్ షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని వినియోగదారులకు పలు ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కొనుగోలుపై కచ్చితమైన బహుమతితో పాటు లక్కీ స్క్రాచ్ కార్డు అందజేస్తున్నామని చెప్పారు. అన్ని ప్రముఖ బ్యాంకుల క్రెడిట్ కార్డులపై ఆకర్షణీయమైన క్యాష్‌బ్యాక్ ఆఫర్లు, వివిధ ఫైనాన్స్ సదుపాయాలు కూడా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. షోరూమ్‌లో సాంసంగ్‌కు చెందిన అత్యాధునిక టీవీలు, ఫ్రిడ్జ్‌లు, వాషింగ్ మెషీన్లు, ఏసీలు, మొబైల్ ఫోన్లు తదితర గృహోపకరణాలు ఒకేచోట లభిస్తాయని తెలిపారు. హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా సూర్యాపేటలోనే లేటెస్ట్ మోడల్స్, ఆధునిక సాంకేతికతతో కూడిన ఉత్పత్తులు సరసమైన ధరలకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ప్రతినిధులు అయ్యప్ప మోహన్, రాజేష్ గణేషన్, సునీల్ రాజు, డిస్ట్రిబ్యూటర్లు వల్లభ సురపూర్, చుక్కా ప్రవీణ్, ఏఎస్ఎంలు నరేష్, అనిల్, ఏబీఎం గంగాధర్ రెడ్డి, టీఎల్ ఉత్తేజ్, కరుణాకర్, సత్యనారాయణ, ఉమేష్, నరేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# యువత భవిష్యత్తుతో పొలిటికల్ గేమ్స్ ఆడితే సహించం!!

**- నాటి పదేళ్ల అన్యాయం.. నేటి 50 వేల ఉద్యోగాలు**

**- స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఫోకస్.. వివేక్ వెంకటస్వామి మార్క్**

**- అపోహలు సృష్టిస్తే ఊరుకోం.. బుద్ధి చెబుతాం**

**- లక్ష్యం ఒక్కటే.. రాష్ట్ర పురోగతి**

**- కేటీఆర్ వ్యాఖ్యలపై పెద్దపల్లి ఎంపీ ఫైర్, బిగ్ కౌంటర్**



పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 4 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ యువత భవిష్యత్తును అడ్డం పెట్టుకుని రాజకీయం చేయాలని చూస్తే చూస్తూ ఊరుకునేది లేదని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ బీఆర్ఎస్ నాయకులకు గట్టి హెచ్చరిక జారీ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వంటి నాయకుల తప్పుడు మాటలు, మాయమాటలు నమ్మి యువత తమ బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని ఆయన హితవు పలికారు. గత పదేళ్ల బీఆర్ఎస్ దుష్ట పాలనలో తెలంగాణ నిరుద్యోగులకు, యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల విషయంలో ఎంతటి ఘోరమైన అన్యాయం జరిగిందో రాష్ట్ర ప్రజలందరూ కళ్లారా చూశారని ఆయన మండిపడ్డారు. నాడు నోటిఫికేషన్ల పేరిట కాలయాపన చేసి నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్నారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే ఏకంగా 50 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చి, అత్యంత పారదర్శకంగా నియామకాలు చేపట్టిందని గుర్తుచేశారు. యువతకు కేవలం ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా, నైపుణ్యాభివృద్ధి (స్కిల్ డెవలప్‌మెంట్) ద్వారా అపారమైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని తెలిపారు. ముఖ్యంగా మంత్రి వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఎన్నో అద్భుతమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా అమలు అవుతున్నాయని తెలిపారు. ఇలాంటి ప్రజాహిత, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక, వాటిని స్వాగతించాల్సింది పోయి బీఆర్ఎస్ నాయకులు ప్రజల్లో లేనిపోని అపోహలు సృష్టిస్తూ యువతను తప్పుదారి పట్టించేందుకు కుట్రలు పన్నుతున్నారని తీవ్రంగా విమర్శించారు. కేవలం తమ రాజకీయ ఉనికి కోసమే యువతను రెచ్చగొట్టి లబ్ధి పొందాలని చూస్తే కాంగ్రెస్ పార్టీ సహించదని, తెలంగాణ యువత భవిష్యత్తుతో ఆడుకునే వారిని ప్రజలు క్షమించరని హెచ్చరించారు. తెలంగాణ యువత పురోగతి, ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తోందని, యువత బీఆర్ఎస్ కుట్రల వెనుక ఉన్న వాస్తవాలను గుర్తించి అభివృద్ధి పథంలో కలిసి నడవాలని ఎంపీ వంశీకృష్ణ పిలుపునిచ్చారు.

# శిక్షణ కేంద్రాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలి.

**పుట్టగొడుగుల తయారీ శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన ఎంఈఓ సాయిలు.**

**నిజామాబాద్ జూన్04:( విజన్ ఆంధ్ర ) :** శిక్షణ కేంద్రాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకొని, తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలని ఎంఈఓ సాయిలు సూచించారు. పుట్టగొడుగుల తయారీ శిక్షణ కేంద్రాన్ని మోపాల్ మండల విద్యాశాఖ అధికారి సాయిలు గురువారం సందర్శించారు. న్యాల్కల్ ప్రాథమిక పాఠశాలలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సౌజన్యంతో జరుగుతున్న 10రోజుల రూరల్ సెల్ఫ్ ఉపాధి శిక్షణ కేంద్రాన్ని సందర్శించి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుత పరిస్థితులలో పుట్టగొడుగుల (వీబంప్త్రతీశీశీఎం) తయారీ అవసరాన్ని, తద్వారా ఉపాధి అవకాశాన్ని పొందుటకు కావలసిన మెలకువలను, బడిబాటలో భాగంగా గ్రామంలోని పాఠశాల ఈడు పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలోనే నమోదు చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో అందుతున్న సౌకర్యాలను వివరించిన మోపాల్ మండల విద్యాశాఖ అధికారి అందాపూర్ సాయిల్ , ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. అనంతరం సిర్పూర్ గెజిటెడ్ హెచ్ఎం సత్యనారాయణ శిక్షణ కేంద్రంలో తన సందేశాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో మండల పీఆర్టీయూ అధ్యక్షులు కొట్టూరు దేవదాస్ , రాష్ట్ర పీఆర్టీయూ అసోసియేట్ మహిళా అధ్యక్షులు మాధవి , శిక్షణ సమన్వయకర్త రామకృష్ణ , ఇంస్ట్రక్టర్ బాలస్వామి, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# జోరుగా కొనసాగుతున్న సాగు పనులు



నారాయణపేట, జూన్ 4 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వాన కాలం ప్రారంభం అయిన సందర్భంగా గ్రామాలలో సాగు పనులు జోరుగా కొనసాగుతున్నాయి. రైతులు ట్రాక్టర్లతో, ఎద్దుల గునుకలతో వారివారి పొలాలను సాగు చేస్తున్నారు. బోరు బావులు ఉన్న రైతులు రోహిణి కార్తె లో బోరు బావుల నీటితో పొలాలను దున్ని గునుకలతో పాసి పత్తి విత్తనాలు పెట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి మొలుకలు మొలుకేత్తయి. వర్షం పై ఆధారపడి వట్టి భూములలో రైతులు విత్తనాలు నాటి వర్షం వస్తె మొలుకెట్టుతాయని పత్తి విత్తనాలు పెడుతున్నారు. కొంత మంది రైతులు వర్షాలు రాసుకపోతే పెట్టిన విత్తనాలు మొలుకలు రాకపోతే నష్టపోతమని పూర్తి గా వర్షాలు కురుస్తున్నపుడే విత్తనాలు పెడుదామని వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. బీద రైతులు అప్పులు పుట్టాక, చేతులలో డబ్బులు లేక రైతు భరోసా ఎప్పుడు వేస్తారో అని ఎదురు చూస్తున్నారు. వాన దేవుడు సకాలంలో వర్షించి, ప్రభుత్వం రైతుల భాదలు అర్థం చేసుకొని ఖరీఫ్ రైతు భరోసా రైతుల ఖాతాలో వేసి రైతన్న కు మేలు చేయాలని రైతు శ్రేయోభిలాషులు దేవుణ్ణి, ప్రభుత్వాలను వేడుకుంటున్నారు.

## మహబూబాబాద్ డి.టి.ఓ. బాధవత్ శంకర్ నాయక్ ని సన్మానించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు భూక్యా బాలు నాయక్



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి మే 4 (విజన్ ఆంధ్ర): మహబూబాబాద్ జిల్లా ట్రాన్స్ పోర్ట్ అధికారిగా భాధ్యతలు స్వీకరించిన మన జిల్లా ముద్దు బిడ్డ బాధవత్ శంకర్ నాయక్ ను మహబూబాబాద్ లోని వారి కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ప్రపంచ శాంతి అవార్డు గ్రహీత ప్రముఖ సామాజిక వేత్త భూక్యా బాలు నాయక్ అయన అనుచరులు మర్యాద పూర్వకంగా వారిని వారి కార్యాలయంలోకలిసి పుష్ప గుచ్ఛం అందించి ఘనంగా సన్మానం చేశారు. ఈ యొక్క కార్యక్రమంలో భూక్య బాలు నాయక్ వారిని ఉద్దేశించి గిరిజన జిల్లా అయిన మహబూబాబాద్ జిల్లాలో నిరక్షరాస్యులు అత్యధికంగా ఉండటం వలన చాలామంది వాహన హోదారులకు లైసెన్సులు వల వాహనాలకు ఫిట్నెస్ ల గూర్చి అవగాహన లేనందున గతంలో చాలామంది జరిమానాలు కట్టారని చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అదేవిధంగా 18 సంవత్సరాల లోపు చిన్నపిల్లలు యువత వాహనాలు నడుపుతూ చాలామంది ప్రమాదాలకు గురి అవుతూ మరణిస్తున్నారు అని అన్నారు, వీరి కొరకు ప్రతి మండల కేంద్రంలో సదస్సులో కౌన్సిలింగ్ లు నిర్వహించడంతోపాటు తల్లిదండ్రులకు వారి పిల్లలకు వాహనాలు నడపకుండావారి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించడానికి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తద్వారా ప్రమాదాలకు గురికాకుండా అడ్డుకట్ట వేసి బంగారు భవిష్యత్తుకు పునాదులు వేయటానికి దోహదపడతాయని అన్నారు. నూతనంగా మహబూబాబాద్ జిల్లాకు డి.టి.ఓ.గా మంచి సర్వీస్ అందించి మహబూబాద్ జిల్లాను ఒక ఆదర్శవంతమైన జిల్లాగా తీర్చిదిద్ది రాష్ట్రస్థాయిలో పలు అవార్డులు రివార్డులు పొంది ఉన్నంత శిఖరాలకు చేరాలని భగవంతుడు వారికి మంచి ఆయుష్షుని ఆరోగ్యాన్ని ఇచ్చి వారి కుటుంబ సభ్యులతో పిల్లలతో నిండు నూరేళ్లు సుఖంగా సంతోషంగా ఉండాలని భగవంతుని ప్రార్థించారు ఈ యొక్క కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ గుగులోత్ శంకర్ నాయక్, గుగులోత్ వేణు గోపాల్ నాయక్, వల్లబనేని యాదగిరిరావు, రూపరెడ్డి నవీన్ రెడ్డి, భూక్య భరత్ నాయక్, ఎస్ కే బసీరుద్దీన్, అనుముల సాయి కిరణ్, మూడు సోమాజి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి

**- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



హనుమకొండ జిల్లా ప్రతినిధి జూన్ 04 ( విజన్ ఆంధ్ర ): మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ద్వారా ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా దామెర మండలం ల్యాదేళ్లలోని మహిళా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా సెంటర్ ద్వారా నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాలు, శిక్షణకు సంబంధించిన మెటీరియల్, సెంటర్ లోని వివిధ శిక్షణ విభాగాలను పరిశీలించారు. సౌకర్యాలను పరిశీలించి కేంద్రం గురించిన వివరాలను డిఆర్డిఓ మేన శ్రీను, అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ మహిళలకు ఉపయోగపడే విధంగా వారం రోజుల్లో శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా శిక్షణ కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం మండల సమైక్య కార్యాలయం కోసం శంకుస్థాపన చేసిన భూమి వివరాలను తహసిల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రవి యాదవ్, అడిషనల్ డిఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, ఎంపీడీవో కల్పన, డీపీఎం రాజేంద్రప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బడి బాట సమర్ధవంతంగా నిర్వహించాలి

**- ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలి**

**- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



విజన్ ఆంధ్ర మెదక్ బ్యూరో : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని మీటింగ్ హాల్లో విద్యాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరం మెరుగైన విద్యా ప్రమాణాల లక్ష్యంగా ముందుకు పోతూ బడి బాట సమర్ధవంతంగా నిర్వహించాలని,విద్యార్థుల తక్కువ నమోదు పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థుల నమోదు పెంచుటకై గ్రామంలోని ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేయాలని, కనీస సామర్థ్యాలు అయినటువంటి చదవడం రాయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పాఠశాలల్లో ఏర్పాటు చేసే మౌలిక వసతుల గురించి తల్లిదండ్రులకు వివరించాలని, వీటి ఆధారంగానే పాఠశాలలకు ప్రగతి సూచికలు ఇవ్వబడతాయని ,రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రీ ప్రైమరీ పాఠశాలలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అలాగే ఎఫ్ఆర్ఎస్, ఇతర అంశాలపై దృష్టి పెట్టి సరియగు చర్యలు గైకొనాలని సూచించారు ,జిల్లాలోని భవిత కేంద్రాల బలోపేతానికి కృషి చేయాలని, కొత్త ప్రీ ప్రైమరీ విభాగాలను ప్రారంభించాలని, విద్యార్థుల సంఖ్యలేని పాఠశాలలను తిరిగి ప్రారంభించాలని, పాఠ్యపుస్తకాల పంపిణీ చేయాలని, స్వయం సహాయక బృందాల చేత పిల్లలకు యూనిఫామ్ కుట్టించాలని, నూతన టెక్నాలజీ ఏఐ, డిజిటల్ తరగతులను నిర్వహించాలని, విద్యాశాఖ బలోపేతానికి ప్రత్యేక కార్యచరణ ప్రకారం ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు, చీఫ్ మానిటరింగ్ ఆఫీసర్ రాజు, ఏ ఎం ఓ సుదర్శన మూర్తి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## పంట అవశేషాల కాల్చివేతపై

# సంపూర్ణ నిషేధం

**ఉల్లంఘిస్తే కఠిన చర్యలు - జిల్లా కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్ చాహత్ బాజ్‌పాయ్**



హనుమకొండ జిల్లా ప్రతినిధి , జూన్ 4 (విజన్ ఆంధ్ర ) : పంట అవశేషాలను కాల్చడం వల్ల వాయు కాలుష్యం పెరగడంతో పాటు పర్యావరణ సమతుల్యత దెబ్బతిని, నేల సారవంతత తగ్గిపోవడం, ప్రజారోగ్యం ప్రమాదంలో పడటం వంటి తీవ్ర పరిణామాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో హనుమకొండ జిల్లా వ్యాప్తంగా పంట వ్యర్థాల కాల్చివేతను తక్షణమే నిషేధిస్తూ జిల్లా కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్ శ్రీమతి చాహత్ బాజ్‌పాయ్ ఉత్తర్వులు జారీ చేశారు.వ్యవసాయ పంటల కోత అనంతరం పొలాల్లో మిగిలిపోయే పంట అవశేషాలను తగులబెట్టడం వల్ల హానికర వాయువులు వెలువడి వాతావరణ కాలుష్యం పెరగడమే కాకుండా, ప్రజల ఆరోగ్యం, మానవ జీవనం, రహదారి భద్రత మరియు పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. అంతేకాకుండా భూమిలోని సేంద్రియ పదార్థాలు, ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నశించి భూసారం క్షీణిస్తుందని తెలిపారు. ప్రజా భద్రత, పర్యావరణ పరిరక్షణ, ప్రజా శాంతిభద్రతల దృష్ట్యా భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (దీఘీూ)-2023 సెక్షన్ 163 కింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ జిల్లాలోని అన్ని గ్రామాలు, వ్యవసాయ భూములు, పొలాల్లో పంట అవశేషాల కాల్చివేతను తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు నిషేధిస్తున్నట్లు స్పష్టం చేశారు.ఈ ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై భారతీయ న్యాయ సంహిత (దీఘీ)-2023 సెక్షన్ 223 ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉల్లంఘన వల్ల ప్రజలకు ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు లేదా మానవ ప్రాణాలకు ప్రమాదం కలిగితే జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు.జిల్లాలోని తహశీల్దార్లు, ఎంపీడీఓలు, వ్యవసాయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పోలీస్ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పంట కోతల సమయంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, కాలుష్య నియంత్రణ శాఖలు సమన్వయంతో పనిచేసి ఉత్తర్వులను కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. “పంట అవశేషాలను కాల్చడం అంటే భూమాతను, పర్యావరణాన్ని, మన భవిష్యత్తును కాల్చినట్టే. రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి. ప్రతి గ్రామం కాలుష్య రహితంగా, ప్రతి పొలం సారవంతంగా ఉండేలా అందరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్‌పాయ్ పిలుపునిచ్చారు.

# రేడియాలజిస్ట్ లేక రోగుల అవస్థలు...

## మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కార్పొరేటర్లు

**- ఆస్పత్రిలో పారిశుద్ధ్యం, ఆహారం, తాగునీటి సదుపాయాలపై ఆరా**








కొత్తగూడెం బ్యూరో జూన్ 05(విజన్ ఆంధ్ర) : రామవరం ప్రాంత ప్రజలకు కీలక వైద్య సేవలు అందిస్తున్న మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని 15వ డివిజన్ కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ, 19వ డివిజన్ కార్పొరేటర్ స్వప్న శంకర్ నాయక్ సందర్శించి ఆసుపత్రి నిర్వహణ, రోగులకు అందుతున్న సేవలను సమగ్రంగా పరిశీలించారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్య పరిస్థితులు, పేషెంట్లకు అందిస్తున్న ఆహారం నాణ్యత, తాగునీటి సరఫరా, వైద్య సేవల అందుబాటు తదితర అంశాలపై సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణులు, బాలింతలు, వారి కుటుంబ సభ్యులతో నేరుగా మాట్లాడి వారికి ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఆసుపత్రిలో పూర్తిస్థాయి రేడియాలజిస్ట్ అందుబాటులో లేకపోవడం వల్ల గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రోగులు కార్పొరేటర్ల దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం వారం లో కేవలం రెండు రోజులు మాత్రమే రేడియాలజిస్ట్ సేవలు అందుబాటులో ఉంటున్నాయని, మిగతా రోజులలో స్కానింగ్ పరీక్షల కోసం కొత్తగూడెం వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గర్భధారణ సమయంలో తల్లి, శిశువు ఆరోగ్య పరిస్థితిని అంచనా వేయడానికి స్కానింగ్ పరీక్షలు అత్యంత కీలకమైనవని, అయితే స్థానికంగా ఆ సేవలు అందుబాటులో లేకపోవడం వల్ల గర్భిణులు అదనపు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో కొత్తగూడెం వెళ్లాల్సి రావడం ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు. దీనివల్ల సమయం, డబ్బు వృథా కావడంతో పాటు పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని చెప్పారు. ప్రభుత్వం మాతా-శిశు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో అన్ని వైద్య సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని కార్పొరేటర్లు పేర్కొన్నారు. రేడియాలజిస్ట్ పోస్టును తక్షణమే భర్తీ చేసి ప్రతిరోజూ స్కానింగ్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. అలాగే ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించిన వారు వార్డులు, ప్రసూతి విభాగం, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. రోగులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం ఆసుపత్రి యాజమాన్యం బాధ్యత అని, శుభ్రత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని సూచించారు. రోగులకు అందిస్తున్న ఆహారం నాణ్యతను పరిశీలించి, గర్భిణులు మరియు బాలింతలకు పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో తాగునీటి సరఫరా వ్యవస్థను కూడా పరిశీలించిన కార్పొరేటర్లు, రోగులు మరియు వారి సహాయకులకు నిరంతరంగా స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్య సేవలతో పాటు మౌలిక వసతుల కల్పన కూడా ప్రజారోగ్య పరిరక్షణలో కీలకమని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని, రామవరం మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని కార్పొరేటర్లు ఆకునూరి సుప్రియ, స్వప్న శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. ముఖ్యంగా గర్భిణుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రేడియాలజిస్ట్‌ను శాశ్వతంగా నియమించి స్కానింగ్ సేవలను ప్రతిరోజూ అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ తనిఖీ లో 16 వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షురాలు శాంత దేవి, పురుషోత్తం, అయుబ్, రమేష్ మూడ్, సాయి రాజ్ , పాషా, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లక్ష్యం

**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**




హన్మకొండ జిల్లా ప్రతినిధి : జూన్ 4 ( విజన్ ఆంధ్ర ) : ప్రజల సమస్యలను గ్రామస్థాయిలోనే గుర్తించి వేగంగా పరిష్కరించడం, గ్రామాలను సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడమే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు.గురువారం హనుమకొండ జిల్లా దామెర మండలం ఉరుగొండ గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో కలెక్టర్ పాల్గొని గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు..గ్రామ సభలు ప్రజలకు ప్రభుత్వ పథకాలు, సేవలను చేరవేసే అత్యంత ప్రభావవంతమైన వేదికలని పేర్కొన్నారు. విద్య, వైద్యం, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణ, గ్రామీణాభివృద్ధి, వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా గ్రామాల అభివృద్ధికి బాటలు వేస్తున్నట్లు తెలిపారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు వ్యవసాయ శాఖ సూచనల మేరకు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని, పంట మార్పిడి విధానాలను పాటించాలని సూచించారు. ఎరువులు, పురుగుమందుల వినియోగంపై అవగాహన పెంపొందించుకుని అధిక దిగుబడులు సాధించాలని పేర్కొన్నారు.గ్రామాల్లో సాలిడ్ అండ్ లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రతి ఇంట్లో తడిపొడి చెత్తను వేర్వేరుగా సేకరించే అలవాటు పెంపొందించాలని సూచించారు. పరిశుభ్రమైన గ్రామాలే ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది అని పేర్కొన్నారు.

ఊరుగొండను

ఆదర్శ గ్రామంగా, జాతీయ పంచాయతీ అవార్డులకు అర్హత సాధించే స్థాయికి తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే సీజనల్ వ్యాధుల నివారణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలు, ఇంటింటికీ ఇంకుడు గుంతల నిర్మాణం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అవగాహన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆవిష్కరించారు.ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసి అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామస్థులు పంట పొలాలకు వెళ్లే రహదారులు, అంతర్గత రహదారుల అభివృద్ధి, విద్యుత్ సౌకర్యాల విస్తరణ, తాగునీటి సమస్యల పరిష్కారం వంటి అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు చేపట్టి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.అంతకుముందు దామెర మండలం లిఓగులాపూర్ గ్రామంలోని కంపోస్ట్ షెడ్ లోలి నిర్వహిస్తున్న ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాలను పరిశీలించిన కలెక్టర్, చెత్త నుంచి కంపోస్ట్ ఎరువుల తయారీ ప్రక్రియను మరింత మెరుగుపరచి నాణ్యమైన సేంద్రియ ఎరువులు ఉత్పత్తి చేయాలని అధికారులకు సూచించారు.

అనంతరం

ఉరుగొండలో నిర్వహించిన లిబడిబాట ర్యాలీలోలి కలెక్టర్ పాల్గొని, కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి బడీఈడు పల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెంచాలని, ప్రభుత్వం కల్పిస్తున్న నాణ్యమైన విద్య, డిజిటల్ తరగతులు, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల వంటి సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని గ్రామస్తులు, ఉపాధ్యాయులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు శ్రీనివాస్, శ్రీధర్ రెడ్డి, రవి యాదవ్, డీఆర్డీఓ మేన శ్రీను, డిపిఓ లక్ష్మీ రమాకాంత్, జెడ్పి సీఈఓ శేషాద్రి, డీఈఓ గిరిరాజ్ గౌడ్, అడిషనల్ డిఆర్డీఓ లక్ష్మి ప్రసన్న, మండల స్థాయి వ్యవసాయ, రెవెన్యూ, హౌసింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రత్యేక గ్రామసభల ద్వారా ప్రజా సమస్యలకు పరిష్కారం

**- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**



విజన్ ఆంధ్ర మెదక్ బ్యూరో : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని శంకరంపేట ఆర్ మండలంలోని రుద్రారం గ్రామపంచాయతీలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ హాజరై గ్రామస్థులతో సమావేశమయ్యారు. గ్రామ సర్పంచ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి , హార్టికల్చర్ అధికారి,ఇతర జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ ..రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. మురికి కాలువలను శుభ్రపరచడం, పిచ్చి మొక్కలను తొలగించడం, తాగునీటి వనరులు, వాటర్ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచడం, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామాల్లో పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని నివారించవచ్చని తెలిపారు.ఘన వ్యర్థాల నిర్వహణ రూల్స్2026ను గ్రామపంచాయతీలు తప్పనిసరిగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. తడి, పొడి, శానిటరీ , ప్రత్యేక వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి నిర్వహించాలని సూచించారు. గ్రీన్ బుట్టలో తడి వ్యర్థాలు, బ్లూ బుట్టలో పొడి వ్యర్థాలు, రెడ్ బుట్టలో శానిటరీ వ్యర్థాలు, నల్ల రంగు బుట్టలో ప్రత్యేక వ్యర్థాలను వేరు చేసి గ్రామపంచాయతీకి అందించాలని ప్రజలకు సూచించారు.గ్రామసభలో తాగునీటి నిర్వహణ, వర్షపు నీటి సంరక్షణ, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, విపత్తు నిర్వహణ, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (SIR-2026), పంటల మార్పిడి, బడిబాట కార్యక్రమం, ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియ తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ కోరారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు పంటల మార్పిడిని అలవాటు చేసుకొని ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులను గ్రామసభల ద్వారా గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులకు ఆదేశించారు. గ్రామాభివృద్ధి, ప్రజా భాగస్వామ్యం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో ప్రత్యేక గ్రామసభలను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు.అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేసి, స్వచ్ఛత పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ గ్రామ సభలో గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్ రావు, వ్యవసాయ అధికారి దేవకుమార్ , హార్టికల్చర్ అధికారి ప్రతాప్ సింగ్ ,సర్పంచ్ సంతోష నవీన్ గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేసి, స్వచ్ఛత పోస్టర్లను ఆవిష్కరించారు.

## తాళం వేసిన ఇల్లే దొంగ టార్గెట్

- అంతర్రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసిన పోలీసులు
- అంతరాష్ట్ర దొంగ వికాస్సింగును మీడియా ముందు ప్రవేశం
- దొంగతనాలు చేయమని ప్రోత్సహించిన గోల్డ్ షాప్ ఓనర్లు
- దొంగకు నలుగురు గోల్డ్ షాప్ ఓనర్లు తలా పదివేల చొప్పున నగదు అందజేత
- మీడియాతో వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా





వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 04 ( విజన్ ఆంధ్ర ) : తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి దొంగ తనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగను అరెస్ట్ చేశామని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా అన్నారు. గురువారం జిల్లా ఎస్పీ మీడియా సమావేశం ఏర్పాటు చేసి అంతరాష్ట్ర దొంగ వికాస్ సింగ్ ను మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలను వెల్లడించారు. గత నెల 5న వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మణికంఠ నగర్ లోని ఓ ఇంట్లో చొరబడి ఒకటిన్నర తులాల బంగారం, 2,10, 000ల నగదు దొంగతనం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని ఆమె స్పష్టం చేశారు. దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాల్లో పరిశీలించి చూస్తే కరడు గట్టిన వికాస్ సింగ్ ను గుర్తించి రైల్వే స్టేషన్ లో అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పి వెల్లడించారు. అదుపులోకి తీసుకున్న వికాస్ సింగ్ ను విచారించగా విస్మయానికి గురయ్యే విషయాలు వెలుగులోకి వచ్చాయని ఆమె పేర్కొన్నారు. 16 సంవత్సరాల వయస్సు నుంచే వికాస్ సింగ్ నేర జీవితాన్ని ప్రారంభించాడని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. గతంలో సంగారెడ్డి, బొల్లారం ప్రాంతాల్లో 34 కేసులు నమోదై జైలు శిక్ష అనుభవించాడన్నారు. జైలు నుంచి తిరిగి వచ్చిన వికాస్ మారకపోగా వికారాబాద్ జిల్లా, సైబరాబాద్, మల్కాజిగిరి పరిధిలో రాత్రిపూట మరో 27 దొంగతనాలకు పాల్పడినట్లు జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. దొంగతనం చేసిన బంగారు వెండి ఆభరణాలను ఉత్తర ప్రదేశ్ లోని బంగారం షాపుల యజమానులకు విక్రయించేవాడు అన్నారు. నలుగురు బంగారం షాప్ యజమానులు తలా పదివేల చొప్పున జమ చేసి దొంగ వికాస్ సింగ్ కు అందజేసి దొంగతనాలను ప్రోత్సహించే వారన్నారు. ఉత్తరప్రదేశ్లో దొంగతనాలు చేసే కంటే ఇతర రాష్ట్రాలలో దొంగతనం చేసి మాకు బంగారం వెండి ఆభరణాలు విక్రయించాలని ఆ షాపు యజమానులు దొంగకు సూచించారు. ఒక పిస్టోల్ ను కొనుగోలు చేసేటట్లు బంగారం షాపు యజమానులు దొంగను ప్రోత్సహించారు. బంగారం షాపు యజమానులపై కూడా పీడీ యాక్ట్ కేసు నమోదు చేస్తామని ఆమె హెచ్చరించారు.

# "పిల్లల భద్రతే ప్రథమ ప్రాధాన్యం-సురక్షిత పాఠశాల రవాణా అందరి బాధ్యత"

**- విద్యార్థుల భద్రతకు పాఠశాల బస్సుల ఫిట్‌నెస్,డ్రైవర్ల శిక్షణ అత్యంత కీలకం.**

**- డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్**




ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో, జూన్ 4,(విజన్ ఆంధ్ర) : విద్యార్థుల సురక్షిత రవాణా ప్రతి పాఠశాల యాజమా న్యం,వాహన యజమాని,డ్రైవర్ యొక్క సామాజిక బాధ్యత అని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ తెలిపారు. పాఠశాల బస్సుల ఫిట్‌నెస్, భద్రతా ప్రమాణాల అమలు,డ్రైవర్లకు తగిన శిక్షణ కల్పించడం ద్వారా మాత్రమే విద్యార్థుల ప్రాణ భద్రతను సమర్థవంతంగా కాపాడగలమని పేర్కొన్నారు. చట్టపరమైన నిబంధనలు... మోటారు వాహనాల చట్టం,1988 లోని సెక్షన్ 56 ప్రకారం ప్రతి రవాణా వాహనం చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికేట్‌ను కలిగి ఉండటం తప్పనిసరి.ఫిట్‌నెస్ లేని వాహనాలను రహదారులపై నడపడం చట్టవిరుద్ధం.కేంద్ర మోటారు వాహనాల నియమాలు,1989,పాఠశాల బస్సుల భద్రతకు సంబంధించిన నిబంధనల ప్రకారం పాఠశాల బస్సులు నిర్దేశిత భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలి.

**పాఠశాల బస్సుల్లో ఉండాల్సిన భద్రతా సదుపాయాలు...**

అత్యవసర ద్వారం,అగ్నిమాపక పరికరం,ప్రథమ చికిత్స పెట్టె స్పీడ్ గవర్నర్,జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ,సీసీ కెమెరాలు.తగిన సీటింగ్ సదుపాయం, స్పష్టమైన గుర్తింపు బోర్డులు.వాహనాల బ్రేకులు,టైర్లు, స్టీరింగ్ వ్యవస్థ,ఇతర యాంత్రిక భాగాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి.

**డ్రైవర్ల శిక్షణపై సూచనలు...**

పాఠశాల బస్సులను నడిపే డ్రైవర్లు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు తగిన అనుభవం కలిగి ఉండాలి.రహదారి భద్రత,రక్షణాత్మక డ్రైవింగ్,అత్యవసర పరిస్థితుల నిర్వహణ,విద్యార్థులతో సౌమ్యంగా వ్యవహరించడం, ట్రాఫిక్ నిబంధనల పాటింపు తదితర అంశాలపై వారికి నిరంతర శిక్షణ,అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.పాఠశాల యాజమాన్యాలు తమ వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, పర్మిట్లు,బీమా పత్రాలు,డ్రైవర్ల లైసెన్సులు,ఇతర చట్టబద్ధమైన పత్రాలను ఎప్పటికప్పుడు పరిశీలించి,నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలి. విద్యార్థుల రవాణాలో భద్రత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం సహించబడదని స్పష్టం చేశారు.రవాణా శాఖ ప్రత్యేక తనిఖీలు నిర్వహించి,నిబంధనలను ఉల్లంఘించే వాహన యజమానులు,నిర్వాహకులపై మోటారు వాహనాల చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకుంటుంది.

# మొక్కలను పెంచుదాం.... పచ్చదనం దిశగా ప్రయాణం చేద్దాం....

**- ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించండి పర్యావరణాన్ని కాపాడుదాం... అనే పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న సెట్విన్ గవర్నమెంట్ స్టేట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అమీనా భాను**




సిద్దిపేటజిల్లా ప్రతినిధి జూన్ 4 : సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సెట్విన్ కార్యాలయంలో మై భారత్ మీరా యువభారత్ మరియు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించండి- పర్యావరణాన్ని కాపాడుదాం అను పోస్టర్ ను ప్రపంచ పర్యావరణ దినోత్సవం జూన్ 5న పురస్కరించుకొని సెట్విన్ గవర్నమెంట్ స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ అమీనాభాను సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సామాజికవేత్త వలస సుభాష్ ఇద్దరి చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది ఈ సందర్భంగా అమీనా భాను మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించండి అని ఆమె అన్నారు చెట్లను విరివిగా పెంచాలి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి ఆమె అన్నారు ఒక మొక్క నాటండి భూమిని కాపాడండి పచ్చదనం పెంచుదాం కాలుష్యాన్ని తగ్గిద్దాం అని వారు పేర్కొన్నారు పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఆమె పిలుపునిచ్చారు పర్యావరణహిత ఉత్పత్తులను ఉపయోగించండని ఆమె అన్నారు పర్యావరణాన్ని కాపాడుదాం భవిష్యత్తును రక్షిద్దామని ఆమె పేర్కొన్నారు పర్యావరణ కోసం ఎంతగానో కృషి చేస్తున్న వలస సుభాష్ గారిని ప్రత్యేకంగా అభినందించారు ఈ సందర్భంగా సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వలస సుభాష్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా యావత్ తెలంగాణ ప్రజానీకానికి ప్రపంచ పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలు ఆయన తెలియజేశారు ఇంటికో చెట్టు ఊరంతా వనం అనే నినాదంతో ముందుకు పోదామని ఇంటి వద్ద మొక్కలను పెంచాలని పచ్చదనం దిశగా ప్రయాణం చేద్దాం అని విద్యార్థులకు ప్రజలకు పిలిపించారు ప్రకృతిని ప్రేమించండి పర్యావరణ రక్షించండి పర్యావరణహితం మన అభిమతం కావాలి ఆయన కోరారు ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలని ఆయన వేడుకున్నారు సమాజమంతా పర్యావరణం కోసం ఆలోచించాలని కోరారు మన ఇంటి వద్ద ఎన్ని ముక్కలు పెట్టాం నీటిని పోస్తున్నామా అని ఆలోచన చేయాలని ఆయన కోరారు పర్యావరణాన్ని సంరక్షించుకుంటే ఆరోగ్యం అంతమైన సమాజ నిర్మాణం అవుతుందని అటువైపు ప్రజలు ఆలోచించాలని ఆయన కోరారు మొక్కలు నాటండి ప్రతి జీవికి స్వచ్ఛమైన గాలిని అందించండి అని వారి కోరారు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ఆయన కోరారు అందరం కూడా పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేద్దామని ప్రతిమ బునాదు ఈ పుడమి మీద ఉన్న జీవరాశులు వృక్ష సంపద కాపాడవలసిన బాధ్యత అందరిపై ఉందని ఆయన అన్నారు కాలుష్యాన్ని తగ్గిద్దాం మొక్కలను పెంచుదాం అనే నినాదంతో ముందుకు సాగుదామని ఆయనే ప్రజల్ని వేడుకున్నారు మొక్కలు నాటుదాం భావితరాలకు భవిష్యత్తును ఇద్దాం వారు అన్నారు పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత గుర్తించాలని పేర్కొన్నారు మొక్కలు పెంచితేనే మానవ మునగడ ఆయన కోరారు పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వామ్యం కావాలని అన్నారు జీవరాసులను కాపాడవలసిన బాధ్యత అందరి పైన ఉందని ఆయన గుర్తు చేశారు అడవి సంపదను కాపాడాలనఇంటివద్ద చెట్టును పెంచండి అని ప్రజలకు విద్యార్థులకు వృక్షో రక్షితి రక్షిత అని పిలుపునిచ్చారు పర్యావరణ దిక్సూచి సహజమైన అడవి సంపదని ఆయన అన్నారు వేసవి తాపం నుంచి పశు వ క్షాద ం ల ను కా పా డా ల ని వ ర్యా వ ర ణ ం లో లి జరుగుతున్నటువంటి వాతావరణ మార్పులకు కారణమైన మానవుడు మళ్లీ పర్యావరణ పరిరక్షణ కోసం ఆలోచించి ప్రకృతిలో మానవుడు చేస్తున్న వికృతిని ఆపాలని ఆయనే పేర్కొన్నారు పర్యావరణ పరిరక్షణకోసంమనమంతాఆలోచించాలని ఆయన వేడుకున్నారు ఇలాంటి పర్యావరణ మహా ఉద్యమంలో విద్యార్థులు యువత సమాజం కలిసి రావాలని సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సామాజిక వేత్త వలస సుభాష్ కోరారు ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా యువజన సంఘాల అధ్యక్షులు అధికం రాజ గౌడ్ సెట్విన్ సిబ్బంది శ్రీనివాస్ కుమార్ శిక్షణ పొందుతున్న యువతులు తదితరులు పాల్గొన్నారు

# గ్యాస్ట్రోఎంటరాలజీ & హెపటాలజీ విభాగం జీర్ణవ్యవస్థ మరియు కాలేయ వ్యాధుల చికిత్సలో నూతన ప్రమాణాలు




హన్మకొండ జిల్లా ప్రతినిధి జూన్ 04 ( విజన్ ఆంధ్ర ) : డాక్టర్ విశ్వంత్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ యశోద ఆస్పత్రుల్లో గ్యాస్ట్రోఎంటరాలజీ & హెపటాలజీ బృందం జీర్ణవ్యవస్థ, కాలేయం, ప్యాంక్రియాస్ మరియు పిత్తనాళాలకు సంబంధించిన వ్యాధుల నిర్ధారణ, చికిత్సలో అత్యాధునిక సేవలను అందిస్తోంది. ఎండోస్కోపీ, ఎండోస్కోపిక్ అల్ట్రాసౌండ్ ( ఈ యు ఎస్ ), ఈ ఆర్ సి పి వంటి సాంకేతికతలతో పాటు థర్డ్-స్పేస్ ఎండోస్కోపీలో కూడా విశేష నైపుణ్యాన్ని కలిగి ఉన్నాయని తెలిపారు. ప్రారంభ దశలో గుర్తించిన జీర్ణాశయ క్యాన్సర్లు మరియు ప్రీ-క్యాన్సర్ గడ్డలను శస్త్రచికిత్స అవసరం లేకుండా ఎండోస్కోపిక్ సబ్‌మ్యూకోసల్ డిసెక్షన్ ( ఈ ఎస్ డి ) ద్వారా తొలగించే సేవలు అందుబాటులో ఉన్నాయి. అకలేసియా వంటి మింగుడుకు సంబంధించిన వ్యాధులకు పెరొరల్ ఎండోస్కోపిక్ మయోటమీ ( పి ఓ ఈ ఎం ), జి ఈ ఆర్ డి చికిత్సకు ఆంటీ-రిఫ్లక్స్ మ్యూకోసెక్టమీ ( ఏ ఆర్ ఎం ఏ ) వంటి అధునాతన ఎండోస్కోపిక్ విధానాలు విజయవంతంగా నిర్వహించబడుతున్నాయి.సాధారణ ఎండోస్కోపీతో చేరుకోలేని చిన్న పేగు వ్యాధుల నిర్ధారణ కోసం క్యాప్సూల్ ఎండోస్కోపీ, అలాగే చిన్న పేగులో రక్తస్రావం, పాలిప్స్ మరియు ఇతర సంక్లిష్ట వ్యాధుల నిర్ధారణ, చికిత్స కోసం బెలూన్ ఎంటెరోస్కోపీ సేవలు అందుబాటులో ఉన్నాయి.కాలేయ వైఫల్యం (లివర్ ఫెయిల్యూర్ ) వంటి ప్రాణాపాయ పరిస్థితుల నిర్వహణలో ప్లాస్మా ఎక్స్ఛేంజ్ (ప్లెక్స్ ) మరియు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి ప్రాణరక్షక చికిత్సలను అందిస్తూ అనేకమంది రోగులకు కొత్త జీవితం ప్రసాదిస్తున్నాము. పునరావృతమయ్యే మరియు మందులకు లొంగని క్లోస్ట్రిడియోయిడ్స్ డిఫిసైల్ (క్లోస్ట్రిడియోడ్స్ డిఫసిలే ) ఇన్ఫెక్షన్ చికిత్స కోసం ఫీకల్ మైక్రోబయోటా ట్రాన్స్‌ప్లాంటేషన్ ( ఎఫ్ ఎం టి ) వంటి అత్యాధునిక చికిత్సా విధానాలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఫ్యాటీ లివర్, సిరోసిస్, ఇన్‌ఫ్లమేటరీ బవెల్ డిసీజ్ ( ఐ బి డి ), జీర్ణాశయ రక్తస్రావం, ప్యాంక్రియాటిక్ మరియు బిలియరీ వ్యాధుల నిర్వహణలో మా బృందం విశేష అనుభవాన్ని కలిగి ఉంది. అత్యాధునిక సాంకేతికత, నిపుణులైన వైద్యులు, బహుళ విభాగాల సమన్వయం మరియు రోగి-కేంద్రీకృత సేవలతో యశోద గ్యాస్ట్రోఎంటరాలజీ & హెపటాలజీ విభాగం ప్రపంచ స్థాయి వైద్యసేవలను అందిస్తోంది.

# నీటి ఎద్దడిని నివారిస్తాం

**- వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రత్యేక కార్యాచరణ**

**- తాగునీటిని కాచి వడబోసి తాగాలని అవగాహన**

**- పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు పూర్తి చేస్తాం**

**- ఇండ్ల పరిసరాలను పరిశుభ్రం చేయిస్తాం**

**- ఎర్రవల్లి గ్రామ సర్పంచ్ సయ్యద్ రబ్బాని**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 04 ( విజన్ ఆంధ్ర ) : గ్రామ అభివృద్ధి లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తామని ఎర్రవల్లి గ్రామ సర్పంచ్ సయ్యద్ రబ్బాని అన్నారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గురువారం వికారాబాద్ మండల పరిధిలోగల ఎర్రవల్లి గ్రామంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సర్పంచ్ సయ్యద్ రబ్బాని విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి మాచన్నగారి గైబులు ముదిరాజ్ తో మాట్లాడారు. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. గ్రామంలో ఏ వార్డులో అయితే నీటి సమస్య ఉంటుందో గుర్తించి ఆ వార్డుకు ట్యాకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోవు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో తాగు నీటిని కాచి వడగట్టి తాగాలని ప్రజలకు అవగాహన కల్పిస్తామని ఆయన తెలిపారు. అంటు వ్యాధులు వ్యాపించకుండా గ్రామంలోని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఓపెన్ సైడ్ డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తామని ఆయన పేర్కొన్నారు. ఇండ్ల మధ్య పిచ్చి మొక్కలు పెరగకుండా చెత్తాచెదారం లేకుండా చూడాల్సిన ఆవశ్యకత ఉంటుందని ఆయన గుర్తు చేశారు. రైతుల గుర్తింపు కార్డు కొరకు గ్రామంలోనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయిస్తామని ఆయన చెప్పారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్డు లోనే ఒక రైతుకు సంబంధించిన అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. 2026 ఫిబ్రవరి మాసాంతం వరకు కొత్తగా పాస్ పుస్తకాలు వచ్చిన రైతులు కూడా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ పొడిగింపు కాలం వ్యవసాయ అధికారులచే ఆదేశం వచ్చిన వెంటనే మిగిలిన రైతులది కూడా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రామేశ్వర్, పులుమద్ది పెంటయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు మంగలి తులసిదాస్, పంచాయతీ సెక్రెటరీ భూతరాజు కృష్ణ, వార్డు మెంబర్లు, చిట్లపల్లి బందయ్య, ఐల సూరి, తాహెర్, చిట్లపల్లి శ్రీనివాస్, గాలి రాజు, కొంపల్లి హనుమంతు, శివకుమార్, పిట్టల రవి, శ్రీశైలం, సత్యనారాయణ రెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు, తరలింపులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలి

***జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అపరెల్ పార్క్, గోదాముల్లో హమాలీల సంఖ్య పెంచాలని ఆదేశం***



రాజన్న సిరిసిల్ల, జూన్ 4 (విజన్ ఆంధ్ర బ్యూరో): జిల్లాలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేసి, కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో తరలించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గురువారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి పౌర సరఫరాల శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, సహకార శాఖ, మెప్మా, రవాణా శాఖ, వ్యవసాయ శాఖ తదితర శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ధాన్యం కొనుగోళ్ల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, అందుబాటులో ఉన్న హమాలీల సంఖ్య, గన్ని సంచుల నిల్వలు, కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ఇప్పటివరకు మూసివేసిన కేంద్రాల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ధాన్యం నిల్వలు అధికంగా ఉన్న అపరెల్ పార్క్‌లు, గోదాముల్లో అవసరానికి అనుగుణంగా హమాలీల సంఖ్యను పెంచాలని అధికారులను ఆదేశించారు. కొనుగోళ్ల ప్రక్రియ తుది దశకు చేరుకున్న కేంద్రాల నుంచి హమాలీలు, రవాణా వాహనాలను అవసరమైన ఇతర కేంద్రాలకు మళ్లించాలని సూచించారు. అలాగే ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు ధాన్యం పరిమాణానికి అనుగుణంగా తగిన సంఖ్యలో వాహనాలను సమకూర్చాలని ఆదేశించారు. కొనుగోలు, తరలింపు, అన్‌లోడింగ్ ప్రక్రియలు ప్రణాళికాబద్ధంగా, ఎలాంటి జాప్యం లేకుండా కొనసాగాలని, అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సకాలంలో సేవలు అందించడమే లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.

# గ్రామ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తాం

**- పాతూరు గ్రామంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహణ**

**- ప్రత్యేక కార్యాచరణతో గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి**

**- వేసవికాలంలో ఉపాధి హామీ కల్పనతో ఆర్థికంగా అండ**

**- ఎఫ్ఐఆర్ పై ప్రత్యేక అవగాహన**

**- పాతూరు గ్రామ సర్పంచ్ దొడ్ల సంపత్ రెడ్డి**

**- ఎంపిడిఓ డాక్టర్ కేశబోయిన వినయ్ కుమార్**




వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 04 ( విజన్ ఆంధ్ర ) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని ఎంపిడిఓ డాక్టర్ కేశబోయిన వినయ్ కుమార్ అన్నారు. వేసవి కాలంలో రైతులకు ఉపాధి హామీ కల్పనతో ఆర్థికంగా అండగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. గురువారం వికారాబాద్ మండల పరిధిలోగల పాతూరు గ్రామంలో గ్రామ సర్పంచ్ దొడ్ల సంపత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి మాచన్నగారి గైబులు ముదిరాజ్ తో మాట్లాడారు. వేసవి కాలంలో వ్యవసాయ పనులు ఉండవని ఆయన పేర్కొన్నారు. రైతులు ఆర్థికంగా నష్టపోరాదనే ఉద్దేశ్యముతో ఉపాధి హామీ కల్పనతో ఆర్థికంగా అండగా ఉంటుందనడంలో అతిశయోక్తి లేదని ఆయన తెలిపారు. ఉపాధి హామీ కూలీలకు ప్రతి వారం కూలి డబ్బులు వారి బ్యాంకు అకౌంట్లో జమ అవుతున్నాయని ఆయన అన్నారు. ఎస్ ఐ ఆర్ ( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ) కార్యక్రమాన్ని ప్రజలకు అవగాహన కల్పించామని ఆయన చెప్పారు. మద్యానికి బానిసై బతుకులు బుగ్గిపాలు చేసుకోరాదని గ్రామ సర్పంచ్ హితవు పలికారు. మద్య నిషేధముపై గ్రామ ప్రజలందరము కలిసి ఒక అవగాహనతో ముందుకు వెళ్దామని ఆయన సూచించారు. రాబోవు వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకొని అంటు వ్యాధులు వ్యాపించకుండా ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు నిరంతరం పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. గ్రామ ప్రజలకు ఏ సమస్య వచ్చిన వెంటనే నా దృష్టికి తీసుకొని రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, టెక్నికల్ అసిస్టెంట్ కే రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ గోవిందు, వార్డు మెంబర్లు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్, నంబర్ ప్లేట్ ఉల్లంఘనలపై పోలీసుల ప్రత్యేక తనిఖీలు

**- 55 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు..**

**- 24 వాహనాల్లో నంబర్ ప్లేట్ అక్రమాలు గుర్తింపు**



రాజన్న సిరిసిల్ల, జూన్ 4 (విజన్ ఆంధ్ర బ్యూరో): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనల అమలులో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్, నంబర్ ప్లేట్ ఉల్లంఘనలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. బుధవారం రాత్రి వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ పరిధుల్లో చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో పలువురు నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఎస్పీ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం, వాహనాలకు నంబర్ ప్లేట్లు తొలగించడం, నంబర్లు కనిపించకుండా మార్ఫింగ్ చేయడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ప్రతి రోజు వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన 55 మంది వాహనదారులపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే నంబర్ ప్లేట్లు తొలగించిన, నంబర్లు స్పష్టంగా కనిపించకుండా మార్చిన 24 వాహనాలను గుర్తించి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రతి వాహనదారుడు తన వాహనానికి నంబర్ ప్లేట్‌ను స్పష్టంగా కనిపించే విధంగా ఏర్పాటు చేయాలని సూచించారు. సరైన నంబర్ ప్లేట్లు ఉండటం వల్ల దొంగిలించబడిన వాహనాలను గుర్తించడం, నేరాలకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం సులభమవుతుందని తెలిపారు. నంబర్ ప్లేట్ లేకుండా, నంబర్లు కనిపించకుండా అడ్డంకులు ఏర్పాటు చేసి లేదా నంబర్లను పాక్షికంగా తొలగించి వాహనాలు నడిపే వారిపై చీటింగ్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించి తమ ప్రాణాలతో పాటు ఇతరుల భద్రతను కూడా కాపాడాలని జిల్లా ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

# తల్లితండ్రులు బాధితులను విస్మరిస్తే పిల్లలు వ్యసనాలకు బానిసలు అవుతారు


***బేతాళ పాడు సర్పంచ్ గూగుల్ సునీత మహేష్.***



జూలూరుపాడు జూన్ 5 విజన్ ఆంధ్ర జూలూరుపాడు మండలం బేతాళపాడు గ్రామపంచాయతీ ఆవరణంలో ప్రభుత్వ అధికారులు నడుమ సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు .పర్యావరణ పరిరక్షణ సైబర్ నేరాలపై అవగాహన గ్రామసభ పాల్గొన్న వివిధ అధికార యంత్రాంగం. గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ సునీత గ్రామ ప్రజలను ఉద్దేశించి పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత దీనికోసం ప్రభుత్వ అధికారులకు సహకరించాలి ప్రభుత్వ పథకాలపై ఒంటరి మహిళలు వితంతువులు వృద్ధాప్య పించన్లపై నిరంతర ప్రక్రియ జరుగుతుందని ఎవరికి ఏ రకమైన ఇబ్బంది కలిగి ఉంటే తక్షణమే గ్రామపంచాయతీ ఆఫీసు వద్దకు వచ్చి తమ ఫిర్యాదులను లిఖితపూర్వకంగా సమర్పించాలని కోరారు తల్లిదండ్రులు పిల్లల పట్ల బాధ్యతలను విస్మరిస్తే పిల్లలు ప్రమాదకరమైన వ్యసనాలకు బానిసలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని సర్పంచ్ సున్నిత తమ ఆవేదన వ్యక్తం చేశారు. మనబడి మన గ్రామం అనే నినాదంతో ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించి ఆర్థికంగా బలపడాలని మంచి నైపుణ్యత ఉచిత భోజనం పథకాలు ఉచిత పుస్తక పంపిణీ పలు రకాల ఉన్నత చదువుల పట్ల విద్యార్థులకు నైపుణ్యతతో కూడిన ఉపాధ్యాయులను నియమిస్తున్న ప్రభుత్వ పాఠశాలలకు తమ పిల్లలను చేర్పించి ప్రభుత్వానికి సహకరించాలని ప్రభుత్వ మండలం విద్యాధికారి బి జూంకి లాల్ ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో విషజ్వరాలు ప్రబిలే అవకాశాలు వున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇంట్లో వాడి పడేసిన వ్యర్థ పదార్థాలను ఇంటి చుట్టుపక్కల ఉన్న నీటి గుంటలను చెత్తాచెదారాన్నీ సేకరించి పంచాయతీ పారిశుద్ధ కార్మికులకు సమాచారం ఇచ్చి ప్రజల ఆరోగ్య పరిస్థితులపై అవగాహన కలిగి ఉండాలి అని ఎంపీడీవో తాళ్లూరు రవి సూచించారు. తల్లిదండ్రులుగా మన పిల్లలను పెంచే విధానంలో బాధిత సక్రమంగా నిర్వహించకపోతే సైబర్ నేరగల వలలో పడి లోన్ వ్యాపు మోజులో యువత జీవితాలను సగంలోనే కోల్పోతున్నారు. రోడ్డు భద్రత పై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలి, గంజాయి లాంటి మాదిగ ద్రవ్యా వ్యసనాలకు బానిసలైవారి జీవితాలనువారే చేజేతులారా చిదిమేసుకుంటున్నారు. లోను యాప్ ల కు యువత ఆకర్షితులై తిరిగి చెల్లించే క్రమంలో ప్రాణాలు కోల్పోయిన వారు ఎందరో ఉన్నారు అని ఎస్సై మనీషా కొన్ని చెడు వ్యసనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి రమేష్ గ్రామపంచాయతీ పాలకవర్గం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, ఆరోగ్య ఉపకేంద్ర ఉద్యోగులు అంగన్వాడి ఆశ వర్కర్లు పంచాయతీ పారిశుద్ధ కార్మికులు వివిధ రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాల పై ఇందిరమ్మ ఇండ్లు పరదర్శికంగా జరిపించాలి అని వితంతు పెన్షన్ ల సమస్య కోసం వచ్చిన బాధిత లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**




నిర్మల్ జిల్లా,జూన్ 04,(విజన్ ఆంధ్ర); జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో మిగిలి ఉన్న వరి ధాన్యం సేకరణ ప్రక్రియను జాప్యం లేకుండా వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరి ధాన్యం కొనుగోలు అంశంపై సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇప్పటివరకు జరిగిన ధాన్యం కొనుగోలు పురోగతి, మిగిలి ఉన్న ధాన్యం నిల్వలు, కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. తక్కువ పరిమాణంలో ధాన్యం మిగిలి ఉన్న కొనుగోలు కేంద్రాల్లో సేకరణను వేగవంతం చేసి, కొనుగోలు ప్రక్రియను పూర్తికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఇప్పటికే కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల్లో అందుబాటులో ఉన్న లారీలు, హమాలీలను ధాన్యం నిల్వలు అధికంగా ఉన్న ఇతర కేంద్రాలకు తరలించి వినియోగించుకోవాలని సూచించారు. ధాన్యం సేకరణ, లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియలో ఎటువంటి అంతరాయం కలగకుండా అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, డిఆర్డిఓ విజయలక్ష్మి, డీఎం మార్క్‌ఫెడ్ మహేష్, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మధ్యకు... ప్రజల కోసం... వనమా రాఘవ



పాల్వంచ ప్రతినిధి జూన్ 4( విజన్ ఆంధ్ర) : రైతులు, కూలీలు, యువత, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి ఎండలతో, అకాల వర్షాలతో నష్టపోయిన రైతుల కుటుంబాలకు ధైర్యం చెప్పడానికి ఉపాధి, అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవడానికి వనమా రాఘవ త్వరలో మీ గ్రామాలకు వస్తున్నారు. 40 సంవత్సరాల ప్రజా సేవా ప్రస్థానంలో వనమా కుటుంబం ప్రజలతో ఏర్పరచుకున్న ఆత్మీయ అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తూ, ప్రతి ఇంటి సమస్యను వినేందుకు, ప్రతి కుటుంబానికి అండగా నిలవాలనే సంకల్పంతో ఈ పర్యటన కొనసాగనుంది. ఆత్మీయ పలకరింపు.. ప్రతి గ్రామంలో ప్రజలతో ముఖాముఖి ప్రజల సమస్యలపై చర్చ ప్రజలకు భరోసా "ప్రజల కష్టాల్లో మీతోనే ఉంటాను" అనే సందేశంతో త్వరలో మీ గ్రామానికి వస్తున్నారు.

# పద్య గానంతో మెప్పించిన డా. బొడ్డోజు మల్లయాచారి



విజన్ ఆంధ్ర(04)హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్క రించుకుని, రవీంద్ర భారతిలో తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వీయ పద్య గాన కార్యక్రమంలో ప్రముఖ కవి, సాహితీవేత్త డా.బొడ్డోజు మల్లయాచారి తన ప్రతిభతో సభికులను ఆకట్టుకున్నారు, నల్లగొండ జిల్లా చందూరు మండలం కొండాపురం గ్రామానికి చెందిన డా. మల్లయాచారి తెలంగాణ చరిత్ర, సాహిత్య వారసత్వం, సంస్కృతి, భాషా వైభవాన్ని ప్రతిబింబించే పద్యాలను ఆలపించి, విశేష ప్రశంసలు అందుకున్నారు, ఆయన పద్యగానం సభలోని సాహిత్యా భిమానులను అలరించింది, ఈసందర్భంగా ఆయన సాహిత్య సేవలను గుర్తిస్తూ సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.నామోజు బాలాచారి ఘనంగా సత్కరించారు, సత్కారం అనంతరం డా. మల్లయాచారి మాట్లాడుతూ తెలంగాణ సాహిత్య అకాడమీ వేదికపై తన పద్యాలను వినిపించి గౌరవం పొందడం ఆనంద దాయకమని, ఈగుర్తింపు తనలో మరింత సాహిత్య సృజనకు ప్రేరణనిస్తుందని పేర్కొన్నారు, డా. మల్లయాచారికి లభించిన ఈ గౌరవంపై సాహిత్యా భిమానులు, కవులు, విద్యా వేత్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు, ఈకార్యక్రమం తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే వేదికగా నిలిచింది

# పట్టణ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి


**- జిల్లా కలెక్టర్ కె.హరిత**




అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 4, విజన్ ఆంధ్ర : జిల్లాలోని కాగజ్ నగర్ పురపాలికను పరిశుభ్రంగా ఉంచేలా మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌక్ తీరం రాజ్ టాకీస్ చౌరస్తా వరకు గల రహదారిని మున్సిపల్ అధికారులు, స్థానిక వార్డు కౌన్సిలర్లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని తెలిపారు. మున్సిపల్ అధికారులు ప్రతిరోజు మురుగు కాలువలు శుభ్రపరచాలని, ప్రతి రోజు తడి, పొడి చెత్తను సేకరించాలని తెలిపారు. పట్టణంలోని గురుకృప టిఫిన్ సెంటర్ నిర్వాహకులు నీటిని, వినియోగించిన ప్లేట్లను రోడ్డుపై పడవేసినందుకు టిఫిన్ సెంటర్ యజమానికి జరిమానా విధించాలని మున్సిపల్ కమిషనర్ తిరుపతిని ఆదేశించారు. దుకాణాల యజమానులు ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ బాటిల్లను రోడ్డుపై పడవేయకుండా చెత్త కుండీలో వేయాలని, పట్టణాన్ని శుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి భవనాన్ని త్వరగా పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 4 విజన్ ఆంధ్ర : జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న జిల్లా మహిళా సమాఖ్య ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ లో 6 కోట్ల రూపాయల అంచనాలతో నిర్మిస్తున్న జిల్లా మహిళా సమాఖ్య ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను జిల్లా



గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్ ధర్మేందర్ లతో కలిసి సందర్శించి పనుల వివరాలను ఇంజనీరింగ్ అధికారులు, గుత్తేదారును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 6 కోట్ల రూపాయల అంచనాలతో నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవనం నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి త్వరలో ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని తెలిపారు. భవనానికి రంగు, విద్యుత్ సంబంధించిన పనులు, కిటికీలు, దర్వాజాలు బిగించే పనులను వేగవంతం చేయాలని గుత్తేదారును ఆదేశించారు. భవన నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు, భవన నిర్మాణం గుత్తేదారు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయానికి అంతర్జాతీయ గౌరవం

**రాష్ట్రానికి "ఫుడ్ ప్లానెట్ ప్రైజ్2026" వరించడం అభినందనీయం : డిపిఎం**



కడప,జూన్ 4: (విజన్ ఆంధ్ర) ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) కార్యక్రమానికి ప్రతిష్టాత్మక అంతర్జాతీయ "ఫుడ్ ప్లానెట్ ప్రైజ్2026" పురస్కారం లభించడం పట్ల వైఎస్ఆర్ కడప జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్.వి. ప్రవీణ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుస్థిర ఆహార వ్యవస్థల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన భూగోళాన్ని అందించాలనే లక్ష్యంతో స్వీడన్‌కు చెందిన కర్ట్ బర్గ్‌ఫోర్స్ ఫౌండేషన్ అందజేసే ఫుడ్ ప్లానెట్ ప్రైజ్ ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మక పర్యావరణ పురస్కారాలలో ఒకటని ఆయన తెలిపారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రజా ఉద్యమంగా మలిచిన రైతులు, మహిళా రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు, గ్రామస్థాయి నాయకత్వం కృషికి ఈ అవార్డు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్ సాధించిన విజయాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించడం రాష్ట్రానికే కాకుండా దేశానికీ గర్వకారణమన్నారు. ప్రకృతి వ్యవసాయ విస్తరణకు నిరంతరం ప్రోత్సాహం అందిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్, రైతు సాధికార సంస్థ (RySS) గౌరవ కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు టి. విజయ్ కుమార్‌లకు ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. వైఎస్ఆర్ కడప జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని విజయవంతంగా ఆచరిస్తూ నేల ఆరోగ్య పరిరక్షణ, రైతు ఆదాయ వృద్ధి, పర్యావరణ సంరక్షణకు కృషి చేస్తున్న మహిళా రైతులు, రైతు మిత్రులు, మాస్టర్ ట్రైనర్లు, సిబ్బంది, అధికారులందరికీ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఆహార ఉత్పత్తులు సాధ్యమవు తున్నాయని, నేల సారవంతత పెరగడంతో పాటు వాతావరణ మార్పుల ప్రభావాలను ఎదుర్కొనే సామర్థ్యం రైతులకు పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ అంతర్జాతీయ పురస్కారం సుస్థిర వ్యవసాయం, రైతు సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ పట్ల ఆంధ్రప్రదేశ్ నిబద్ధతకు ప్రపంచం ఇచ్చిన గొప్ప గుర్తింపని ఎస్.వి. ప్రవీణ్ కుమార్ అన్నారు.

# భావి తరాలకు నష్టం వాటిల్లకుండా బాధ్యతగా వ్యవహరించాలి

**- గ్రామ సభలో కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు**

**- పాల్గొన్న పోలీస్ కమిషనర్ సాయి చైతన్య**



నిజామాబాద్, జూన్ 04 :( విజన్ ఆంధ్ర) మన భావి తరాలకు నష్టం జరుగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు పలికారు. సమాజం కోసం మనం ఏం చేస్తున్నాం అన్నది ప్రతి ఒక్కరు గుర్తెరిగి బాధ్యతతో మెలగాలని సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో గురువారం గ్రామ, వార్డు సభలకు శ్రీకారం చుట్టారు. మోపాల్ మండలం న్యాల్ కల్ లో గ్రామ సచివాలయం ప్రాంగణంలో సర్పంచ్ చంద్రకళ అధ్యక్షతన జరిగిన గ్రామ సభకు కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి సంబంధిత శాఖల అధికారులు గ్రామస్థులకు వివరించడంతో పాటు, ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియకు సహకరించడం, పంటల మార్పిడి, పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించాల్సిన ఆవశ్యకత, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండడం, వర్షపు నీటిని ఒడిసిపట్టడం, భూగర్భజలాల పెంపుదల, తడి-పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, ఘన వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావంతో ఈసారి వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ సూచనలు చేసినందున, తదనుగుణంగా అనుకూలమైన పంటలను ఎంచుకోవాలని రైతులకు హితవు పలికారు. పంట మార్పిడి విధానాలను అవలంభించాలని, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలను పాటిస్తూ నాణ్యమైన ఎరువులు, విత్తనాలను వినియోగించాలని సూచించారు. ఎక్కడైనా నాసిరకం, నకిలీ ఎరువులు, విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అలాంటి డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. తనిఖీల కోసం పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామని అన్నారు. కాగా, మోతాదుకు మించి ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడవద్దని, పర్యావరణానికి హాని చేకూర్చే విధంగా వరి కొయ్యలకు నిప్పు పెట్టవద్దని రైతులకు సూచించారు. దీనివల్ల కాలుష్యం వ్యాపిస్తూ భావి తరాలకు కూడా నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా చేయడం చట్టరీత్యా నేరమని, బాధ్యులకు రూ. 5వేలు మొదలుకుని రూ. 25వేల వరకు జరిమానా విధించే అవకాశాలు ఉంటాయని సూచించారు. పర్యావరణ సమతుల్యత, పచ్చదనాన్ని పెంపొందించేందుకు గాను విరివిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పారదర్శకమైన ఓటరు జాబితా కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియకు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఇంటికి వచ్చే బీ.ఎల్.ఓలకు తగిన వివరాలు అందించాలని సూచించారు. చెరువుల శిఖం భూములు ఆక్రమణకు గురి కాకుండా చూడాలని, కబ్జాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. పన్నులను సకాలంలో చెల్లిస్తూ, గ్రామాల అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేయాలని హితవు పలికారు. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని గుర్తు చేశారు. శాంతియుత వాతావరణం నెలకొని ఉన్న ప్రాంతాలు సత్వర అభివృద్ధి సాధిస్తాయని అన్నారు. నేరాల నియంత్రణకు ఉపకరిస్తూ, నేరాలు జరిగిన సందర్భాలలో నిందితుల ఆచూకి తెలుసుకునేందుకు ఉపకరించే సీ.సీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మత్తు పదార్థాలు, దురలవాట్లకు యువత దూరంగా ఉండాలని హితవు పలికారు. రోడ్ సేఫ్టీ కమిటీని ఏర్పాటు చేసుకుని రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం కృషి చేయాలన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, ప్రజలకు భద్రతా కల్పించడానికి పోలీసు శాఖ ఎల్లవేళలా సమాయత్తంగా ఉంటుందని తెలిపారు. గ్రామ సభలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, మండల ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాద్, నిజామాబాద్ ఏ.సీ.పీ ప్రకాష్, డీ.ఎల్.పీ.ఓ శ్రీనివాస్, ఎంపీడీఓ రాములు నాయక్, తహసిల్దార్ రేఖ, మండల వ్యవసాయ అధికారి జాదవ్ హీరా, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కమిషన్...కరప్షన్.. కలెక్షన్ కింగ్ బిగాలా గణేష్ గుప్తా

**- ప్రజా సమస్యలను పక్కనపెట్టి పదేళ్లు దోచుకున్నావు.**

**- దమ్ముంటే అభివృద్ధి పై గణపతి ఆలయం వద్ద చర్చకు రా!**

**- బిగాలపై అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ఫైర్..**



నిజామాబాద్ జూన్04:( విజన్ ఆంధ్ర ) : పదేళ్లు కమిషన్ కరప్షన్ కలెక్షన్ కింగ్ గా మారి మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా కోట్లాది రూపాయలు దోచుకున్నాడని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. అవినీతిలో కోరుకుపోయినా అర్బన్ మాజీ ఎమ్మెల్యే నాపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటని అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ ధ్వజమెత్తారు. పదేళ్ల పాలనలో ఏనాడు కూడా ప్రజా సమస్యలను పట్టించుకోకుండా దోచుకోవడమే పనిగా పెట్టుకున్నాడని ఆరోపించారు. నీకు దమ్ముంటే అభివృద్ధిపై నగరంలోని గణపతి ఆలయం వద్దకు చర్చకు రావాలని ధన్ పాల్ సూర్యనారాయణ గుప్త సవాల్ విసిరారు. అవినీతి, అభివృద్ధిపై కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొనే దమ్ము లేక మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ తనపై ఆరోపణలు చేస్తున్నారని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో అర్బన్ నియోజకవర్గ ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చిన తర్వాత మాజీ ఎమ్మెల్యే బిగాల నగరానికి ఎప్పుడో ఒకసారి వస్తున్నారన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత అసహనంతో అవగాహన లేకుండా తనపై ఆరోపణలు చేస్తున్నాడని విమర్శించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లోను 60 స్థానాల్లో ఒకటే సీటును గెలుపొంది, కనీసం ఆ ఒక్క సీటును కూడా కాపాడుకోలేని అసమర్థత నాయకుడు అని ఆరోపించారు. తాను గెలిచిన తర్వాత గతంలో ఉన్న పెండింగ్ పనులపై అధికారులు మంత్రుల దృష్టికి తీసుకెళ్లి వాటిని అభివృద్ధి పరచడానికి కృషి చేస్తున్నానన్నారు. ఇది జీర్ణించుకోలేని బిగాల అనవసర ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. బిగాల పదేళ్లు అధికారంలో ఉన్నా ..అర్బన్ నియోజకవర్గంలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ కూడా ఇప్పించలేదని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ప్రశాంత్ రెడ్డి ఉన్నాడని, ఆయనను రాజీనామా చేయమని ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. అలాగే ప్రతిష్టాత్మకంగా నిర్మించిన టీ హబ్ లో ఒక్క ప్రముఖ కంపెనీ కూడా తీసుకు రాలేదని మరి కేటీఆర్ ని రాజీనామా చేయమని నిలదీశావా అని ప్రశ్నించారు. కేవలం ఆర్థికంగా అభివృద్ధి చెందడానికే పని చేశావే తప్ప..నిజామాబాద్ అభివృద్ధికి కాదని ఎద్దేవా చేశారు. కమిషన్ కరప్షన్ కలెక్షన్ కు అలవాటు పడి పదేళ్లు పాలించాడని విమర్శించారు. ఇటీవల తాను మంత్రులపై ఒత్తిడి తేవడంతో నగరంలో 396 ఇల్లు కేటాయించారన్నారు. అలాగే మరో వారంలో నగర అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ను కలుస్తున్నట్లు తెలిపారు. ఇటీవల నగరంలోని మినీ ట్యాంకుబండ్ పై బిగాల గణేష్ గుప్తా అవగాహన లేకుండా ఆరోపణలు చేస్తున్నాడని చెప్పారు. ట్యాంక్ బండ్ కాంట్రాక్టర్ సమయం ముగియడంతో తాళాలు వేసి వెళ్లారన్నారు. కొత్త కాంట్రాక్టర్ ను నియమంచాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం, కార్పొరేషన్ పై ఉందన్నారు. అదే మినీ ట్యాంక్ బండ్ పై ఏర్పాటుచేసిన చెట్లలో అవినీతికి పాల్పడ్డ చరిత్ర బిగాలది అన్నారు. నాలుగున్నర వేల ఒక్కో చెట్టును 45 వేలుగా చూయించి దోచుకున్నారన్నారు. అలాగే కార్పొరేషన్ లో ఒక్క మనిషి విధులు నిర్వహించుకున్నా.. 330 మంది పనిచేస్తున్నట్లు రికార్డుల్లో చూయించి నెలకు 50 లక్షలు దోచుకున్నారన్నారు. ఏ శాఖలో అయినా తాను ఒక్కరూపాయి అవినీతి చేసినట్లు నిరూపిస్తే బహిరంగ చర్చకు సిద్ధమని ఎమ్మెల్యే సవాల్ విసిరారు. నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో గల గణపతి ఆలయం ముందుకు తాను వస్తానని చెప్పారు. తన హయాంలో ఒక్క గుంట భూమి కొనుగోలు చేయలేదని, బిగాల మాత్రం ఒక్క గుంట కూడా విడిచిపెట్టలేదన్నారు. అలాగే ఆర్యవైశ్యులు అంటే దానధర్మాలకు ప్రతిక అని, కానీ బిగాల మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉన్నాడన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి బీజేపీ ఫ్లోర్ లీడర్ ప్రమోద్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ జ్యోతి, కార్పొరేటర్లు చింతకాయల రాజేందర్, మఠం పవన్, బంటు ప్రీతి ప్రవీణ్, బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్, కల్పే అర్చనా చిరంజీవి, మమత శివ, సీనియర్ నాయకులు న్యాలం రాజు, పుట్ట వీరేందర్, బీజేవైఎం రాష్ట్ర కో కార్యదర్శి విజయ్, ఇల్లెందుల ప్రభాకర్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# అనంతారం గ్రామపంచాయతీ సర్పంచ్ కొర్సా రమేష్ అధ్యక్షతన గ్రామ సభ



జూలూరుపాడు జూన్ 5 జూలూరుపాడు (విజన్ ఆంధ్ర) మండలం అనంతరం క్రీడా ప్రాంగణంలో అనంతరం గ్రామపంచాయతీ సర్పంచ్ కుర్సా రమేష్ అధ్యక్షులు గ్రామసభ నిర్వహించారు. గ్రామ సభ లో జూలూరుపాడు.ఎంపీడీవో తాళ్లూరి రవి పాల్గొని మాట్లాడుతూ ఈ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ మన చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మరియు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ప్లాస్టిక్ కవర్లువాడడం వలన జరిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శైలజ జిపిఓ నాగమణి గారు హెల్త్ డిపార్ట్మెంట్ సూపర్వైజర్ వెంకటేశ్వర్లు అనంతారం స్కూల్ టీచర్స్ శంకర్ సార్ నిర్మల మేడం .ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శరన్ మిషన్ భగీరథ ఏఈ ఇరిగేషన్ ఏఈ కరెంట్ లైన్ మెన్ అంగన్వాడి సూపర్వైజర్ మరియు టీచర్ సుజాత .టీఏ జోధాబాయి ఏఎన్ఎం సావిత్రి ఫీల్డ్ అసిస్టెంట్ నాగమణి గ్రామ దీపిక లక్ష్మీ ఆశా కార్యకర్త ఝాన్సీ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# దక్షిణ మధ్య రైల్వే భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ స్టేట్ ట్రైనింగ్ కమిషనర్ గా ఎర్ర ఎలియా



హన్మకొండ జిల్లా ప్రతినిధి జూన్ 04 ( విజన్ ఆంధ్ర ) : కాజీపేట ఎలక్ట్రికల్ లోకో షెడ్ లో సీనియర్ టెక్నీషియన్ గా పదవి భాధ్యతలు నిర్వహిస్తున్న ఎర్ర ఎలియా దక్షిణ మధ్య రైల్వే భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ స్టేట్ ట్రైనింగ్ కమిషనర్ గా నియమితులైనారు. సికింద్రాబాద్ లోని రైలు నిలయం లో సౌత్ సెంట్రల్ రైల్వే స్టేట్ సెక్రటరీ శేఖర్ బాబు చేతుల మీదుగా దక్షిణ మధ్య రైల్వే స్టేట్ ట్రైనింగ్ కమిషనర్ గా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా స్టేట్ కమిషనర్ ఎలియా మాట్లాడుతూ.... దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ ట్రైనింగ్ కమిషనర్ గా భాద్యతలు నిర్వహిస్తున్న క్రమం లో ద.మ. రైల్వే అధికారులు నా సేవలు గుర్తించి నేను నాకు ఇచ్చినటువంటి పదవి భాద్యతలను ఎంత సమర్థత తో నిర్వహిస్తున్నానో వారు గుర్తించి భారత దేశ రైల్వే లో ఒకటైన (ద.మ. రైల్వే జోన్) మరియు సౌత్ కోస్ట్ రైల్వే లకు స్టేట్ ట్రైనింగ్ కమిషనర్ గా నన్ను నియమించారు. నాపై నమ్మకంతో ఇంత పెద్ద పదవి భాధ్యతలు నాకు అప్పగించినందుకు అలాగే ఇట్టి పదవి నాకు రావడం లో సహాయ సహకారాలు అందించినటువంటి రైల్వే అధికారులకు మరియు పెద్దలకు, నాతోటి ఉద్యోగులకు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థలో ఉన్నటువంటి నా సహచర మిత్ర బృందానికి, మరియు ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నాను అని అన్నారు.

# ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపడతాం...

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 4, విజన్ ఆంధ్ర : జిల్లాలో ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని అధికారుల సమన్వయంతో పకడ్బందీగా చేపడతామని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం జిల్లా ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు ఈ నెల 15వ తేదీ నుండి 24వ తేదీ వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, బూత్ స్థాయి అధికారులు తమ పరిధిలోని ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారం అందించి ధ్రువపత్రాలు జతచేసిన ఫారాన్ని తిరిగి తీసుకొని బి.ఎల్.ఓ. యాప్ లో వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఇప్పటికే రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించడం జరిగిందని, రాజకీయ పార్టీల తరఫున బూత్ స్థాయి ఏజెంట్ల జాబితాను తీసుకోవడం జరిగిందని తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గంలో 320 పోలింగ్ కేంద్రాలు, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 358 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఈ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో చేపట్టి ఎలాంటి పొరపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు జమీల్, నాయబ్ తహసిల్దార్ శ్యాం లాల్, రామ్ లాల్, సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు జిల్లా కలెక్టర్ కె హరిత




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 4: విజన్ ఆంధ్ర సరియైన అనుమతులు లేకుండా ఇసుక మట్టి తరలింపు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె హరిత అన్నారు గురువారం కాగజ్నగర్ మండలం గన్నారం మాండవ, ఆరెగూడ మరియు అనుకొడ గ్రామాలలో గల చెరువులను సందర్శించి పరిశీలించారు. నజ్రుల్ నగర్ విలేజ్ నెం.12 గ్రామ పరిధిలో మట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను తనిఖీ చేశారు. తనిఖీలో సంబంధిత వ్యక్తుల వద్ద ఎలాంటి అనుమతులు లేదా సంబంధిత పత్రాలు లేవని గుర్తించడంతో ఆ ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎవరైనా అక్రమంగా మట్టి లేదా ఇసుకను తరలించినట్లయితే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. మట్టి లేదా ఇసుక రవాణా చేపట్టే ముందు సంబంధిత శాఖల నుండి అవసరమైన అనుమతులు పొందిన తరువాత మాత్రమే తరలించాలని అన్నారు ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ మండల తహసీల్దార్ మధుకర్, రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# మంగంపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి
- ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు..
- ప్రభుత్వ బడుల్లోనే పిల్లలను చేర్పించాలి
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి
- పెద్దమందడి మండలం మంగంపల్లిలో ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక ప్రత్యేక గ్రామసభ





వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 4 (విజన్ ఆంధ్ర) : వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి జిల్లాలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి పేర్కొన్నారు. గురువారం పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ప్రత్యేక గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో పాటు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు రోడ్డు భద్రత, బాల్యవివాహాల నిర్మూలన, వర్షాకాలం నేపథ్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటు, పరిసరాల పరిశుభ్రత, వన మహోత్సవం, జల సంరక్షణ, పాఠశాలల్లో సౌకర్యాలు సహా తదితరాంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించి ప్రజల మెప్పు పొందుతుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పైనే సీఎం తొలి సంతకం చేశారని గుర్తు చేశారు. కేవలం వనపర్తి నియోజకవర్గం లోని మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం 30 కోట్ల రూపాయలు ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. ప్రజల ఆరోగ్య భద్రత కోసం ఐదు లక్షల రూపాయలు ఉన్న ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రజా ప్రభుత్వం 10 లక్షల రూపాయలకు పెంచిందన్నారు. పేద ప్రజలు విద్యుత్ భారం ఇబ్బందులు పడకుండా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తుందన్నారు. అదేవిధంగా రైతులకు రైతు భరోసాతో పాటు రెండు లక్షల రుణమాఫీని చేసి అండగా నిలుస్తుంది అని తెలిపారు. ప్రజా ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేసి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తుందని తెలిపారు. కాబట్టి ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలన్నారు. తన సొంత గ్రామమైన మంగంపల్లిని ఇందిరమ్మ ఇండ్ల పథకానికి పైలట్ గ్రామంగా ఎంపిక చేసి ఇండ్ల నిర్మాణం చేయడం జరుగుతుందని తెలిపారు. మంగంపల్లి గ్రామంలో ఒక్క పూరిగుడిస కూడా లేకుండా అన్ని పక్క ఇండ్లే ఉండే విధంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే నూతన గ్రామపంచాయతీ, అంగన్వాడీ భవనాలతో పాటు సిసి రోడ్లు డ్రైనేజీలను కూడా పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాన్ని ఇంకా అభివృద్ధి చేయడం కోసం తన వంతుగా రూ. 10 లక్షలు కేటాయిస్తానని, జిల్లా కలెక్టర్ ద్వారా మరో రూ.10 లక్షలు తెప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంగంపల్లి గ్రామంలోని ప్రతి ఇంటికి సి ఎస్ ఆర్ నిధులతో సోలార్ ఏర్పాటు చేయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలో ఇప్పటికే సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించడం జరిగిందని తెలిపారు. గ్రామంలోని ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. గ్రామంలో ఏ కార్యం జరిగిన ఐదు మొక్కలు నాటే పద్ధతిని ప్రారంభించాలని తద్వారా మన గ్రామాన్ని మోడల్ గా తీర్చిదిద్దేందుకు అడుగులు పడాలని సూచించారు. రైతులు కూడా కేవలం వరి మాత్రమే కాకుండా పంట మార్పిడి పద్ధతిని అవలంబించాలని సూచించారు. పామాయిల్ వంటి తోటలను పెట్టేందుకు మొగ్గు చూపాలన్నారు. మహిళలు కూడా ఏదైనా వ్యాపారం చేసేందుకు ముందుకు వస్తే రుణ సదుపాయాన్ని కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా నేడు నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో మంగంపల్లి గ్రామ సర్పంచ్ తో పాటు వార్డు సభ్యులందరూ ఉపాధి హామీ కింద ఇంకుడు గుంతలు తీసుకుంటామని తెలియజేయడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. మంచి నిర్ణయం తీసుకున్న గ్రామ పాలకవర్గాన్ని అభినందిస్తున్నానని తెలిపారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా గ్రామంలో భూగర్భ జలాలు పెరిగి మంచినీటి సదుపాయాలు కలుగుతాయి అన్నారు. అదేవిధంగా గ్రామంలో గత ఐదేళ్ల వ్యవధిలో 18 ఏళ్ల నుండి 50 ఏళ్లలోపు వ్యక్తులు ఎవరైనా మరణిస్తే జాతీయ కుటుంబ ప్రయోజన పథకం ద్వారా దరఖాస్తు చేసుకొని రూ. 20 వేల లబ్ధి పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం అర్హులైన ఓటర్లందరినీ జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం నిర్వహిస్తుందని ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొని అధికారులకు సహకరించాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు ఉన్నాయని కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి చదివించాలని సూచించారు. అమ్మాయిలకు బాల్యవివాహాలు చేయకుండా ఉన్నత చదువులు చదివించాలని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు మంచి ఫలితాలు వచ్చాయని కాబట్టి ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, ఎంపీడీవో పరిణత, ఎస్సై జలంధర్ రెడ్డి, వార్డు సభ్యులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, మండల అధ్యక్షులు, ప్రజలు, ఇతర అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ సమతుల్యతను కాపాడాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 4 (విజన్ ఆంధ్ర) : మొక్కలు నాటడం, ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్ పేర్కొన్నారు. గురువారం ఖిల్లా ఘనపూర్ మండలం పర్వతపురం రైతువేదికలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ప్రత్యేక గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు రోడ్డు భద్రత, బాల్యవివాహాల నిర్మూలన, వర్షాకాలం నేపథ్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటు, పరిసరాల పరిశుభ్రత, వన మహోత్సవం, జల సంరక్షణ, పాఠశాలల్లో సౌకర్యాలు సహా తదితరాంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు ఉన్నాయని కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి చదివించాలని సూచించారు. అమ్మాయిలకు బాల్యవివాహాలు చేయకుండా ఉన్నత చదువులు చదివించాలని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు మంచి ఫలితాలు వచ్చాయని కాబట్టి ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా గ్రామంలో భూగర్భ జలాలు పెరిగి మంచినీటి సదుపాయాలు కలుగుతాయి అన్నారు. ప్రభుత్వం అర్హులైన ఓటర్లందరినీ జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం నిర్వహిస్తుందని ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొని అధికారులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా గ్రామంలో గత ఐదేళ్ల వ్యవధిలో 18 ఏళ్ల నుండి 60 ఏళ్లలోపు వ్యక్తులు ఎవరైనా మరణిస్తే జాతీయ కుటుంబ ప్రయోజన పథకం ద్వారా దరఖాస్తు చేసుకొని రూ. 20 వేల లబ్ధి పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి చేతుల మీదుగా ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీఓ రఘునాథ్, గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ స్థాయి సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## షఫీ నగర్‌లో ఘనంగా రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



మల్కాజిగిరి, జూన్ 4,(విజన్ ఆంధ్ర): మౌలాలి సర్కిల్ పరిధిలోని షఫీ నగర్‌లో రోడ్డు నిర్మాణ పనులు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి.షఫీ నగర్ ప్రజలు గత కొన్ని సంవత్సరాలుగా సరైన రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, షఫీ నగర్ సుభాష్ నగర్ నివాసి, మాజీ వార్డ్ సభ్యులు కాజా భాయ్, మైనంపల్లి హనుమంతరావు దృష్టికి రోడ్డు సమస్యను తీసుకెళ్లారు. దీనికి వెంటనే స్పందించిన మైనంపల్లి హనుమంతరావు సంబంధిత అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించని తెలిపారు. బుధవారం రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో షఫీ నగర్, సుభాష్ నగర్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ మైనంపల్లి హనుమంత రావుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో 186 డివిజన్ అధ్యక్షులు పోతుల వినోద్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకన్న, నర్సింగ్, యూసుఫ్, చందు (చంద్రకాంత్), షకీల్, అజయ్, సిద్ధిక్, ఖీమ్రాజ్, రహీం, ఆజాం, పాండురంగ, చారి, ప్రేమ్ కుమార్, లక్ష్మణ్, సుభాష్ నగర్ కాలనీ ప్రెసిడెంట్ కొద్దూస్ భాయ్, బజార్ బాయ్, అబ్బో జాంగిర్ భాష పాల్గొన్నారు

## చలివేంద్రాలను విరివిగా ఏర్పాటు చేయాలి

- మైనంపల్లి శివాంక్ బాబు



మల్కాజిగిరి, జూన్ 4,(విజన్ ఆంధ్ర): వేసవికాలంలో చలివేంద్రాలను విరివిగా ఏర్పాటు చేసి ప్రజలకు తమ వంతు సేవలందించా లని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు రెండో కుమారుడు మైనంపల్లి శివాంక్ బాబు అన్నారు. మల్కాజిగిరి సిసిపిఎల్ ఎదుట ఎం ఎస్ ఎస్ ఓ, కాంగ్రెస్ సీనియర్ నాయకు డు జీఎన్వి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన సందర్శించి మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి ఎండల బారిన పడకుండా ప్రజలకు ఇలాంటి చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. దాహార్తి తీర్చి ప్రయాణికులకు ఎంతో ఉపశమనం కల్పిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వాహకుడు జీఎన్వి సతీష్ కుమార్ మాట్లాడుతూ గత 37 రోజులుగా తీవ్రంగా ఉంటున్న ఎండలను దృష్టిలో ఉంచు కుని ప్రతి రోజు ఈ చలివేం ద్రంలో చల్లని నీరు, మజ్జిగను ప్రజలకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాందాస్ సంతోష్ ముదిరాజ్, కన్న, జంగాల శ్రీరామ్ యాదవ్, పిట్టల నాగరాజు, సురేష్ సింగ్, సుధాకర్, ఇస్తారి, శ్రీధర్, రాజు, ఏకొండ చారి, సాయి తదితరులు పాల్గొన్నారు

## గ్రామాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

- రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి
- కేశవాపూర్ గ్రామసభలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హనుమంతరావు.



ములుగు జూన్ 04 విజన్ ఆంధ్ర ప్రతినిధి : వెంకటాపూర్: గ్రామాల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ప్రకటించారు. రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని సూచించారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం వెంకటాపూర్ మండలం కేశవాపూర్ గ్రామంలో జరిగిన ప్రత్యేక గ్రామసభకు కలెక్టర్ హాజరయ్యారు. గ్రామస్తుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలను సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తామని చెప్పారు. గ్రామసభలో వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులతో సమీక్షించి తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవడం వల్ల పంట నష్టపరిహారం, రుణాలు, ఇతర సంక్షేమ పథకాలు సులభంగా అందుతాయని తెలిపారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా నమోదు పూర్తి చేయించుకోవాలని రైతులకు సూచించారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామాభివృద్ధి పనులను ప్రజల అవసరాల మేరకు గుర్తించి చేపడతామని కలెక్టర్ పేర్కొన్నారు. చెరువుల పూడికతీత, రోడ్ల మరమ్మత్తు, నర్సరీల ఏర్పాటు వంటి పనులకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పెళ్లి రోజు ప్రాణదానం - మానవత్వానికి మారుపేరు

- 37 సార్లు రక్తదానంతో రికార్డ్ సృష్టించిన ఆదర్శ ఉపాధ్యాయుడు
- "సేవే నా సంబరం" అంటున్న రాజుపేట సార్ పోషన్న




ములుగు జూన్ 04 , విజన్ ఆంధ్ర ప్రతినిధి : పెళ్లి రోజు అంటే పూలూ, కేకులు, వేడుకలేనా? కాదు... ప్రాణం పోయడమే అసలైన వేడుక అని నిరూపించాడు ఒక ఉపాధ్యాయుడు. మంగపేట మండలం రాజుపేట ఈ యం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కొత్తపల్లి పోషన్న తన వివాహ వార్షికోత్సవం రోజున 37వ సారి రక్తదానం చేసి రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచారు.

**పెళ్లి రోజు కానుక - ప్రాణదానం**

బుధవారం హన్మకొండ ప్రతిమ హాస్పిటల్‌లో బి నెగిటివ్ రక్తం కోసం అత్యవసర పరిస్థితిలో ఉన్న చెరుకు శోభాదేవి కి తన రక్తాన్ని దానం చేసి మరోసారి మానవత్వం చాటారు పోషన్న సార్. "నా పెళ్లి రోజు పండుగను రక్తదానంతోనే జరుపుకుంటాను. అదే నాకు దేవుడిచ్చిన వరం" అని ఆయన చెప్పిన మాటలు విన్న ప్రతి ఒక్కరి కళ్లు చెమర్చాయి.

**37 సార్లు - అంటే 111 ప్రాణాలు**

37 సార్లు రక్తదానం అంటే ఒక్క ప్రాణం కాదు... కనీసం 111 మందికి పునర్జన్మ ఇచ్చినట్టే. బి నెగిటివ్ అత్యంత అరుదైన రక్తగ్రూప్ కావడంతో సార్ సేవ విలువ ఇంకా రెట్టింపు అయ్యింది. ప్రతిసారి ఫోన్ వచ్చిన వెంటనే ఆఫీసు సెలవు పెట్టి హాస్పిటల్‌కు పరుగులు తీసే సార్ నిజమైన "లైఫ్ సేవర్ గ నిలిచారు.


**పర్యావరణ దినోత్సవం - డబుల్ సేవ**

జూన్ 5 అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం రోజే తన పెళ్లి రోజు కావడం విశేషం. "రక్తదానం చేసి మనిషికి ప్రాణం పోస్తాను, మొక్కలు నాటి భూమికి ప్రాణం పోస్తాను. ఇదే నా జీవిత లక్ష్యం" అని చెప్పే సార్ మాటలు నేటి సమాజానికి స్ఫూర్తి.

**విద్యార్థులకు ఆదర్శం**

తరగతి గదిలో ఆంగ్ల పాఠాలు చెప్పడమే కాదు... జీవిత పాఠాలు కూడా చెబుతున్నారు ."మార్కులు కాదు, మనసు సంపాదించు" అని విద్యార్థులకు చెప్పే పోషన్న సార్ తనే ఆ మాటకు నిలువెత్తు నిదర్శనం. సార్ సేవను చూసి రాజుపేట గ్రామస్తులు, సహ ఉపాధ్యాయులు, విద్యార్థులు గర్వపడుతున్నారు. "ఇలాంటి గురువు మాకు దొరకడం మా అదృష్టం" అంటున్నారు వారంతా. లిసెల్యూట్ పోషన్న సార్!లి మీ సేవ నిరంతరం కొనసాగాలని, మీలాంటి ఆదర్శాలు వేల మందికి స్ఫూర్తి కావాలని మా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం అంటున్నారు

## లక్నవరం సరస్సును సందర్శించిన జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.



ములుగు జూన్ 04, విజన్ ఆంధ్ర ప్రతినిధి : గోవిందరావుపేట మండలం లక్నవరం సరస్సును గురువారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ లక్నవరం సరస్సు పరిసర ప్రాంతాలను, ఉయ్యాల వంతెన,పర్యాటకులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, త్రాగునీరు, మరుగుదొడ్లు,పరిశుభ్రత ,బోటింగ్ భద్రతా వంటి అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

## ప్రజాకళ సాంస్కృతిక మహోత్సవంలో ఆకట్టుకున్న" కవి సమ్మేళనం", "అజరామరం" పద్య నాటకం




హైదరాబాద్ జూన్ 2026, విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ. విశ్వనాథ్) : తెలంగాణ ప్రజాకళ 99 రోజుల సాంస్కృతిక మహోత్సవంలో భాగంగా రవీంద్రభారతి "పాల్కురికి సోమన్న మూల" వేదికపై మంగళవారం 63 వ రోజు న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా కవి సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు రాయారావు సూర్య ప్రకాష్ రావు అధ్యక్షతన 22 మంది కవులు వారి కవిత్వాలు వినిపించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్. ఏనుగు నర్సింహ్మారెడ్డి రచయితలను సత్కరించారు. కవి సమ్మేళనానికి ముందు సారథి కళాకారులు విద్యానందాచారి, బాలుప్రసాద్, అమూల్య, స్పందన, బందంరాజు తదితరులు తెలంగాణ ఆవిర్భావ గీతాలతో అలరించారు. సాంస్కృతిక మహోత్సవంలో భాగంగా బుధవారంనాడు 64 వ రోజు ప్రధాన కార్యక్రమానికి ముందు సారథి కళాకారులు రేలారే ప్రసాద్, విద్యానందాచారి, బాలుప్రసాద్, అమూల్య, జ్యోత్స్న సామాజిక చైతన్య గీతాలు, ప్రభాతభేరికి సంబంధించిన గీతాలతో ప్రేక్షకులను అలరించారు. అనంతరం ప్రముఖ రచయిత దోరవేటి రచన, దర్శకత్వంలో "అజరామరం" చారిత్రాత్మక పద్యనాటకాన్ని కలకారులు అత్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంశలను అందుకున్నారు. ఈ పద్య నాటకానికి కీబోర్డు పై శంకర్ మాస్టర్, తబలా పైన శశి భూషణ్ సంగీత సహకారం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్. ఏనుగు నర్సింహ్మారెడ్డి, నటీనటులని సత్కరించారు. కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ సిబ్బంది పాల్గొన్నారు. శ్రీనివాస్ రాజు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

## మన వాడ శుభ్రమే మన పట్టణ అభివృద్ధి

- 99 రోజుల ప్రజాపాలనలో 4వ వార్డు సభ ఘనం.
- ప్రజల భాగస్వామ్యంతో పట్టణ అభివృద్ధికి పిలుపునిచ్చిన చైర్‌పర్సన్ చంద్రకళ బిక్షపతి.




ములుగు జూన్ 04, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ప్రజల భాగస్వామ్యమే పట్టణ ప్రగతికి పునాది అని ములుగు మున్సిపల్ చైర్‌పర్సన్ చంద్రకళ బిక్షపతి స్పష్టం చేశారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం ములుగు మున్సిపాలిటీ 4వ వార్డులో నిర్వహించిన వార్డు సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రజలకు దిశానిర్దేశం చేశారు. 4వ వార్డు కౌన్సిలర్ గుంటోజు పావని ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన ఈ సభకు మున్సిపల్ కమిషనర్ కూడా హాజరయ్యారు. ప్రజల సమస్యలు స్వయంగా అడిగి తెలుసుకుని తక్షణ పరిష్కారానికి హామీ ఇచ్చారు.

**మన ఇల్లు మన వాడ మన పట్టణం**

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ చంద్రకళ మాట్లాడుతూ "మన ఇల్లు శుభ్రంగా ఉంటే మన వాడ శుభ్రంగా ఉంటుంది, మన వాడ శుభ్రంగా ఉంటే మన పట్టణం శుభ్రంగా ఉంటుంది" అంటూ పరిశుభ్రత ప్రతి పౌరుడి బాధ్యత అని గుర్తు చేశారు. వర్షాకాలం దృష్ట్యా తడి చెత్త, పొడి చెత్త వేరుచేసి సేకరించాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

**సీజనల్ వ్యాధులపై అవగాహన**

వర్షాకాలంలో ప్రబలే డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులను నివారించేందుకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమల నివారణ చర్యలు తప్పనిసరిగా పాటించాలని అవగాహన కల్పించారు. "ముందు జాగ్రత్తే మందు" అని ప్రజలకు సూచించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి చదువు, క్రీడలు, ఉపాధి వైపు మళ్లాలని చైర్‌పర్సన్ సూచించారు. "మన పట్టణ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది" అని యువతకు దిశానిర్దేశం చేశారు. కౌన్సిలర్ గుంటోజు పావని మాట్లాడుతూ...... 4వ వార్డు అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, ప్రతి సమస్యకు తక్షణ స్పందన ఉంటుందని హామీ ఇచ్చారు. 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటామని చెప్పారు. ఈ వార్డు సభ ప్రజల నుండి విశేష స్పందన లభించింది. స్థానికులు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం పొందారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, వార్డు సభ్యులు, మహిళా సంఘాలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జూన్ 11 నుండి "థియేటర్ అండ్ ఫిల్మ్ యాక్టింగ్ వర్క్‌షాప్"



హైదరాబాద్ జూన్ 2026, విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ. విశ్వనాథ్ ) : మీరు నటన వృత్తిని ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నారా, నటన, నృత్యం, స్టంట్స్, వాయిస్-ఓవర్, యాంకరింగ్, వాయిస్ యాక్టింగ్, స్క్రిప్ట్ విశ్లేషణ లో కెరీర్ ప్రారంభించాలని అనుకుంటున్నారా, అయితే డిజిక్వెస్ట్ అకాడమీ, స్టేజ్2స్క్రీన్ యాక్టింగ్ అండ్ ఫిల్మ్ అకాడమీ సంయుక్త నిర్వహణలో హైదరాబాద్ లోని అంతిమ బహుభాషా థియేటర్ అండ్ ఫిల్మ్ యాక్టింగ్ వర్క్‌షాప్‌లో చేరండని తెలిపారు. ఈ బహుభాషా థియేటర్ వర్క్‌షాప్ ను ప్రముఖ డైరెక్టర్, యాక్టర్, అడ్లా సతీష్ కుమార్ ఇతర సినీ ప్రముఖుల నేతృత్వంలో జూన్ 11 నుండి ఆగస్టు 16 2026 వరకు నిర్వహిస్తున్నట్లు అడ్లా సతీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వందకు పైగా విజయవంతమైన నటులు, రచయితలు, దర్శకులు అవార్డు గెలుచుకున్న చిత్రనిర్మాతలను, సర్వతోమఖ నైపుణ్యాలు ప్రావీణ్యంతో ఎంతోమంది కళాకారులను విజయవంతంగా తయారు చేసిన అనుభవంతో భారతదేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన నిర్మాణ సంస్థలకు ప్లేస్‌మెంట్సహాయంతో, ప్రత్యేకమైన పెర్క్‌లతో ఫోటోషూట్, ప్రొఫెషనల్ షోరీల్, నిరంతర కాస్టింగ్ మద్దతుతో, 8 వారాల పాటు సమర్థవంతమైన ఇంటరాక్టివ్ సెషన్లను, డిజిక్వెస్ట్ అకాడమీ స్టూడియోస్, 6వ అంతస్తు, మందాని కాంప్లెక్స్, సోమాజిగూడ, హైదరాబాద్ (అపోలో ఫార్మసీ పైన) ఔత్సాహిక్కుల కోసం నిర్వహిస్తున్నట్లు అడ్లా సతీష్ కుమార్ ప్రకటనలో తెలిపారు. అవుట్‌స్టేషన్ సహాయం స్థానికేతర విద్యార్థులకు హాస్టల్ వసతి సహాయం అందుబాటులో ఉందని తెలిపారు. బ్యాచ్ నిండిపోయేలోపు మీ స్థానాన్ని సురక్షితం చేసుకోవాలని, ఈ వర్క్‌షాప్ నుండి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నామని తెలిపారు. అభిరుచి గలవారు వివరాలకోసం డైరెక్ట్ వాట్స్ యాప్ మెసేజ్ క్రింది నెంబర్ల ద్వారా మమ్మల్ని సంప్రదించండి లేదా 9573585137, 7306311225 నంబర్ల పై కాల్ చేయవలసిందిగా సతీష్ కుమార్ ప్రకటనలో తెలిపారు.

## కరీంనగర్ గ్లోబల్ సిటీగా మారే దిశగా అడుగులు వేస్తుంది..
# ఇది తెలంగాణకే గర్వకారణం...

### కరీంనగర్ బహుత్ తేజీ సే ఏక్ గ్లోబల్ సిటీ బన్నే కీ ఓర్ బఢ్ రహా హై....!యే తెలంగాణ కా గౌరవ్ హై.... !!

### స్మార్ట్ సిటీ కా మతలబ్ సిర్ఫ్ టెక్నాలజీ నహీం, బల్కి లోగోం కీ జిందగీ కో ఆసాన్ బనానా హై....

### ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ సమావేశంలో పూర్తి హిందీ ప్రసంగంతో ఆకట్టుకున్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్




కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) జూన్ 04.కరీంనగర్ బహుత్ తేజీ సే ఏక్ గ్లోబల్ సిటీ బన్నే కీ ఓర్ బఢ్ రహా హై....యే తెలంగాణ కా గౌరవ్ హై.... (కరీంనగర్ చాలా వేగంగా ఒక గ్లోబల్ సిటీగా మారే దిశగా అడుగులు వేస్తోంది. ఇది తెలంగాణ కే గర్వకారణం.) అని నగర మేయర్ కొలగని శ్రీనివాస్ అన్నారు. ఉత్తరాఖండ్ రాష్ట్రం ఋషి కేష్ లో జరిగిన ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ 117 వ సమావేశంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పై వ్యాఖ్యలు చేశారు. జూన్ 3 , నాలుగు తేదీల్లో ఋషికేష్ జరిగిన ఆల్ ఇండియా మేయర్స్ సమావేశాల్లో పాల్గొన్న కోలగాని శ్రీనివాస్ ముందుగా సమావేశంలో పాల్గొన్న ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి , రాష్ట్ర మంత్రులు , ఎంపీలు , సహచర మేయర్లు , అధికారులందరికీ నమస్కారాలు తెలియజేసి కరీంనగర్ స్మార్ట్ సిటీ , అర్బన్ డెవలప్మెంట్ గురించి హిందీలో తన ప్రసంగాన్ని కొనసాగించి అందర్నీ ఆకట్టుకున్నారు. ముఖ్యంగా స్మార్ట్ సిటీ కా మతలబ్ సిర్ఫ్ టెక్నాలజీ నహీం, బల్కి లోగోం కీ జిందగీ కో ఆసాన్ బనానా హై....(స్మార్ట్ సిటీ అంటే కేవలం సాంకేతికత మాత్రమే కాదు, ప్రజల జీవితాలను సులభతరం చేయడం.)అని అన్నారు. కరీంనగర్, తెలంగాణలోని ఒక ముఖ్యమైన ,వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరమని, దీనిని కేంద్ర ప్రభుత్వ 'స్మార్ట్ సిటీ మిషన్' కింద ఎంపిక చేశారన్నారు. కరీంనగర్‌ను ఒక ఆధునిక నగరంగా మార్చడానికి అనేక పెద్ద మార్పులుజరుగుతున్నాయన్నారు నగరంలో స్మార్ట్ రోడ్లు, మంచి ఫుట్‌పాత్‌లు , డ్రైనేజీలు , నగరం మొత్తంలో సీసీటీవీ కెమెరాలు కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా భద్రతను పెంచడానికి అనేక కార్యక్రమాలుజరుగుతున్నాయన్నారు. ప్రధానంగా కరీంనగర్‌లో స్వచ్ఛమైన నీరు, మంచి డ్రైనేజీ వ్యవస్థ , మెరుగైన రోడ్లు, అందమైన పార్కులను నిర్మించి ప్రజలకు ఒక మెరుగైన వాతావరణాన్ని అందించే ప్రయత్నం జరుగుతుందని తెలిపారు. అంత్ మే ఓర్ ఏక్ బాత్ గర్వ్ సే కహనా చాహేతా ఇస్ మొకే పర్... "తెలంగాణ రాజ్య కే గఠన్ కే బాద్ పహేలీ బార్ కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పర్ బిజెపి నే కబ్జా కియా ఔర్ మేయర్ కీ కుర్సీ హాసిల్ కీ. యహ్ తెలంగాణ బిజెపి కే లియే ఏక్ ఐతిహాసిక్ జీత్ జైసీ హై."(చివరగా ఓ విషయాన్ని ఈ సందర్భంగా గర్వముగా చెప్పదలుచుకున్నా.. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావనంతరం ప్రప్రదమంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ను బిజెపి కైవసం చేసుకుంది..ఇది తెలంగాణలో నే బీజేపీకి ఒక చారిత్రక విజయం లాంటిది అన్నారు.

# ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయానికి పాలకమండలి ఎప్పుడు?

### - మూడేళ్లుగా మృగ్యమైన ధర్మకర్త నియామకం..!

పాపన్నపేట, 04 జూన్, (విజన్ ఆంధ్ర) ; ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మెదక్ జిల్లా ఏడుపాయల వన దుర్గా భవాని ఆలయానికి పూర్తిస్థాయి ధర్మకర్తల మండలి



(ట్రస్ట్ బోర్డు) నియామకం జరగక మూడేళ్లు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి చలనం లేకపోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. వార్షిక ఆదాయం కోట్లలో ఉన్న ఈ ఆలయానికి ప్రత్యేక కమిటీ లేకపోవడంతో, ప్రస్తుతం పాలన అంతా అధికారుల పర్యవేక్షణలోనే సాగుతోంది.

పాతబీకొత్త అనే రాజకీయ నినాదంతో తీవ్ర పోటీ.

రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత ఏడుపాయల ఆలయ చైర్మన్ పదవి కోసం స్థానిక అధికార పార్టీ నాయకుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. సోషల్ మీడియాలో, భక్తులలో గుర్తింపు ఉన్న ప్రజాదరణ పొందిన వ్యక్తుల పేర్లు ప్రచారంలోకి వచ్చినప్పటికీ, రాజకీయ సమీకరణాలు మరియు అంతర్గత విభేదాల వల్ల దేవాదాయ శాఖ ఈ నియామకాన్ని వాయిదా వేస్తూ వస్తోంది.అధికారుల పాలనలోనే ఉత్సవాలు:గత కొన్నేళ్లుగా మంజీరా నది వరదలు, ఆలయ పరిసరాల పునర్నిర్మాణ పనుల వల్ల ప్రభుత్వం నియామకాల కంటే అభివృద్ధిపైనే ఎక్కువ దృష్టి పెట్టింది. పాలకమండలి లేని లోటు భక్తులకు తెలియకుండా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (EO) మరియు జిల్లా కలెక్టర్



ఆధ్వర్యంలోనే మొన్నటి మహాశివరాత్రి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

**భక్తుల డిమాండ్:**

ఆలయ సర్వాంగీణ అభివృద్ధి, భక్తుల సౌకర్యాల మెరుగుదలకు కేవలం అధికారుల పాలన సరిపోదని, తక్షణమే 14 మంది సభ్యులతో కూడిన పూర్తిస్థాయి ట్రస్ట్ బోర్డును మరియు చైర్మన్‌ను నియమించాలని స్థానిక ప్రజలు, భక్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందడమే లక్ష్యం!!

**- ప్రజల భాగస్వామ్యంతోనే సమగ్ర అభివృద్ధి**

**- అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే ప్రగతి**

**- రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**




పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 4 (విజన్ ఆంధ్ర) : గోదావరిఖనిలోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో గురువారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన క్లస్టర్ స్థాయి ప్రత్యేక వార్డు సభకు రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన స్థానిక ప్రజాసమస్యలు, నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ స్థానిక అవసరాలను గుర్తించి, వాటి పరిష్కారానికి తగిన ప్రణాళికలతో ముందుకు సాగాలని అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, నగర పరిధిలోని అన్ని డివిజన్లలో ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు వంటి కనీస మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న అన్ని రకాల అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత కాలపరిమితిలోగా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను గట్టిగా ఆదేశించారు. ప్రభుత్వ పరంగా అందుతున్న వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ఎలాంటి అవకతవకలు లేకుండా, అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారునికి నేరుగా చేరేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన తెలిపారు. కేవలం ప్రభుత్వ ప్రయత్నాలే కాకుండా, ప్రజల చురుకైన భాగస్వామ్యంతోనే నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఈ సందర్భంగా ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, రామగుండం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ ప్రజలకు మరింత మెరుగైన, పారదర్శకమైన సేవలు అందించే దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో నిరంతరం శ్రమించాలని పిలుపునిచ్చారు. స్థానిక ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి, వాటిని వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎంతో ఉత్సాహంగా సాగిన ఈ ప్రత్యేక వార్డు సభ కార్యక్రమంలో నగర మేయర్, స్థానిక కార్పొరేటర్లు, వివిధ విభాగాల ప్రభుత్వ అధికారులు, నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులతో పాటు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు, మహిళలు పాల్గొని విజయవంతం చేశారు.

## సీఎం రేవంత్ రెడ్డికి శివసేన రెడ్డి ఘన స్వాగతం



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 4 (విజన్ ఆంధ్ర) : ఉమ్మడి పాలమూరు జిల్లా రైతాంగానికి సాగునీటి, తాగునీరు కష్టాలను దూరం చేయడమే లక్ష్యంగా ప్రాజెక్టుల సందర్శనార్థం రెండ్రోజుల పర్యటనకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గురువారం డిసిసి చీఫ్, శాట్స్ చైర్మన్ శివసేన రెడ్డి ఘన స్వాగతం పలుకుతూ... పూల బొకే ఇచ్చి, శాల్వాతో సన్మానం చేశారు. అనంతరం ప్రాజెక్టు పనుల పురోగతిపై ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించిన ఫోటో గ్యాలరీని, ఫోటో ఎగ్జిబిషన్ ప్లానింగ్ మ్యాప్ ను ముఖ్యమంత్రి, మంత్రులతో కలిసి వీక్షించారు.

# 'నేల' నమ్మకానికి సరికొత్త విలువ..!!



### - ల్యాండ్ వాల్యూ అప్, కొత్త ధరలకు గ్రీన్ సిగ్నల్
### - నేటి నుంచే కొత్త భూముల ధరలు
### - వ్యవసాయ భూమికి రూ.2.75 లక్షలు
### - గజం ధర ఫిక్స్, ఏరియావారీగా కొత్త విలువలు
### - ధరల పెంపు రియల్ ఎస్టేట్ ల్యాండ్ మార్కెట్ హీట్ పెంచనుందా

## "రీడ్ ది స్టోరీ" విజన్ ఆంధ్ర..

**హైదరాబాద్, జూన్ 4 :**

తల్లి లాంటి భూమి.. కేవలం మట్టి కాదు, ఒక సెంటిమెంట్. తాత ముత్తాతల కాలం నాటి జ్ఞాపకం.. రేపటి తరం భవిష్యత్తుకు భరోసా. అలాంటి మన నేలతల్లి విలువ రేపటి నుంచి సరికొత్తగా మారబోతోంది. తెలంగాణవ్యాప్తంగా భూముల కొత్త మార్కెట్ విలువలు నేటి నుంచే అమల్లోకి రానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం సరికొత్త ధరలను ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకుంది. పల్లె గుండె నుంచి ఐటీ హబ్ మెరుపుల వరకు.. ఈ సరికొత్త మార్కెట్ రేట్లు ఎలా ఉన్నాయో ఒకసారి చూద్దాం.




**పల్లె సీమల్లో పసిడి పంట..**

వ్యవసాయ భూముల కనీస ధర ఎంతంటే? కంటికి రెప్పలా కాపాడుకునే వ్యవసాయ భూములకు ఇకపై మరింత గౌరవం దక్కనుంది. రాష్ట్రంలో వ్యవసాయ భూముల కనీస ధరను ఎకరాకు రూ.2.75 లక్షలుగా ప్రభుత్వం ఖరారు చేసింది. పల్లెల్లో కష్టపడే రైతు శ్రమకు, వారి స్థిరాస్తికి ఇదొక బలమైన భరోసా ఇవ్వనుంది.

**గ్రేటర్ పరిధిలో 'గ్రేట్' రేట్లు.. ఖాజాగూడ టాప్!**

నగర కలల సౌధాలకు డిమాండ్ మామూలుగా లేదు. మహానగర విస్తరణలో భాగంగా సరికొత్త నంబర్లు నమోదయ్యాయి. గ్రేటర్ పరిధిలో ఎకరం కనీస ధర రూ. 15 లక్షలుగా నిర్ణయించారు. ఇక అన్నింటికంటే హాట్ టాపిక్‌గా నిలిచింది ఖాజాగూడ. ఇక్కడ గరిష్టంగా ఎకరం ధర అక్షరాలా రూ. 30 కోట్లుగా పేర్కొంది ప్రభుత్వం. అవును, మీరు చదివింది నిజమే.. ఐటీ హబ్ సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచిన ఈ ప్రాంతంలో భూమి బంగారం కంటే విలువైందిగా మారిపోయింది.

**గజం చొప్పున.. ఎక్కడ ఎంత? (ప్లాట్ల కనీస ధరలు)**

మీరు ఇల్లు కట్టుకోవాలన్నా, భవిష్యత్తు కోసం దాచుకోవాలన్నా.. చదరపు గజానికి ప్రభుత్వం నిర్ణయించిన కనీస రేట్లు ఇలా ఉన్నాయి.

**గ్రామీణ ప్రాంతాలు రూ. 600**
**మున్సిపాలిటీలు రూ. 1,000**
**కార్పొరేషన్లు రూ. 1,500**
**హెచ్ఎండిఏ పరిధి రూ. 2,000**

**మట్టితో బంధం.. మారిన విలువ!**

రియల్ ఎస్టేట్ గ్రాఫ్‌లు మారవచ్చు, రిజిస్ట్రేషన్ల విలువ పెరగవచ్చు. కానీ ఒక సామాన్యుడికి భూమి అనేది కేవలం ఒక డాక్యుమెంట్ కాదు.. అది వారి జీవితకాల కష్టం, పిల్లల పెళ్ళిళ్లకు కొండంత అండ, కష్టాల్లో ఆదుకునే ఆత్మబంధువు. రేపటి నుంచి మారబోయే ఈ కొత్త ధరలు సామాన్యుడి సొంతింటి కలను ఎలా ప్రభావితం చేస్తాయో, మార్కెట్‌లో ఎలాంటి




ప్రకంపనలు సృష్టిస్తాయో చూడాలి! మొత్తానికి మీ భూమి, మీ ఆస్తి.. నేటి నుంచి కొత్త విలువతో మెరవబోతోంది.

**- గడ్డం రాజు**
స్పెషల్ కరస్పాండెంట్ (విజన్ ఆంధ్ర)

# శంషాబాద్ తర్వాత తెలంగాణలోనే అతిపెద్ద ఎయిర్‌పోర్ట్..

### - ఆదిలాబాద్‌లో మార్గం సుగమం

ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 04 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్రంలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం తర్వాత మరో ప్రతిష్టాత్మకమైన, అతిపెద్ద ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి అడుగులు పడ్డాయి. రక్షణ శాఖ (డిఫెన్స్), సివిల్ ఏవియేషన్ (సివిల్ ఏవియేషన్) సంయుక్తంగా ఆదిలాబాద్‌లో 1,980 ఎకరాల విస్తీర్ణంలో జాయింట్ ఎయిర్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చురుగ్గా చర్యలు చేపడుతున్నాయి. ఈ ప్రాజెక్టు పట్టాలెక్కితే వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లా పారిశ్రామికంగా, ఆర్థికంగా సరికొత్త పుంతలు తొక్కడం ఖాయంగా కనిపిస్తోంది.

**భూసేకరణకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్**



ఈ ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం అడిగిన దానికి మించి భూమిని కేటాయించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది. ప్రస్తుతం రక్షణ శాఖ ఆధీనంలో ఉన్న 400 ఎకరాల భూమి కాకుండా, అదనంగా మరో 1,550 ఎకరాలు కావాలని కేంద్రం కోరింది. దీనికి స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఏకంగా 1,580 ఎకరాల భూమిని ఇచ్చేందుకు సిద్ధమైంది. ఇందులో 1,500 ఎకరాలను రక్షణ శాఖకు, 80 ఎకరాలను ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా కి కేటాయించనున్నారు. అంతేకాకుండా, విమానాల రాకపోకలకు ఆటంకంగా ఉన్న 740 కేవీ విద్యుత్ లైన్లను ₹360 కోట్ల వ్యయంతో తొలగించేందుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేస్తూ కేంద్రానికి అధికారిక లేఖ పంపింది.

**జాయింట్ సెక్రటరీకి ప్రతి ని అందించిన ఎమ్మెల్యే పాయల్ శంకర్**

ఈ ప్రాజెక్టును వేగవంతం చేసే ప్రక్రియలో భాగంగా.. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ గురువారం రక్షణ శాఖ జాయింట్ సెక్రటరీ మహంతిని ప్రత్యేకంగా కలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 1,580 ఎకరాల భూమిని కేటాయించడానికి సిద్ధంగా ఉందనే అధికారిక పత్రాన్ని (ప్రతిని) ఆయనకు అందజేశారు.

**బహుళ ప్రయోజనాలతో ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్**

ఈ జాయింట్ ఎయిర్‌ఫీల్డ్ ద్వారా అటు భారత వాయుసేన ట్రైనింగ్ సెంటర్, ఇటు పౌర విమానయాన రవాణా కార్యకలాపాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందనున్నాయి.

**పారిశ్రామిక కారిడార్‌తో మారనున్న జిల్లా రూపురేఖలు**

శంషాబాద్ తర్వాత అంతటి పెద్ద ఎయిర్‌పోర్ట్ ఇక్కడ రానుండటంతో జిల్లాలో పరిశ్రమల స్థాపనకు భారీ అవకాశాలు మెండుగా ఉన్నాయి. దీనికి తోడు, ఆదిలాబాద్‌లో పరిశ్రమల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇప్పటికే మరో 2,000 ఎకరాలలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఎయిర్‌పోర్ట్, ఇండస్ట్రియల్ కారిడార్ రెండూ తోడైతే ఈ ప్రాంత యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు**

ఎయిర్‌పోర్టు నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నేతలకు ఆదిలాబాద్ జిల్లా ప్రజల తరఫున, వ్యక్తిగతంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ మరియు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిల చొరవను ఈ సందర్భంగా కొనియాడారు. ఈ మెగా ప్రాజెక్టుతో ఆదిలాబాద్ జిల్లా సరికొత్త అభివృద్ధి దిశగా అడుగులు వేయబోతోందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.